



మంగళవారం 16.09.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 151 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



# సంతృప్తే.. కొలమానం

మానవీయ కోణంలో పని చేయండి... క్షేత్ర స్థాయిలో పర్యటించండి

డబుల్ ఇంజన్ సర్కార్.... డబుల్ డిజిట్ గ్రోత్

వారసత్వ ఆస్తులను ఆక్రమించే వాళ్ల ఆటలు కట్టించాలి

జీఎస్టీ సంస్కరణల ఫలాలు అందరికీ అందాలి

నాలుగో కలెక్టర్ల కాన్ఫరెన్స్ తొలి రోజు సమావేశంలో సీఎం దిశా నిర్దేశం

కొత్తగా నియమితులైన కలెక్టర్లకు ప్రజల తరపున అభినందనలు తెలిపిన సీఎం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** "కలెక్టర్లు, అధికారులు మానవీయ కోణంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. ఆఫీసులో కూర్చొని పేపర్ మీద చూస్తే అంతా చక్కగా ఉంటుంది.. సవ్యంగానే కన్పిస్తుంది. క్షేత్ర స్థాయిలో పర్యటించాలి. వాస్తవాలు గ్రహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. సచివాలయంలోని ఐదో బ్లాకులో సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్ ప్రారంభం అయింది. తొలి రోజున వివిధ అంశాలపై చర్చించారు. జిల్లాల్లో ప్రగతి, సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్షించడంతో పాటు... కేటగిరీల వారీగా శాఖలపై సీఎం సమీక్షించారు. లాజిస్టిక్స్, ఇన్ఫ్రా, స్వచ్ఛాంధ్ర, సర్క్యులర్ ఎకానమీ వంటి అంశాలపై చర్చించారు. సూపర్ సిక్స్, పీ4 అమలు వంటి అంశాల అమలు ఏ విధంగా జరుగుతున్నాయోననే అంశాన్ని కలెక్టర్లకు వివరించారు. నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని, అలాగే జీఎస్డీపీ గ్రోత్ వంటి అంశాలపై సీఎం దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."కొత్తగా నియమితులైన కలెక్టర్లకు ప్రజలు, క్యాబినెట్ తరపున శుభాభినందనలు. కలెక్టర్లు తమను తాము నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రధాని, సీఎం తర్వాత కలెక్టర్లే అత్యంత కీలకమైన వ్యక్తులు. జిల్లా రూపు రేఖల్ని మార్చటంలో వారిదే ప్రధాన బాధ్యత. ప్రభుత్వం రూపొందించిన విధానాలను సక్రమంగా అమలు చేసేది కలెక్టర్లే. సీఎస్, డీజీపీల నుంచి క్షేత్రస్థాయి వరకూ సరైన వ్యక్తి సరైన చోట ఉండాలనే లక్ష్యంతో నియమాకాలు చేశాం. అన్ని కోణాల్లో ఆలోచించి ఎమ్మెల్యేల అభ్యర్థుల ఎంపిక, కేబినెట్ కూర్పు చేశాం. అదే తరహాలో సమర్థులైన వారి కోసం కలెక్టర్ల పోస్టింగులు చేపట్టాం. దీనికి అనుగుణంగా పని చేయాలి. మంచి పేరు తెచ్చుకునేలా కలెక్టర్లు పని చేయాలి. పని తీరు చక్కగా ఉన్న వాళ్లను నేను ఎప్పు డూ మార్చలేదు. ప్రభుత్వం అందించే సేవలన్నిటిలోనూ సంతృప్త స్థాయే కొలమానం అవుతుంది. సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాలకు ఎంతటి ప్రాధాన్యం ఇస్తారో... శాంతి భద్రతల మిగతా 2లో...



## ప్రజా సంతృప్తి పెరగాలి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ పథకాల అమలులో ప్రజల సంతృప్తి శాతం పెరిగేలా జిల్లా కలెక్టర్లు, అధికారులు పనిచేయాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ జిల్లా కలెక్టర్లకు సూచించారు. సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలు వినూత్నంగా ఉంటాయని, ఆయన ఆలోచనలు ఎంతో ముందుచూపుతో ఉంటాయన్నారు. ఆయన ఆలోచనలు, ఆకాంక్షలను ప్రజలవద్దకు చేర్చి, అవి ప్రతిఫలించేలా కృషి చేయడంలో జిల్లా కలెక్టర్లదే మిగతా 2లో...

## సంక్షేమం.. దానం కాదు
# సాధికారతకు మార్గం

హాస్టళ్లకు కొత్త లుక్ రావాలి... హాస్టళ్ల నిర్మాణాలకు, మరమ్మతులకు నిధులిస్తాం


యువత ఉపాధి కోసం జాబ్ మేళాలు నిర్వహించండి

త్వరలో శాశ్వత కుల ధృవపత్రాలు

విద్యా రుణాలపై వడ్డీ భారం తగ్గించేలా త్వరలో కొత్త పథకం

ప్రాంతాల మధ్య అభివృద్ధిలో పోటీ

తొలిరోజు కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** సంక్షేమం అంటే పేదలకు చేసే దానం కాదు... వారి అభివృద్ధికి, సాధికారతకు మార్గం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు అన్ని మార్గాలను వినియోగించుకుందామని చెప్పారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాకులో జరిగిన తొలి రోజు కలెక్టర్ల కాన్ఫరెన్సులో భాగంగా ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ ప్రోగ్రామ్‌లు, సూపర్ సిక్స్ పథకాల అమలు, డ్వాక్రా, మెప్మా గ్రూపుల పనితీరు వంటి అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..." ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా మిగతా 2లో...

## భూకబ్జాలను నిరోధించేందుకు
# ప్రత్యేకం చట్టం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ప్రజల మైత్రీగా, ఫాస్ట్ ట్రాక్‌గా మార్చే దిశగా సోమవారం కలెక్టర్ల సదస్సు విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రసంగించిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్ తెలిపారు, "రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కూటమి ప్రభుత్వం స్థిరంగా ఉండాలి. భూ వ్యవస్థను ప్రజలకు సౌకర్యంగా, పీపుల్స్ ఫ్రెండ్లీగా మార్చడానికి కలెక్టర్ల సహకారం అత్యవసరం. ముఖ్యమంత్రి కలెక్టర్లకు ఇచ్చిన స్వేచ్ఛను సద్వినియోగం చేసుకోండి" అని సూచించారు. మంత్రులు భూకబ్జాలను నివారించేందుకు ప్రత్యేక చట్టాన్ని ప్రవేశపెట్టినట్లు, ఫ్రీహోల్డ్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లను అరికట్టే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వివాదాల్లేని 22 ఏళ్ల భూములను జాబితా నుంచి తొలగించే విధంగా కలెక్టర్లు చర్యలు చేపట్టాలి. ప్రైవేటు పేర్లతో రిజిస్ట్రేషన్ జరిగిన భూములను రద్దు చేసే అధికారాన్ని కలెక్టర్లకు ఇచ్చినట్లు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను 15 నిమిషాల్లో పూర్తిచేయడం, డాక్యుమెంట్లను వెంటనే ఇవ్వడం కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు చెప్పారు. గత పాలకుల వల్ల ఏర్పడిన భూ వివాదాలు, పీజీఆర్‌ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను క్రమంగా పరిష్కరిస్తున్నామని మంత్రి తెలిపారు. పేదరిక నిర్మూలన, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కలెక్టర్లు, అధికారులు కలిసి కృషి చేయాలి. మిగతా 2లో...

## రాష్ట్రంలో సౌర విప్లవం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో విద్యుత్ రంగ అభివృద్ధి, పునరుత్పాదక ఇంధన విస్తరణకు ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రణాళికలు రూపొందించింది. నాలుగవ కలెక్టర్ల సమావేశంలో ముఖ్య కార్యదర్శి విజయానంద్ పునరుత్పాదక ఇంధన, విద్యుత్ సరఫరా ఆధునీకరణపై సమగ్ర వివరణ ఇచ్చారు. రాబోయే అక్టోబర్ 2025 నుంచి మార్చి 2026 వరకు రాష్ట్రం 12,762 మెగావాట్ల అంచనా పీక్ లోడ్‌కు సిద్ధంగా ఉందని, రోజువారీ వినియోగం 207 నుంచి 250 యూనిట్ల మధ్య ఉండనుందని తెలిపారు. మొత్తం స్థాపన సామర్థ్యం 21,728 మెగావాట్లు ఉండగా, దాదాపు సగం పునరుత్పాదక వనరుల నుంచి వస్తుందన్నప్పటికీ, వాటి అనిశ్చిత స్వభావం వల్ల 24 గంటల వినియోగాన్ని తీర్చడంలో సవాళ్లు ఎదురవుతున్నాయని చెప్పారు. విద్యుత్ సబ్సిడీ పథకాలను విజయవంతంగా అమలు చేశామని, ధోబీ ఘాట్లకు ఉచిత విద్యుత్, పవర్ లూమ్‌లకు నెలకు 500 యూనిట్లు, హ్యాండ్‌లూమ్‌లకు నెలకు 200 యూనిట్లు, హెయిర్ కటింగ్ సెలూన్‌లకు నెలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ సరఫరా కొనసాగుతోందని తెలిపారు. మిగతా 2లో...

## ప్రతి మంగళవారం 'ఇండస్ట్రీ డే'



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ ఎస్ గ్రీవెన్స్ డే లాగానే ప్రతి మంగళవారం ఇండస్ట్రీడే కార్యక్రమం నిర్వహించాలని పరిశ్రమల శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్. యువరాజ్ జిల్లా కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర పారిశ్రామిక రంగానికి సంబంధించి ఆయన సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో ప్రజంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర జీఎస్డీపీలో 44 శాతం వాటా పారిశ్రామిక రంగమే అందిస్తోందన్నారు. జిల్లాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలు, సంస్థలతో జిల్లా కలెక్టర్లు స్వయంగా సంప్రదింపులు జరిపి క్షేత్ర స్థాయిలో వారికి ఎదురవుతున్న సమస్యలు తెలుసుకుని వాటిని తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలు స్థాపించాలంటే ఎవరికైనా భూమి చాలా ముఖ్యమని, పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూ సేకరణకు జిల్లా కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రభుత్వ భూములు లభ్యత లేనిచోట మిగతా 2లో...

## 17.11 శాతం...
# ఈ ఏడాది వృద్ధి రేటు లక్ష్యం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆర్థిక ఇబ్బందులున్నా రాష్ట్రం ఆర్థికంగా పరుగులు తీస్తోందని ఆర్థిక శాఖ వెల్లడించింది. ఆ ఈ ఆర్థిక సంవత్సరం 17.11 శాతం వృద్ధి రేటు సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకున్నామని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ వెల్లడించారు. కలెక్టర్ల సదస్సులో భాగంగా సోమవారం రాష్ట్ర స్థూలోత్పత్తి (జీఎస్డీపీ)పైన ఆయన ప్రజంటేషన్ ఇచ్చారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేవలం 8.60 శాతం జీఎస్డీపీ వృద్ధి రేటు నమోదు చేసుకున్న ఆంధ్రప్రదేశ్, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో వృద్ధి రేటు పరుగులు తీస్తోందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం 17,11 శాతం వృద్ధిరేటు సాధించాలన్నదే లక్ష్యమని, అలాగే 2028-209 ఆర్థిక సంవత్సరానికి 16.26 శాతం వృద్ధి రేటు నమోదవుతుందని అంచనా వేశారు. ఈ ఆర్థిక సంవత్సరం మిగతా 2లో...



## రోడ్లకు మహర్దశ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఈ సంవత్సరం డిసెంబరు నెలకల్లా రాష్ట్రంలోని అన్ని రహదారులను గుంతల రహిత రహదారులుగా మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఈ లక్ష్య సాధనకు జిల్లా కలెక్టర్లందరూ దృష్టి సారించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణ బాబు కోరారు. కలెక్టర్ల సదస్సులో భాగంగా ఆయన రాష్ట్రంలో రహదారుల పరిస్థితిపై ప్రజంటేషన్ ఇచ్చారు. రహదారులు చాలా ముఖ్యమైన అంశమని, జిల్లాల్లో గుంతల రహిత రహదారులుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం 19వేల కిలోమీటర్ల రోడ్లను రూ.860 కోట్ల వ్యయంతో గుంతల రహిత రహదారులుగా మార్చిందన్నారు. తదుపరి మరో 5946 కిలోమీటర్ల రోడ్లను మిగతా 2లో...

## భూకబ్జాలను నిరోధించేందుకు ప్రత్యేకం చట్టం

(మొదటి పేజీ తరువాయి)

పీ4 కార్యక్రమం, పరిశ్రమల అభివృద్ధి, రీసర్వే నిర్వహణ, నీటి తీరువా వడ్డీ రద్దు వంటి అంశాల్లో కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలి. అలాగే, నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు వారిని సురక్షితంగా స్వస్థలాలకు రప్పించడంలో మంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజా సంతృప్తి పెరగాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన పాత్ర పోషించాలన్నారు. ప్రభుత్వ పథకాలు జిల్లాల్లో సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత కూడా కలెక్టర్లేదనని, పథకాల అమలులో ప్రజా సంతృప్తి స్థాయి పెరిగేలా కృషి చేయాలన్నారు. గతంలో ప్రణాళిక శాఖ అంటే కేవలం ఏదో గణాంకా నమోదుకు మాత్రమే పరిమితమైన శాఖగా ఉండేదని, ఇప్పుడు ఆ శాఖను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ఆ శాఖను ఎంతో కీలకమైన శాఖగా మార్చారన్నారు. మనందరం కూడా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కలిసి పనిచేద్దామని ఆయన కలెక్టర్లకు పిలుపునిచ్చారు.

## రాష్ట్రంలో సౌర విప్లవం

(మొదటి పేజీ తరువాయి)

రైతులకు రోజుకు 9 గంటల ఉచిత విద్యుత్ లభిస్తున్నదని వివరించారు. రాష్ట్రంలో 2,93,587 వ్యవసాయ పంప్‌లను సౌర విద్యుత్‌కు మార్చే ప్రాజెక్టు ప్రకటించారు. మార్చి 2026 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని, మొత్తం సామర్థ్యం 1,163 మెగావాట్లుగా ఉంటుందని తెలిపారు. రూఫ్‌టాప్ సౌర విద్యుత్ ప్రాజెక్టులపై కూడా పనులు కొనసాగుతున్నాయి. తిరుపతి జిల్లాలో నారావారిపల్లె, చిత్తూరు జిల్లాలో నాడిమూరు పైలట్ ప్రాజెక్టులు విజయవంతమై, మొత్తం సామర్థ్యం 393 కిలోవాట్లు ఉంది. ఆరు లక్షల వినియోగదారుల కోసం 1,198 కిలోవాట్ల సామర్థ్యంతో రూఫ్‌టాప్ ప్రాజెక్టుల టెండర్లు ప్రకటించబడ్డాయని తెలిపారు. జిల్లాల వారీ విద్యుత్ వినియోగంలో ఆసక్తికర మార్పులు వెల్లడించారు. తిరుపతి జిల్లా 1,448 యూనిట్ల వినియోగంతో అత్యధికంగా నిలిచింది, ఎన్టీఆర్ జిల్లా 1,032 యూనిట్లతో రెండో, గుంటూరు జిల్లా 923 యూనిట్లతో మూడో స్థానంలో ఉంది. ఫీడర్ విభజన, లాస్ తగ్గింపు కార్యక్రమాల ద్వారా విద్యుత్ సరఫరాను మెరుగుపరిచినట్లు వివరించారు. నాలుగవ వేలకొలువు ప్రాంతాలలో ఫీడర్ విభజన పనులు చేపట్టబడ్డాయి. 1,657 పనులు పూర్తయ్యాయి, 1,672 పురోగతిలో ఉన్నాయి. ప్రతి నియోజకవర్గంలో సీసీ, ఎస్టీ, బీసీ వర్గాల వినియోగదారుల రూఫ్‌టాప్ ఇన్‌స్టాలేషన్లను పరిశీలించి మానిటర్ చేయమని కలెక్టర్లకు సూచించారు. సాంద్ర బయోగ్యాస్ కేంద్రాలు, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు భూములను గుర్తించి, జిల్లా వారీ ప్రాజెక్టులు కేటాయించాలని ఆదేశించారు. పీఎం–కుసమ్ పథకంలో సౌర ప్రాజెక్టులు సజావుగా అమలవ్వడానికి, అవసరమైతే సమస్యలను తక్షణ పరిష్కరించడానికి సరైన సమన్వయం చేయమని తెలియజేశారు.

## రోడ్లకు మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

గుంతల రహితదారులుగా మార్చడానికి రూ.500 కోట్లు మంజూరు చేశామన్నారు. 8744 కిలోమీటర్ల జాతీయరహదారులను కూడా గుంతలు రహిత రహదారులుగా మార్చామన్నారు. రాష్ట్రంలో 4223 కిలో మీటర్ల మేర రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయని, వాటిని బాగు చేయడానికి రూ.2వేల కోట్లు అవసరమవుతాయన్నారు. అలాగే పీపీపీ మోడ్‌లో 12,653 కిలో మీటర్ల రోడ్లను అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. మొదటి దశలో 18 రోడ్లు ఈ విధానంలో చేపట్టాలనుకున్నామని, ఇప్పటికే 12 రోడ్లు ఈ విధానంలో చేయడానికి అనుకూలంగా ఉన్నాయని గుర్తించామన్నారు. అలాగే ఎలాంటి భూ సేకరణ అవసరం లేకుండా ఉన్న రోడ్లను పీపీపీ మోడ్‌లో అభివృద్ధి చేయడానికి అనుకూలంగా 4 రోడ్లు ఉన్నాయని వాటిని తక్షణం ఈ విధానం కింద అభివృద్ధి చేయనున్నామని చెప్పారు.

**భూ సేకరణపై దృష్టి సారించాలి :**

రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి భూసేకరణ ప్రధాన అవరోధంగా మారిందన్నారు. జిల్లాల్లో కలెక్టర్లు ఎక్కడెక్కడ భూ సేకరణ సమస్యలున్నాయో వాటిపైన దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 89 జాతీయ రహదారి ప్రాజెక్టులకు సంబంధించి 850 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉందని చెప్పారు. ఈ భూ సేకరణ వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలన్నారు.

**వానాకాలంలో ఎకోఫిక్స్ రక్ష :**

వర్షా కాలంలో రోడ్లపైన గుంతలు పూడ్చుడానికి ఎకోఫిక్స్ ను ఉపయోగించనున్నామన్నారు. సెంట్రల్ రోడ్ రీసెర్చి ఇన్సిటిట్యూట్ (సీఆర్ ఆర్ ఐ) సంస్థ రూపొందించిన ఈ ఎకోఫిక్స్ చాలా బాగా పనిచేస్తుందని, వర్షాకాలంలో గుంతలు పడిన చోట్ల దీంతో గుంతలు పూడ్చితే వర్షాలకు కొట్టుకుపోకుండా మంచిగా పనిచేస్తోందన్నారు. ఇప్పటికే దీన్ని మందడం, విజయవాడలో ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నామన్నారు. ఈ రెండు చోట్లా తమకు మంచి ఫలితాలు వచ్చాయన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రమంతటా ఎకోఫిక్స్‌తో గుంతలు పూడ్చనున్నామన్నారు. ఇదే సంస్థ సహకారంతో అనంతపురం జిల్లాలోని కోనవారిపల్లి–వంగనూరు రోడ్డును స్టీల్ స్లాగ్‌తో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రతి జిల్లాలోనూ కనీసం ఒక ప్లాస్టిక్ రోడ్డు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

## ప్రతి మంగళవారం 'ఇండస్ట్రీ డే'

(మొదటి పేజీ తరువాయి)

ప్రైవేటు భూములు సేకరించాలంటే వారితో మాట్లాడి ల్యాండ్ పూలింగ్ విధానంలో భూసేకరణ చేపట్టాలన్నారు. భూ సేకరణ విషయంలో జిల్లా కలెక్టర్లు సంక్లిష్టంగా కాకుండా కొంత సరళీకృతంగా పనిచేయాలన్నారు. ఆయా జిల్లాల్లో ప్రతి ప్రాజెక్టు గ్రౌండింగ్ అవ్వడానికి ఒక కాలపరిమితి పెట్టుకుని ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో ప్రతి ఎకనామిక్ హబ్‌కు ఒక జిల్లా అధికారిని నియమించి, ఆ ఎకనామిక్ హబ్‌లో ఎదురవుతున్న సవాళ్లు, సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాల్లో పరిశ్రమలు రావాలంటే అక్కడ కలెక్టర్లు ఎలా పనిచేస్తున్నారనేది చాలా ముఖ్యమన్నారు. ఎంఎస్ ఎంఈలపైన కూడా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చేవి ఎంఎస్ ఎంఈలేనని తెలిపారు.

**రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం**

కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక జూన్ 2024 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో రూ.10,06,799 కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించి 122 ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చిందని వెల్లడించారు. ప్రస్తుతమున్న 30 క్లస్టర్లు, రాబోయే 20 క్లస్టర్లకు సంబంధించి లక్ష ఎకరాలకు పైగా ఖాళీ స్థలాలు గుర్తించామన్నారు. జిల్లా కలెక్టర్లందరూ ఈ భూసేకరణకు సంబంధించి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. రాష్ట్రంలో ఐదు చోట్ల డిఫెన్స్ క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విశాఖపట్నం–శ్రీకాకుళం జిల్లాల మధ్య 3 వేల ఎకరాల్లో నావల్ క్లస్టర్, ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో 3 వేల ఎకరాల్లో మిస్సైల్, అమ్యూనిషన్ క్లస్టర్, కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 3 వేల ఎకరాల్లో అన్ మ్యాన్డ్ సిస్టమ్ క్లస్టర్, అనంతపురం జిల్లా మడకశిర–లేపాక్షిల మధ్య 4–5వేల ఎకరాల్లో ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ క్లస్టర్స్, ప్రకాశం జిల్లా దొనకొండలో 4 వేల ఎకరాల్లో ఎయిర్‌క్రాఫ్ట్ విడిభాగాల తయారీ క్లస్టర్ ఏర్పాటు కాబోతున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోపే కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పారిశ్రామిక రంగానికి సంబంధించి 50కి పైగా ప్రాజెక్టులకు అనుమతిచ్చిందని వెల్లడించారు. వీటి పైన కూడా జిల్లా కలెక్టర్లు ఎక్కువ దృష్టి సారించాలని సూచించారు.

# సంతృప్తే .. కొలమానం



(మొదటి పేజీ తరువాయి)

విషయంలో కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలి. ఇక్కడ పని చేసిన అధికారులు ఆర్బీఐ లాంటి సంస్థలకు వెళ్లారు. నేను అధికారులకు పూర్తిగా సపోర్ట్ అందిస్తాను. కానీ విఫలమైతే మాత్రం కఠినంగానే నిర్ణయాలు తీసుకుంటా. కలెక్టర్ల సదస్సు కొత్త ట్రెండ్‌ను సృష్టించాలని కోరుతున్నాను." అని సీఎం చెప్పారు.

**ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత మాది... మీది :** "ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని అమలు చేస్తున్నాం. అందరినీ సాధికారిత దిశగా నడిపిస్తామని చెప్పిన హామీని విశ్వసించే ఎన్డీఏ కూటమికి 94 శాతం స్ట్రైక్ రేట్ ఇచ్చారు. సంపద సృష్టించి ఆదాయాన్ని పెంచి సంక్షేమం అమలు చేస్తామని చెప్పాం. కలెక్టర్లు, అధికారులు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలి. చెప్పినట్టుగా సూపర్ సిక్స్‌ను సక్సెస్ చేశాం. దేశంలోనే అతిపెద్ద సంక్షేమ పథకం పెన్షన్లు. 64 లక్షల మంది లబ్ధిదారులకు పెన్షన్ ఇస్తున్నాం. తల్లికి వందనం ద్వారా చదువుకునే ప్రతి విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్నాం. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు వెళ్లే పరిస్థితులు వచ్చాయి. ఉచిత బస్సు అమలు చేయలేమని కొందరు విమర్శించారు. కానీ స్త్రీశక్తి పథకం సక్సెస్ అయింది. 50 శాతం మహిళల్ని వంటింటికే పరిమితం చేస్తే వారి శక్తియుక్తులు వృథా అవుతున్నాయి. రాష్ట్రాభివృద్ధికి మహిళా శక్తి కీలకం. ఉచిత బస్సు ప్రయాణం–స్త్రీశక్తి పథకం ఆర్థిక వ్యవస్థలో చాలా మార్పు తెస్తుంది. పథకం అమలు తర్వాత 90 శాతం మేర ఆర్టీసీలో ఆక్యుపెన్సీ పెరిగింది. ఆర్టీసీ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలుపుతున్నా. దీపం2 పథకం ద్వారా ఏడాదికి ఉచితంగా 3 సిలిండర్లు ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ ద్వారా మొదటి విడతలో రూ. 7 వేలు ఇచ్చాం. ఆటో డ్రైవర్లకు కూడా రూ. 15 వేలను అక్టోబరు 1 తేదీన ఇస్తాం. సమాజంలోని అన్ని వర్గాలకూ అవకాశాలు రావాలి... ప్రతిఫలాలు అందాలి. గతంలో గడ్డు పరిస్థితుల్లో ఉన్న రాయలసీమ... ఇప్పుడు కోనసీమతో సమానంగా ఉంది. రాయలసీమలో డ్రిప్ ఇరిగేషన్ లాంటి విధానాలతో సమర్ధనీటి నిర్వహణ ద్వారా మంచి ఫలితాలు సాధించాం. పట్టిసీమతో డెల్టాలో వాడే కృష్ణానీటిని పొదుపు చేసి శ్రీశైలం ద్వారా రాయలసీమకు నీళ్లు ఇవ్వగలిగాం. ప్రస్తుతం హంద్రీనీవా ప్రధాన కాలువను 100 రోజుల్లో పూర్తి చేసి కుప్పం వం–కూ కృష్ణా నీళ్లు తీసుకెళ్లాం. గోదావరిలో వేలాది టీఎంసీల నీళ్లు సముద్రంలోకి వృథాగా పోతున్నాయి. సమర్ధ నీటి నిర్వహణతో రిజర్వాయర్లు నింపాం. వాణిజ్య పంటల విషయంలోనూ సరైన సమయానికి నిర్ణయాలు తీసుకుని లాభం వచ్చేలా చేయాలి." అని సీఎం వివరించారు.

**జీఎస్టీ సంస్కరణలపై క్షేత్రస్థాయి ప్రచారం:** "వారసత్వంగా వచ్చిన ఆస్తులను వివాదాలను సృష్టించి కాజేసే పరిస్థితి నుంచి మార్చాలి. గతంలో భూ వివాదాలను సృష్టించారు. రెవెన్యూ వ్యవస్థను చిన్నాభిన్నం చేశారు. దీన్ని సరి చేయాలి. రిజిస్ట్రేషన్ పత్రాలను ట్యాంపర్ చేయకుండా ఉండేలా రూపొందించే విధానం ఉండాలి. ఇక జీఎస్టీ రెండో దశ సంస్కరణల ఫలాలు ప్రజలందరికీ అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి. దీనిపై ఒక నెలపాటు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. దేశంలోనే అతితక్కువ లాజిస్టిక్స్ వ్యయం ఏపీలో ఉండాలి. జాతీయ, రాష్ట్ర రహదారులపై గుంతలు ఉండటానికి వీల్లేదు. మానవ వనరుల నైపుణ్యంపై కూడా దృష్టి సాధించాలి. స్వచ్ఛభారత్, సర్క్యులర్ ఎకానమీ కూడా మనకు కీలకం అవుతుంది. కాలుష్య రహిత పర్యావరణం ఉండాలి. ఐటీ సేవల్లో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలి. ఆదాయార్జన శాఖలు మరింత సమర్ధవంతంగా పని చేయాలి. హెల్త్, వెల్త్, హ్యాపీతో పాటు ఈజ్ ఆఫ్ లివింగ్ ముఖ్యమైన అంశం కావాలి." అని చంద్రబాబు చెప్పారు.

**విజన్ డాక్యుమెంటే... భగవద్గీత, ఖురాన్, బైబిల్ :** "డబుల్ ఇంజన్ సర్కార్–డబుల్ డిజిట్ గ్రోత్ ఉండాలన్న లక్ష్యంతోనే పని చేస్తున్నాం. 2047 వరకూ 15 శాతం వృద్ధి రేటు సాధించాలన్న లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. ప్రస్తుతం వృద్ధిరేటు 10.5 శాతం ఉంది. ఈ ఏడాది తలసరి ఆదాయాన్ని రూ. 3.47 లక్షలకు తీసుకెళ్లాలని ప్రయత్నిస్తున్నాం. 2029 నాటికి రూ. 29 లక్షల జీఎస్డీపీ లక్ష్యం. అప్పటికి రూ. 4.67 లక్షల తలసరి ఆదాయం లక్ష్యంగా మనం పని చేయాలి. భారత్ నెంబర్ 1 కావాలన్న ఆకాంక్షతోనే ప్రధాని మోదీ పని చేస్తున్నారు. భారత ఆర్థిక వ్యవస్థ 11వ స్థానం నుంచి 4 స్థానానికి చేరుకుంది. మరో 22 ఏళ్లలో స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తి అవుతుంది. ఆ సమయానికి భారత్ కూడా అగ్రస్థానానికి చేరుకుంటుంది. కేంద్రం 2047 వికసిత్ భారత్ ప్రణాళిక తయారు చేస్తే... ఏపీ 2047 స్వర్ణాంధ్ర విజన్ రూపొందించింది. ఇది అధికారులందరికీ భగవద్గీత, బైబిల్, ఖురాన్ కావాలి. భారత్ అభివృద్ధికి తోడుగా ఆంధ్రప్రదేశ్ కూడా అగ్రస్థానానికి ఎదగాలి." అని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కలెక్టర్ల సమావేశంలో మంత్రులు, సీఎస్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సంక్షేమం.. దానం కాదు సాధికారతకు మార్గం

(మొదటి పేజీ తరువాయి)

సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. సంక్షేమం – అభివృద్ధి రంగాలకు సమతూకంగా నిధులు ఖర్చు చేస్తున్నాం. మూలధన వ్యయం కూడా చేస్తూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాం. ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం, తల్లికి వందనం అందరికీ అందించాం. లబ్దిదారులకు సాయం అందే విషయంలో తలెత్తే చిన్నచిన్న లోటుపాట్లను కలెక్టర్లు సరిదిద్దాలి. మెగా డీఎస్సీ ద్వారా యువతకు 16,347 ఉద్యోగాలు వచ్చాయి. ఇప్పటికే 6 వేలకు పైగా పోలీసు విభాగంలో ఉద్యోగాలిచ్చాం. ప్రభుత్వ విభాగాల్లో ఖాళీలను గుర్తించి భర్తీ చేస్తాం. ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక గిరిజన యువతకే ఉద్యోగాలు ఇచ్చేలా ఉన్న జీవో–3ను సుప్రీం కోర్టు రద్దు చేసింది. దీనిపై ఏం చేయాలనే అంశంపై ఆలోచన చేస్తున్నాం. అలాగే ప్రైవేటు రంగంలోనూ జాబ్స్ వచ్చేలా పెట్టుబడులు ఆకర్షిస్తున్నాం. జిల్లాల్లో యువతకు ఉద్యోగాలు వచ్చేలా జాబ్ మేళాలు ఏర్పాటు చేయాలి." అని ముఖ్యమంత్రి వివరించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం స్త్రీ శక్తి విజయవంతమైంది. ఈవీ బస్సులతో ఖర్చు తగ్గుతుంది. కమర్షియల్ కాంప్లెక్సుల నిర్మాణం, కార్గో ద్వారా ఆర్టీసీ ఆదాయం సమకూర్చుకోవచ్చు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకం ద్వారా ఏటా రూ. 33 వేల కోట్ల వ్యయం చేస్తున్నాం. అక్టోబరు 1వ తేదీన 3 లక్షల మంది ఆటో డ్రైవర్లకు రూ. 15 వేల ఆర్థిక సాయం చేస్తాం." అని చంద్రబాబు పేర్కొన్నారు.

**అన్ని వర్గాలకూ అండగా... :**

వడ్డెర్లకు క్వారీల్లో రిజర్వేషన్లు పెట్టడంతో పాటు సీనరేజీలో మినహాయింపు ఇస్తాం. ఇమామ్, మౌజన్లకు కూడా గౌరవవేతనం ఇస్తున్నాం. విజయవాడలో హజ్‌హౌస్ త్వరలోనే పూర్తి అవుతుంది. హజ్ యాత్రికులకు రూ. 1 లక్ష ఆర్థిక సాయం చేస్తున్నాం. మసీదుల నిర్వహణకు నెలకు రూ. 5 వేలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నాం. కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినాన్ని రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహిస్తున్నాం. అన్ని దేవాలయ ట్రస్ట్ బోర్డుల్లోనూ బ్రాహ్మణులకు చోటు కల్పించాం. నిర్మాణ రంగంలో వర్కర్ల సంక్షేమం కోసం కూడా బోర్డు ఏర్పాటు చేస్తున్నాం. శాశ్వత కుల ధృవీకరణ పత్రం కూడా త్వరలోనే జారీ చేస్తున్నాం. అల్లూరి సీతారామరాజు పేరును భోగాపురం ఎయిర్ పోర్టుకు పెడతాం. కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించాం. తోట చంద్రయ్య, అమర్నాథ్ గౌడ్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యలపై విచారణకు ఆదేశించాం. మత్స్యకారుల సేవలో భాగంగా వేట నిషేధ సమయంలో రూ. 20 వేలు ఇస్తున్నాం. ఎవరికీ అన్యాయం జరక్కుండా ఎస్సీ వర్గీకరణను కూడా విజయవంతంగా పూర్తి చేశాం. డ్రైవర్ల సాధికారిక సంస్థ ఏర్పాటు చేసే అంశం పరిశీలిస్తున్నాం. నాయీ బ్రాహ్మణులకు రూ. 25 వేల చొప్పున వేతనం ఇస్తున్నాం. అర్చకులకు గౌరవ వేతనం రూ. 15 వేలకు పెంచాం. వేద విద్యార్థులకు రూ. 3 వేలు ఇస్తున్నాం. జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కేటాయించే అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం. అసంపూర్తిగా ఉన్న కాపు భవనాలను పూర్తి చేసేలా కార్యాచరణ చేస్తున్నాం. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారిని ఆదుకునేందుకు కార్యాచరణ చేపట్టాం. రజకులకు దోబీ ఘాట్లు, షెడ్లు, ఇస్త్రీ చేయడానికి ఆధునిక మౌలిక వసతులు కల్పించాలి. 200 యూనిట్లు హ్యాండ్లూమ్‌కు, 500 యూనిట్లు పవర్ లూమ్స్ ఉన్నవారికి ఉచితంగా విద్యుత్ ఇస్తున్నాం." అని ముఖ్యమంత్రి వివరించారు.

**విద్యార్థికి చేయూత-వైద్యానికి భరోసా :**

"పాఠశాలల్లో ఉన్న వసతులతో 10 తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా చూడాలి. ఉన్నత విద్య చదువుకునే విద్యార్థులకు కేంద్రం నుంచి పావలా వడ్డీ కింద ఎంతైనా రుణం తీసుకునే అవకాశం ఉంది. ఆ వడ్డీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించేలా విధానాలను రూపొందించండి. సంక్షేమ హాస్టళ్లను కలెక్టర్లు తప్పని సరిగా సందర్శించాలి. విద్యార్థులకు ఇచ్చే ఆహారం, నీరు, వారికిచ్చే దుప్పట్లు, మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలి. అన్ని సంక్షేమ హాస్టళ్ల పునర్నిర్మాణానికి ఎంత వ్యయం అవుతుందో అంచనా వేయండి. అవసరమైతే రాత్రి పూట నిద్రచేసి అక్కడ పరిస్థితుల్ని మార్చండి. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లను మెరుగుపర్చేందుకు నిధులు కొరతలేదు. ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లల్లో చదివే విద్యార్థులు ఐఐటీ, ఐఐఎం వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో సీట్లు సాధించేలా మరింత కృషి చేయాలి. ఇప్పటికే హాస్టళ్లల్లో చదువుకున్న విద్యార్థులు ప్రతిష్టాత్మక సంస్థల్లో సీట్లు సాధిస్తున్నారు. ఆ సంఖ్య మరింత పెరగాలి. ఆ దిశగా కలెక్టర్లు ఫోకస్ పెట్టాలి. గతంలో చాలా మంది అధికారులు ఏజెన్సీ ప్రాంతాల్లో పని చేసేందుకు ఉత్సాహం చూపేవారు. ఎస్ఆర్ శంకరన్ లాంటి వారు దానికి ప్రత్యక్ష ఉదాహరణ. శంకరన్ వంటి వారిని నేటి తరం కలెక్టర్లు ఆదర్శంగా తీసుకోవాలి. కలెక్టర్లు తమ టాలెంట్ తో కొత్త పంథాలో పాలన చేపట్టాలి. యూనివర్సల్ హెల్త్ సర్వీసుల కింద రూ. 2.5 లక్షల భీమా రాష్ట్రంలో ప్రజలందరికీ వర్తిస్తుంది. జన ఔషధి కింద జనరిక్ మెడిసిన్స్ కూడా అందుబాటులోకి తీసుకువచ్చాం. 9 గంటల పాటు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. పీ4 మరో గేమ్ చేంజర్ కార్యక్రమం. వాలంటరీగానే అంతా ముందుకు వస్తున్నారు. బలవంతం ఉండదు. పీ4, డ్వాక్రా, మెప్మాను ఇంటిగ్రేట్ చేసి ముందుకు వెళ్లండి. డ్వాక్రా, మెప్మా, పీ4 లాంటి కార్యక్రమాలతో ఇచ్చిన చేయూతతో ఏ మేరకు జీవన ప్రమాణాలు పెరిగాయో చూడాలి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, వర్గాల్లో తలసరి ఆదాయం పెంచేందుకు కృషి చేయాలి." అని చంద్రబాబు వెల్లడించారు.

**ప్రాంతాల మధ్య పోటీ ఉండాలి... అభివృద్ధి పరుగులు పెట్టాలి :**

"అభివృద్ధిలో ఉత్తరాంధ్ర దూసుకెళ్తోంది. ఉత్తరాంధ్రతో రాయలసీమ పోటీ పడుతోంది. ఉత్తరాంధ్రలో ఆర్సెలార్ మిట్టల్, టీసీఎస్, గూగుల్ వంటి సంస్థలు వస్తున్నాయి. రాయలసీమలో లేపాక్షి నుంచి ఓర్వకల్లు వరకూ పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తాయి. శ్రీసిటీతో పాటు తిరుపతి కేంద్రంగానూ పరిశ్రమలు వస్తున్నాయి. టూరిజం సర్క్యూట్ల ఏర్పాటు ద్వారా ఆర్థిక ఎకోసిస్టం ఏర్పాటు అవుతుంది. ఎంఎస్ఎంఈలను కూడా ప్రోత్సహించేలా పాలసీలను తీసుకువచ్చాం. పోర్టులు, ఎయిర్ పోర్టులు కూడా వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం. గ్రీన్ ట్యాక్స్‌ను కూడా రద్దు చేశాం. సీ–వీడ్ కల్చర్‌ను లాజికల్‌గా తీసుకెళ్తే పెద్దఎత్తున ఆర్థిక లబ్ది చేరే అవకాశం ఉంటుంది. బయోఫ్యూయెల్ సహా వివిధ రకాలుగా సీ–వీడ్ వినియోగం పెరిగింది. అవసరమైతే దాని కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేద్దాం." అని ముఖ్యమంత్రి చెప్పారు.

## 17.11 శాతం... ఈ ఏడాది వృద్ధి రేటు లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

మొదటి త్రైమాసికంలోనే 19.18 శాతం వృద్ధి రేటు సాధించిందని, ఇది ఆలిండియా వృద్ధి రేటు 8.8 శాతం కంటే మించి 10.50 శాతం సాధించామని తెలిపారు. మొదటి త్రైమాసికంలో వ్యవసాయ రంగం రూ. 81,496 కోట్లతో 13.52 శాతం, పరిశ్రమల రంగం రూ. 92,843 కోట్లతో 23.25 శాతం, సేవల రంగం రూ. 1,57,321 కోట్లతో 22.14 శాతం వృద్ధి రేటును నమోదు చేసుకుందన్నారు. గత ఆర్థిక సంవత్సరానికి ఈ సంవత్సరానికి మధ్య గణనీయమైన వృద్ధి రేటు సాధించనున్నట్లు తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ. 15,93,063 కోట్లతో 12.02 శాతం వృద్ధి రేటు నమోదు చేసుకుంటే ఈ ఆర్థిక సంవత్సరం దానికంటే ఎక్కువగా 18,65,704 కోట్లతో 17.11 శాతం వృద్ధి రేటు సాధించనున్నట్లు చెప్పారు. గ్రాస్ వేల్యూ యాడెడ్ (స్థూల విలువ జోడింపులో) గత ఏడాది 9.4 శాతం నమోదు కాగా, ఈ ఏడాది 10.76 శాతం నమోదైందన్నారు. తయారీ రంగంలో 10 శాతం వృద్ధి నమోదు చేస్తోందన్నారు. 2028–29 నాటికి ఈ వృద్ధి రేటు దాదాపుగా 30వేల కోట్లకు చేరుకోనుందని తాము అంచనా వేస్తున్నట్లు చెప్పారు.

**తొలిసారిగా మండల స్థాయిలోనూ వృద్ధి రేటు మథింపు**

రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా ప్రణాళిక శాఖ జిల్లాల్లోని మండల స్థాయి వరకు కూడా వృద్ధి రేటును మథింపు చేస్తూ జిల్లా స్థూల ఉత్పత్తి (గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ %-% జీడీడీపీ) విధానాన్ని ప్రారంభించామని తెలిపారు. జిల్లా కలెక్టర్లందరూ తప్పనిసరిగా తమ జిల్లాల్లోని వృద్ధి రేటు వివరాలన్నీ కూడా ప్రతి నెలా మండల స్థాయిలో డేటా ఎంట్రీ 5వ తేదీలోపు జిల్లా స్థాయిలో 8వ తేదీలోపు పూర్తి చేయాలని, ప్రతి నెలా 15వ తేదీ ముఖ్యమంత్రి ఆయా జిల్లాలు సాధిస్తున్న జీఎస్డీపీ వృద్ధి రేటు వివరాలను సమీక్షిస్తారని తెలిపారు. కాబట్టి జిల్లా కలెక్టర్లందరూ కూడా దీనిపైన ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని కోరారు.

పీ4లో 21 లక్షల కుటుంబాల గుర్తింపు

రాష్ట్రంలో పేదరిక నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన పీ4 బంగారు కుటుంబం మార్గదర్శి కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే 21 లక్షల కుటుంబాలను గుర్తించామని అలాగే 10 లక్షల కుటుంబాలను అనుసంధానించామన్నారు.

**స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాల సాధన లక్ష్యం**

స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరం రూ. 18.65 లక్షల జీఎస్డీపీ సాధించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామని పీయూష్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ ప్లాన్ సాధన కోసం జిల్లాకో ప్రత్యేక అధికారిని నియమించామన్నారు. 28 శాఖల్లో 512 కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కేపీఐ) రూపొందించి వాటి సాధిస్తున్న క్రమాన్ని మండల స్థాయిలో మదింపు చేస్తున్నామన్నారు. ఇందులో మొదటి ఐదు స్థానాల్లో పశ్చిమ గోదావరి, నంద్యాల, ఎన్టీఆర్, అనంతపురం, విశాఖపట్నం జిల్లాలు, అనంతపురం అర్బన్, రాయదుర్గ (అనంతపురం), నందిగామ, విజయవాడ వెస్ట్ (ఎన్టీఆర్ జిల్లా), పలాస (శ్రీకాకుళం) మండలాలు నిలిచాయన్నారు.

# ప్రాథమిక రంగానికి ప్రాధాన్యం

- ఈ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలి
- రైతు సేవా కేంద్రాల వరకు ప్రత్యేక డ్యాష్ బోర్డు ఏర్పాటు చేస్తున్నాం
- అమెరికా పన్నుల భారం రొయ్యల పరిశ్రమపై పడింది
- రొయ్యల సాగు మేత ధరల తగ్గింపునకు చర్యలు తీసుకోండి
- కలెక్టర్లకు వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ సూచన
- రబీలో యూరియా కొరతనే మాట లేకుండా చేస్తామని వెల్లడి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఏ రాష్ట్రానికైనా ఆర్థిక ప్రగతికి ప్రధాన ముడి సరకు ప్రాథమిక రంగమైన వ్యవసాయ రంగమేనని ఈ రంగానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని జిల్లా కలెక్టర్లకు వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ సూచించారు. జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన ప్రాథమికరంగం సాధించిన ప్రగతిపైన ప్రజంటేషన్ ఇచ్చారు. చక్కెర పరిశ్రమ ఉందంటే ముందు దానికి చెరకు కావాలి, కోక్ ఉందంటే ముందు కోక్ పంట ఉండాలి, ఆర్థికాభివృద్ధికి వ్యవసాయరంగం అత్యంత కీలకమన్నారు. ఈ రంగంలో ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. మేమిచ్చిన గణాంకాలను మీరు జిల్లా స్థాయిలో క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎక్కడ ఇది ఎలా సాధ్యమైందనేది నిశితంగా పరిశీలించాలన్నారు. రాష్ట్రంలో రెండు జిల్లాలు మినహా మిగిలిన 24 జిల్లాలూ ప్రాథమిక రంగానికి ఊతమిచ్చే జిల్లాలేనన్నారు. ఉద్యానవనం రంగం ప్రస్తుతం 30శాతం ఉంది, దీన్ని రాబోయే రోజుల్లో 50శాతానికి తీసుకెళ్లాలనేది ముఖ్యమంత్రి ఆశయమని, దాన్ని సాధించడానికి కలెక్టర్లు కృషి చేయాలన్నారు. పాడిపరిశ్రమ గణనీయమైన వృద్ధ నమోదు చేస్తోందన్నారు. 2025–26 మొదటి త్రైమాసికంలో 36.34 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 37.26 లక్షల మెట్రిక్ టన్నుల పాల ఉత్పిని సాధించినట్లు తెలిపారు.

**అమెరికా పన్నుల పెంపు అవరోధం :** భారత్ ఎగుమతులపై అమెరికా విధించిన పన్నులు ఆక్వా రంగానికి పెద్ద అవరోధంగా మారిందన్నారు. రొయ్యల ఎగుమతిపై అమెరికా పన్నులు 60శాతం ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఈ సవాళ్లను అధిగమించడానికి ప్రత్యమ్నాయ మార్గాల అన్వేషణ చేస్తున్నామన్నారు. రొయ్యల సాగు రైతులకు మేత పెట్టుబడి వ్యయమే 40 శాతం అవుతోందన్నారు. ఈ భారం తగ్గించేలా జిల్లా కలెక్టర్లు జిల్లా స్థాయిలో పని చేయాలన్నారు. మేత వ్యయం కనీసం 6 శాతం భారం తగ్గించేలా మనం చేయగలిగినా వారికి ఎంతో మేలు చేసినవారమవుతామన్నారు. అలాగే యాంటీబయాటిక్స్ ఒక పెద్ద ముప్పుగా పరిణమించిందన్నారు. ఈ సమస్యలపై జిల్లా కలెక్టర్లు దృష్టి సారించాలన్నారు.


**ఆర్ ఎస్ కే స్థాయి నుంచి డ్యాష్ బోర్డు :** రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ఊతమిచ్చే వ్యవసాయరంగానికి ప్రభుత్వం అమిత ప్రాధాన్యమిస్తోందన్నారు. రైతు సేవా కేంద్రాల స్థాయి నుంచి వృద్ధి రేటు సాధనా క్రమం ఎలా ఉంది అనేది మదింపు వేస్తున్నామన్నారు. దీని ప్రకారం మీకు ఎప్పటికప్పుడు ఏ మండలం, ఏ గ్రామ పరిధిలో పరిస్థితి ఎలా ఉందనేది తెలుస్తుందన్నారు. దానికనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవడానికి కలెక్టర్లకు వీలు కలుగుతుందన్నారు. 2024–2025 ఆర్థిక సంవత్సరంలో రీజియన్, జిల్లా మండల స్థాయి వరకు కూడా జీవీఏ (స్థూల విలు జోడింపు) పరంగా మథింపు వేశామన్నారు. ఇందులో అనంతపురం, తూర్పు గోదావరి, ఏలూరు, సత్యసాయి, నెల్లూరు జిల్లాలు మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయన్నారు. రైతు సేవాకేంద్రాల వారీగా చూస్తే తూర్పు గోదావరి జిల్లాలో బిక్కవోలు మండలంలోని భలభద్రాపురం–1, 2, 3, అరికరేవుల రైతు సేవా కేంద్రాలు, కోనసీమ జిల్లాలోని వెలగతేడు–2 రైతు సేవా కేంద్రం ముందు వరసలో నిలిచాయన్నారు.

**ఇద్దరు ఆర్ ఎస్ కే సిబ్బందికి ప్రశంసలు :** అనిమల్ హజ్బెండరీ, హార్టీకల్చర్ విభాగాల్లో గణనీయమైన ఫలితాలు సాధించిన ఇద్దరు రైతు సేవా కేంద్రాల సిబ్బందిని ఈ సమావేశంలో ఆయన ప్రశంసించారు. తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం కాపవరం రైతు సేవా కేంద్రంలో అనిమల్ హజ్బెండరీ అసిస్టెంట్ జే.సత్యవేణి 2024–2025 ఆర్థిక సంవత్సరంలో రూ. 816 కోట్ల జీవీఏ సాధించారు. ఈమె ఈ ఆర్థిక సంవత్సరం రూ. 895.14 కోట్లు జీవీఏ సాధించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. కడప జిల్లా లింగాల మండలం, కొమ్మునూతల రైతు సేవా కేంద్రంలో పనిచేస్తున్న విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్ కె. పవన్ కల్యాణ్ 2024–2025 ఆర్థిక సంవత్సరంలో 480 కోట్ల జీవీఏ సాధించారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ. 580.80 కోట్ల జీవీఏ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ రైతు సేవా కేంద్రం పరిధిలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులు అందరూ కూడా వంద శాతం సూక్ష్మసేద్యం చేసేలా చూడగలిగారు. టిష్యూ కల్చర్‌తో అరటి సాగు చేసేలా రైతులను ప్రోత్సహించారని తెలిపారు

**రబీకి యూరియా కొరత ఉండదు :** వచ్చే రబీ సీజన్లో యూరియా కొరత అనే మాట లేకుండా చేస్తామన్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో యూరియా సమస్యలు కొన్ని వచ్చాయని, మాకు ఎదురూన అనుభవాలు అన్నీ భేరీజు వేసుకున్నామని దీని ప్రకారం వచ్చే రబీ సీజన్లో యూరియా కొరతన్న మాట వినపడకుండా చేస్తామన్నారు. యూరియా సరఫరా అంటే కేవలం ఇన్వెంటరీ నమోదు మాత్రమే కాదని, జిల్లా కలెక్టర్లు యూరియా క్షేత్ర స్థాయిలో ఎలా పంపిణీ జరుగుతుందనేది కూడా చూడాలన్నారు.

# బ్యాంకుల్లో డ్వాక్రా సంఘాల పొదుపు రూ.20,739 కోట్లు

- దేశంలోనే నెంబర్ వన్ మన డ్వాక్రా సంఘాలు
- రుణాల ఎగవేత కేవలం 0.02 శాతం మాత్రమే
- వాళ్లకు రుణాలివ్వడానికి ముందుకొస్తున్న బ్యాంకులు
- డ్వాక్రాల కోసమే ప్రత్యేక ఎస్ ఎల్ బీసీ సమావేశాలు
- రాష్ట్రంలో 875 మిల్లెట్ కేఫ్‌ల ఏర్పాటు
- సెర్ప్ కార్యదర్శి వి. కరుణ వెల్లడి
- సెర్ప్ కార్యదర్శికి ముఖ్యమంత్రి ప్రశంసలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాలు, పొదుపు సంఘాలు బ్యాంకుల్లో రూ.20,739 కోట్లు పొదుపు చేశారని, ఇందులో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో ఉందని సెర్ప్ కార్యదర్శి వి. కరుణ తెలిపారు. సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో ఆమె సెర్ప్ కార్యకలాపాలపై ప్రజంటేషన్ ఇచ్చారు. డ్వాక్రా సంఘాలు రుణాలు పొందేలా జిల్లా కలెక్టర్లు దృష్టి సారించాలని కోరారు. డ్వాక్రా సంఘాల్లో రుణాల ఎగవేత శాతం కేవలం 0.02 శాతం మాత్రమే ఉందని, కాబట్టి ఈ సంఘాలకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకర్లు సైతం వెనుకాడటం లేదని, బ్యాంకర్లు ఎంతో సంతోషంగా రుణాలు ముందుకు వస్తున్నారన్నారు. ఇటీవలే డ్వాక్రా సంఘాల కోసమే ప్రత్యేకంగా స్టేట్ లెవల్ బ్యాంకర్ల సమావేశం నిర్వహించామన్నారు. ప్రస్తుతం రూ.40,424 కోట్లతో స్త్రీనిధి, ఉన్నతి బ్యాంకు లింకేజీ కల్పించామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 89 లక్షల మంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారని, మొత్తం 8.32 లక్షల డ్వాక్రా సంఘాలున్నాయని వెల్లడించారు. పొదుపు సంఘాలు తీసుకుంటున్న రుణాల్లో 74 శాతం సంపద సృష్టి, 13 శాతం ఉత్పాదక రుణాలు, 13 శాతం వినియోగం కొరకు వినియోగించుకుంటున్నారని తెలిపారు. డ్వాక్రా సంఘాల పనితీరుపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ విషయంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ పనితీరు ఆదర్శప్రాయంగా ఉందన్నారు. ఏడాది యువతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. మూడు నాలుగు సంఘాల్లో కనీసం ఒక యువతి అయినా సభ్యురాలుగా ఉండేలా చూస్తున్నామని తెలిపారు.

**పాడి రంగం పట్ల మహిళల ఆసక్తి :** రాష్ట్రంలోని పొదుపు సంఘాల్లోని మహిళలు ఎక్కువగా పాడి పరిశ్రమ పట్ల ఎక్కువ ఆసక్తి ప్రదర్శిస్తున్నారని చెప్పారు. 6,84,876 పాడి జీవాల కొరకు రుణాలు కావాలని కోరుతున్నారని, ఈ రుణాల విలువ రూ.8,989 కోట్లు ఉందన్నారు. వీటిలో ఇప్పటికే 3,39,820 మందికి రూ.4,415 కోట్లు రుణాలు అందించామన్నారు. మిగిలిన రుణాలు కూడా త్వరితగితన పొందేలా జిల్లా కలెక్టర్లు చొరవ చూపాలన్నారు.

**డ్వాక్రా సంఘాలతో మిల్లెట్ కేఫ్‌లు**

పొదుపు సంఘాల్లోని మహిళలు పారిశ్రామిక వేత్తలుగా రాణించడానికి చొరవ చూపుతున్నారని చెప్పారు. ఇప్పటికే 3 వేల మంది పొదుపు సంఘాల మహిళలు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా మారడానికి ఆసక్తి ప్రదర్శిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఈ సంఘాలతో మిల్లెట్ కేఫ్‌లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మొత్తం 875 మిల్లెట్ కేఫ్‌లు ఏర్పాటు చేయాలన్నది లక్ష్యమని ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు 12 జిల్లాల్లో 200 యూనిట్లు ఏర్పాటు చేశామని, ఇవి విజయవంతంగా నడుస్తున్నాయని వెల్లడించారు. అలాగే బాంబూ మిషన్ ప్రాజెక్టు కింద మహిళలు వెదురు సాగుకు ప్రోత్సహిస్తున్నామన్నారు.

**440 నమో డ్రోన్ దీదీలు**

నమో డ్రోన్ దీదీ పథకం కింద రాష్ట్రంలో 440 మంది హిళలను మహిళా డ్రోన్ ఆపరేటర్లుగా చేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే ఈ పథకం కింద 88 మందిని డ్రోన్ ఆపరేటర్లుగా మార్చామన్నారు. అలాగే 100 ఎగ్ కార్ట్ దీదీలు ఏర్పాటు చేయాలన్నదే లక్ష్యమని, ఇప్పటికే 250 మహిళలు ఈ పథకం కింద ఎగ్ కార్ట్‌లు ఏర్పాటు చేసుకున్నారని, 5వేల మంది మహిళా పారిశ్రామిక వేత్తలతో ఈజీమార్ట్ లు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

**సీఎం ప్రశంసలు**

డ్వా క్రా సంఘాలు, పొదుపు సంఘాల పనితీరు పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. డ్వాక్రాలకు వారి పొదుపు సొమ్ము, రుణాల వివరాలు తదితర అన్ని సమస్యల గురించి తెలుసుకోవడానికి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగించడంపై ఆయన అభినందించారు. సెర్ప్ కార్యదర్శి వి. కరుణను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కరుణ గారికి ఏ బాధ్యత అప్పజెప్పినా ఎంతో బాధ్యతతో చేస్తారని, పొదుపు సంఘాలను సమర్థవంతంగా పనిచేయించడంలో ఆమె ఎంతో చొరవ చూపించారని అభినందించారు.

## డీఎస్సీ ఫైనల్ సెలెక్షన్ లిస్ట్ విడుదల



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర చరిత్రలోనే అత్యంత పారదర్శకంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను కేవలం 150 రోజుల్లో విజయవంతంగా పూర్తి చేసి, ఫైనల్ సెలెక్షన్ లిస్ట్‌ను జారీ చేసింది. రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం రాష్ట్ర సచివాలయంలో పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయరామ రాజు తో కలిసి నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ప్రక్రియ ద్వారా మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద మరియు అత్యంత పారదర్శక నియామక ప్రక్రియగా నిలిచిందని, 2024 జూన్ 13వ తేదీన జారీ అయిన ప్రభుత్వ ఉత్తర్వు నంబర్ 27తో ఈ ప్రక్రియ ప్రారంభమైందని కార్యదర్శి వివరించారు. అభ్యర్థుల సౌకర్యార్థం 2024 అక్టోబర్‌లో రెండోసారి టెట్ పరీక్ష నిర్వహించి, వందకు పైగా కేసులు ఉన్నా కూడా 150 రోజుల్లో భర్తీ ప్రక్రియను ఎటువంటి ఆటంకం లేకుండా పూర్తి చేశామన్నారు.

చారిత్రాత్మక రిజర్వేషన్లను అమలు చేసినట్లు, ఎస్ఎస్ సబ్-క్లాసిఫికేషన్, స్పోర్ట్స్ పర్సన్స్‌కు 3 శాతం కోటా, వర్టికల్ మరియు మొట్టమొదటిసారిగా హారిజాంటల్ రిజర్వేషన్లను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. ఫైనల్ లిస్ట్‌లో 15,941 మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వీరిలో 7,955 మంది మహిళలు, 7,986 మంది పురుషులు ఉన్నారు. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ లిస్ట్‌కు వెయిటింగ్ లేదా సెకండ్ లిస్ట్ ఉండదని స్పష్టంగా తెలిపారు.

సెలెక్ట్ అయిన అభ్యర్థుల సౌకర్యార్థం రాష్ట్ర స్థాయి ఇన్ఫర్మేషన్ అసిస్టెన్స్ సెంటర్ ఏర్పాటు చేయబడింది. అభ్యర్థులు హెల్ప్ డెస్క్ ద్వారా సహాయం పొందవచ్చు. ఫోన్ నంబర్లు: 8125046997, 9398810958, 7995649286, 7995789286. జిల్లా విద్యా కార్యాలయాలు, కలెక్టరేట్లు, అలాగే అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా ఫైనల్ లిస్ట్ అందుబాటులో ఉందని కార్యదర్శి తెలిపారు.

## నాణ్యత ,ఆధునిత పెట్టుబడిగా రాణించండి




**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్ )** బంగారు నగల వ్యాపార రంగంలో ఆధునికతను స్వాగతిస్తు, నాణ్యతను పాటిస్తు,వినియోగ దారుల నమ్మకాన్ని నిలబెట్టు కోవాలని జికెఎమ్ జ్యూయలరీ షాప్ ప్రారంభ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. స్థానిక నెహ్రూ రోడ్ లో, నూతనంగా ఏర్పాటు చేసిన జీకే ఎం జ్యువెలరీ షాపును సోమవారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. షాపు నిర్వాహకులు సయ్యద్ కబీర్ కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా షాపు యాజమాన్యం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు సాదర స్వాగతం పలికారు. పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఉద్యోగులపై బకాయిల భారం 33 వేల కోట్లు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎనిమిదేళ్లుగా డీఏలు, పీఆర్సీ, సరెండర్ లీవ్‌లు సహా బకాయిలు చెల్లించకపోవడంతో సుమారు ?33,000 కోట్లు చేరుకున్నాయని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కరణం హరికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు తెలిపారు. ఈ బకాయిలు చెల్లించకపోవడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వారి ప్రకారం, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నాలుగు డీఏలు 50 నెలలకు పైగా పేరుకుపోయాయని, 2023 జూలై నుంచి అమలులోకి రావలసిన పీఆర్సీని ప్రభుత్వం 2025 సెప్టెంబరు వరకు వాయిదా వేసిందని పేర్కొన్నారు. సీపీఎస్ ఉద్యోగుల ప్రతి ఒక్కరికి ఐదు లక్షలకు పైగా బకాయిలు పెరిగాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే మంత్రివర్గ ఉపసమితి ఏర్పరచి మూడు నెలల్లో అన్ని బకాయిలను చెల్లించాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఒకేసారి చెల్లించడం సాధ్యంకాకపోతే, ప్రతి జిల్లా, తాలూకా కేంద్రాలు మరియు అమరావతిలో ప్రభుత్వ భూములు కేటాయించి హౌసింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరింది. కేటాయించే ఇళ్ల స్థలాలపై కనీసం 30 శాతం సబ్సిడీ ఇవ్వాలని, ప్రతి ఉద్యోగి బకాయి వివరాలు పేస్‌లిప్, సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించింది. ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించి హౌసింగ్ కాలనీలు అభివృద్ధి చేస్తే ఉపశమనం లభించడమే కాకుండా నిర్మాణ రంగంలో కార్మికులకు ఉపాధి కలుగుతుందని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ ప్రతిపాదన ప్రభుత్వానికి చారిత్రాత్మకంగా నిలుస్తుందని పేర్కొంటూ, వెంటనే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## వక్ఫ్ చట్టంపై " సుప్రీమ్ " తీర్పు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** వక్ఫ్ చట్టంపై సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పును స్వాగతిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అమరావతిలో విడుదల చేసిన ప్రకటనలో సోమవారం పేర్కొన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన వక్ఫ్ చట్టం సవరణలపై ముస్లిం వర్గాలలో నెలకొన్న ఆందోళనను దృష్టిలో పెట్టుకొని, వారి మనోభావాలకు అనుగుణంగా వక్ఫ్ చట్టంను జేపీసీ దృష్టికి వెళ్లేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేశారని ఫరూక్ పేర్కొన్నారు. అపుడు జేపీసి కొన్ని అసమంజస సవరణలను తొలగించగా, నేడు సుప్రీం కోర్టు మధ్యంతర తీర్పులో మిగిలిన అసమంజస సవరణలపై స్టే విధించిందన్నారు. వక్ఫ్ చట్ట సవరణల అమలుపై సుప్రీం కోర్టు మధ్యంతర తీర్పును వెల్లడించి రాజ్యాంగపరంగా కల్పించిన హక్కులను కాపాడి, తన ఔన్నత్యాన్ని చాటి చెప్పడంతో ప్రజల విశ్వాసాన్ని గెలిచిందన్నారు. వివాదస్పద అస్థిని కలెక్టర్ విచారణ చేసి అనుమతిస్తే తప్ప అది వక్ఫ్ ఆస్తిగా పరిగణించబడదన్న సవరణ, అయిదేళ్లుగా ఇస్లాం పాటిస్తున్న వ్యక్తి మాత్రమే వక్ఫ్ కి దానం చేయగలడు అనే సవరణపై స్టే విధించడం జరిగిందన్నారు. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో, ముస్లిమేతర సభ్యులు నలుగురు కంటే ఎక్కువ ఉండకూడదని, అలాగే రాష్ట్ర వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతర సభ్యులు ముగ్గురు కంటే ఎక్కువ ఉండకూడదని, వీలయినంతవరకు ముస్లింనే రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈవో గా నియమించాలని సుప్రీంకోర్టు చెప్పిందని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు మంత్రి ఫరూక్ తెలిపారు.

## కొత్త ఆరోగ్య బీమా పథకం అమల్లో పెరిగిన ప్రభుత్వాసుపత్రుల పాత్ర

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన మిశ్రమ(హైబ్రిడ్) విధానంలో అందరికీ ఆరోగ్య బీమా పథకం అమల్లో ప్రభుత్వాసుపత్రుల పాత్రను పెంచారు. ఈ దిశగా 155 రకాల వైద్యసేవలను ప్రభుత్వాసుపత్రులకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. దీంతో...ప్రభుత్వాసుపత్రులకు ప్రస్తుతం రిజర్వ్ చేసిన 169 రకాల సేవలతో నూతన విధానంలో మొత్తం 324 రకాల వైద్యసేవలను ప్రభుత్వాసుపత్రుల ద్వారా ప్రజలకు లభిస్తాయి.

ప్రస్తుతం డా.యన్.టి.ఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా అందించబడుతూ అత్యంత అరుదుగా లబ్ధిదారులు వాడుకుంటున్న 197 రకాల వైద్యసేవలకు ట్రస్టు ద్వారా ఉచితంగా సేవలందించబడతాయి.

**గత ప్రభుత్వం పెంచి చూపిన వైద్యసేవలు :** ప్రస్తుతం డా.యన్.టి.ఆర్ వైద్యసేవ కింద లబ్ధిదారులకు ఉచితంగా అందించబడుతున్న వైద్యసేవలు, కొత్త మిశ్రమ(హైబ్రిడ్) విధానం కింద వాటిని క్రమబద్ధీకరించిన వైనాన్ని వైద్యారోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్ సమీక్షించారు. ఆరోగ్య శ్రీ కింద ప్రజలకు అందించబడే వైద్యసేవలను పెంచిచూపటానికి, చికిత్సలో సారూప్యతతో పాటు ఒకేరకం ప్యాకేజీ విలువ కలిగిన పలురకాల వైద్యసేవలను విడివిడిగా చూపటంతో మొత్తం సేవల సంఖ్య 3,257 కు పెరిగినట్లు అధికారులు వివరించారు. అటువంటి సారూప్యత కలిగిన సేవలను వివిధ విస్తృత కేటగిరీలుగా వర్గీకరించటంతో సేవల సంఖ్య 186 మేరకు తగ్గినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వాసుపత్రులకు కేటాయించిన 324 సేవలు, అరుదుగా వాడుకోబడుతున్న 197 సేవలు మినహాయించగా మిగిలిన 2,736 సేవలను 2,550 సేవలుగా క్రమబద్ధీకరించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ 2,550 సేవలకు నూతన పథకం అమలుకు ఎంపిక కానున్న ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా చెల్లింపులు జరుగుతాయి. ఈ రీతిన ప్రస్తుతం ప్రజలకు అందించబడుతున్న 3,257 వైద్య సేవలను నూతన బీమా పథకంలో లబ్ధిదారులకు అందిస్తామని మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ స్పష్టం చేశారు.



**సేవల సంఖ్యను పెంచిన వైనం :** ఆరోగ్య శ్రీ పథకంలో అందించబడిన వైద్యసేవల సంఖ్యను ఎక్కువగా చేసి చూపటానికి గత ప్రభుత్వం అనుసరించిన విధానాన్ని వైద్యులు మంత్రికి వివరించారు. లిఇందుకోసం అనుసరించిన విధానాలులి

1. డెంగీ,టైఫాయిడ్ మరియు పారా టైఫాయిడ్ జ్వరాల చికిత్స విధానం మరియు ప్యాకేజీ విలువలు ఒకటే అయినా గత ప్రభుత్వం వాటిని విడివిడిగా చూపించింది. దీనికి బదులుగా వాటిని ''జ్వరాలు' అన్న కేటగిరీలో చేర్చడం జరిగింది.
2. అదే రీతిన గుండెకు సంబంధించిన రైట్ హార్ట్ కేథటరైజేషన్, లెఫ్ట్ హార్ట్ కేథటరైజేషను (స్టెంట్ వేయడం) ఒకే కేటగిరీ కింద నూతన బీమా పథకంలో చేపడతారు.
3. వివిధ రకాలుగా చూపబడుతున్న అల్సర్ చికిత్సలను ఏకీకృతం చేసి అల్సర్ చికిత్సలు అన్న కేటగిరీలో చేర్చారు.

ఈ విధంగా సారూప్యత కలిగిన 319 రకాల వైద్యసేవలను 133 రకాలుగా వర్గీకరించారు. ఉన్నత వైద్యుల బృందం క్షుణ్ణంగా అధ్యయనం చేసి నూతన వర్గీకరణను సూచించింది.

**ప్రభుత్వాసుపత్రులకు కేటాయించబడిన సేవలు :** వివిధ ప్రభుత్వాసుపత్రులల్లో ఏర్పాటు చేయబడిన మౌలిక సదుపాయాలు, అందుబాటులో ఉన్న వైద్యసిబ్బందిని దృష్టిలో పెట్టుకుని, వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకునే దిశగా 155 రకాల వైద్యసేవలను అదనంగా నూతన పథకం క్రింద ప్రభుత్వాసుపత్రులకు కేటాయించడం జరిగింది. ఎక్కువ సంఖ్యలో జరిగే గర్భాశయ తొలగింపు, ఎపెండిక్స్ తొలగింపు, ఇ.యన్.టి సేవలను ఈ కేటగిరీలో చేర్చారు.అత్యంత అరుదుగా అవలంబించే థైమస్ గ్లాండ్ తొలగింపు, చిన్నప్రేగు మొదటి భాగం (డియోడినమ్) తొలగింపు వంటి 197 రకాల వైద్యసేవలకు డా.యన్.టి.ఆర్ ట్రస్టు ద్వారా చెల్లింపులు జరుగుతాయి.

నూతన పథకం అమలుకు ఎంపిక కాబడే ఇన్సూరెన్స్ కంపెనీకి ప్రభుత్వం చెల్లించాల్సిన ప్రీమియం ఖర్చు బీమా పథకం కింద అందించబడే వైద్యసేవల సంఖ్యపై ఆధారపడి ఉంటుంది. సేవల సంఖ్య ఎక్కువ ఉంటే..ఆ మేరకు ప్రీఆథరైజేషన్ మరియు పాలనా వ్యయం వంటి అంశాల ఆధారంగా చెల్లించాల్సిన ప్రీమియం పెరుగుతుంది. గత ప్రభుత్వ వైద్యసేవల వర్గీకరణ ప్రకారం ఈ ఖర్చు పెరిగే అవకాశం ఉన్నందున దానిని నియంత్రించే దృష్టితో సహేతుక రీతిలో వైద్యసేవల నూతన వర్గీకరణ చేయటం జరిగిందని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు.

**నూతన ఆరోగ్య బీమా పథకం :** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన మిశ్రమ(హైబ్రిడ్) విధానంలో అందరికీ ఆరోగ్య బీమా పథకం కింద రాష్ట్రంలో 1.63 కోట్ల లబ్ధిదారుల కుటుంబాలకు సంవత్సరానికి రూ.2.5లక్షల మేరకు ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా బీమా కల్పిస్తారు. ఇందులో మొదటిసారిగా పేదరిక రేఖకు పైనవున్న 20 లక్షల ఏ.పి.యల్ కుటుంబాలకు కూడా ఆరోగ్య బీమా లభిస్తుంది. ఉద్యోగస్తులకు, పాత్రికేయులకు ప్రత్యేక ఆరోగ్యసేవల పథకాలు అమల్లో ఉన్నాయి. ప్రస్తుతం డా.యన్.టి.ఆర్ వైద్యసేవ కింద ఉచితంగా వైద్యం పొందుతున్న 1.43 కోట్ల కుటుంబాలకు రూ.2.5 లక్షలు దాటి రూ.25 లక్షల వరకు అయ్యే ఖర్చును డా.య్.టి.ఆర్.వైద్య ట్రస్టు ద్వారా ప్రభుత్వమే భరిస్తుంది.

## టీటీడీ ట్రస్ట్ కు రూ 20 లక్షల విరాళం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ కు రూ. 20 లక్షలు విరాళాన్ని మంగళగిరి కి చెందిన మన్నెం శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి అందజేశారు. మన్నెం శ్రీనివాసరావు అరుణ దంపతుల కుమార్తెలు హారిక, హరిత పేర్లతో రూ.10 లక్షలు వంతున రెండు డీడీలను అందజేశారు. టీటీడీ బోర్డు సభ్యురాలు జానకీదేవి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో 12 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు అయ్యిన మొత్తం రూ. 14,25,243/- ల చెక్కులను సోమవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి సిఫార్సుతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ చెక్కులు మంజూరు చేశారు.

ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ..లి "ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలతో పాటే ఉంటుంది. అవసరంలో సహాయం అందించడమే మా ప్రధాన కర్తవ్యంగా భావిస్తున్నాం" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

ఈ సందర్భంగా లబ్ధిదారులులి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే గళ్ళా మాధవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ... "ఇలాంటి సహాయం మా జీవితాల్లో వెలుగు నింపింది. మా సమస్యలను గుర్తించి వెంటనే స్పందించినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు" అని పేర్కొన్నారు.

**లబ్ధిదారుల వివరాలు:**

భవనం శివ పార్వతి - 3,24,917,వరికూటి వీర సుధాకర్ రావు - 1,43,502,మల్లెల కీర్తి - 30,541,%జోగు బాల కుమార్ రెడ్డి - 1,00,000,బట్టగిరి అనిత - 70,000,ఉప్పల వెంకట నరసింహారావు - 42,450,సిరిగిరి జ్యోతి -29,461,దేశీరాజు హేమమణి - 44,492,చింతల రామ్ బాబు - 30,000,మక్కెన చంద్రమౌళి- 1,95,999,మోజెస్ బోరుగడ్డ - 2,50,000,చింతపల్లి కోటేశ్వరరావు - 1,63,881,మొత్తం: 14,25,243/-.

## డీజీపీతో గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్ భేటీ

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా నూతన ఎస్పీగా నియమితులైన వకుల్ జిందాల్ సోమవారం రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను మర్యాదపూర్వకంగా కలసి రాజధాని ప్రాంతంలో కీలకంగా ఉన్న గుంటూరు జిల్లాలో పోలీసింగ్ పై డీజీపీ మార్గదర్శకత్వం పొందారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ గుంటూరు రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా, సవాళ్లతో కూడిన జిల్లాల్లో ఒకటని పేర్కొన్నారు. భౌగోళిక పరిస్థితులు, జనాభా విస్తీర్ణం, సామాజిక సవాళ్లను దృష్టిలో పెట్టుకుని క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు సాంకేతికత ఆధారిత పోలీసింగ్‌ను విస్తృతం చేసి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాల్సిన అవసరం ఉందని అన్నారు. కొత్త ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వకుల్ జిందాల్‌కు డీజీపీ శుభాకాంక్షలు తెలియజేస్తూ విధుల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## కార్తీకమాసోత్సవాల సన్నాహక సమావేశం

**శ్రీశైలం(జర్నలిస్ట్ ఫైల్):** అక్టోబరు 22 నుంచి నవంబరు 21 వరకు జరగనున్న కార్తీకమాసోత్సవాల సన్నాహక సమావేశం సోమవారం పరిపాలనాభవనంలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్. రమణమ్మ, ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, అధ్యాపకులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు. సమావేశంలో భక్తుల సౌకర్యాలను ముఖ్యంగా దృష్టిలో పెట్టుకొని వివిధ ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చలు జరిగాయి.



సమావేశంలో ప్రధానంగా భక్తుల వసతి, మంచినీటి సరఫరా, సౌకర్యవంతమైన దర్శనం, ఆలయ వేళలు, అభిషేకాలు, క్యూలైన్ నిర్వహణ, రద్దీ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పారిశుద్ధ్యం, వాహనాల పార్కింగ్ వంటి అంశాలను చర్చించారు. అదనంగా, కార్తీకసోమవారాలు, మొదటి శుక్రవారం కృష్ణమ్మ హారతి, శుద్ధ ఏకాదశి కోటి దీపోత్సవం, లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి, కార్తీక పౌర్ణమి జ్వాలాతోరణం, ఆకాశదీపాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లను చేయాలని నిర్ణయించబడింది.

సమావేశంలో ముందుగా కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ, కార్తీకమాసంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు రాకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అన్ని విభాగాలను ఆదేశించారు. ఆయా ఏర్పాట్లన్నీ ముందస్తుగా పూర్తి చేయాలని, అక్టోబరు 15వ తేదీకి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని అన్నివిభాగాల అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా కార్తీకసోమవారాలు, కార్తీకపౌర్ణమి, శుద్ధ ఏకాదశి మరియు ప్రభుత్వ సెలవురోజుల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, రద్దీకి అనుగుణంగా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. అలాగే, పాతాళగంగ వద్ద శౌచాలయాలు, స్త్రీలు దుస్తులు మార్చుకునే గదులు, పాతాళగంగ మెట్ల మార్గం వంటి ప్రాంతాల్లో అవసరమైన మరమ్మతులను వెంటనే చేయించాలన్నారు. అదేవిధంగా గంగాభవానీ స్నానఘట్టాలకు కూడా అవసరమైన మరమ్మతులు చేయించాలన్నారు.

దర్శనాల ఏర్పాట్ల విషయంలో ఉదయం 3.00 గంటలకు ఆలయ ద్వారాలు తెరచి, ప్రాత:కాల పూజల తర్వాత 4.30 నుంచి సాయంత్రం 4.00 వరకు, సాయంత్రం 5.30 నుంచి రాత్రి 10.30 వరకు భక్తులకు దర్శనం కల్పించబడుతుంది. గర్భాలయ అభిషేకాలు కార్తీకమాసం మొత్తం నిలుపుదల చేస్తారు. మొదటి శుక్రవారం, అక్టోబరు 24న పాతాళగంగ వద్ద కృష్ణమ్మ హారతి ప్రత్యేక పూజలు, సారె సమర్పణతో నిర్వహించబడుతుంది. శుద్ధ ఏకాదశి రోజున, నవంబరు 1న, గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు ప్రత్యేక ఏర్పాట్లతో కోటి దీపోత్సవం జరగనుంది. కార్తీకసోమవారాలు మరియు పౌర్ణమి రోజున పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి కార్యక్రమాలు కొనసాగుతాయి. గంగాధర మండపం వద్ద జ్వాలాతోరణం ఏర్పాటు చేయబడుతుంది. ఆలయ నిత్యకళావేదిక వద్ద ప్రతిరోజు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయి.

సమ్మేళనంలో నిర్ణయించిన విధంగా అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేసి, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు రాకుండా పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని విభాగాల అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

## 27నుండి కళలకాణాచి,జాతీయ వీణా అవార్డ్స్ నాటకోత్సవాలు

**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** నాటక కళకు తెనాలికి ఉన్న అనుబంధాన్ని చాటుతు, ఏర్పడిన కళలకాణాచి సంస్థ ద్వారా 5వ, జాతీయ వీణ అవార్డ్స్ నాటకోత్సవాలు ఈనెల 27 నుండి కళాక్షేత్రం వేదికగా ప్రారంభం కానున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సినీ మాటల రచయిత సాయి మాధవ్ బుర్ర పేర్కొన్నారు. స్థానిక గాంధీ నగర్ లోని సిపిఐ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కళల కణాచి సంస్థ ద్వారా నిర్వహించే ఐదవ జాతీయ వీణ అవార్డ్స్ నాటక ఉత్సవాల కార్యాచరణను వివరించారు. రామకృష్ణ కవి కళాక్షేత్రం వేదికగా ఈనెల 27 నుండి అక్టోబర్ రెండవ తేదీ వరకు, వరుసగా ఆరు రోజులు, ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి రాత్రి పది గంటల వరకు, నాటకోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. 9 పద్య నాటకాలు, 5, సాంఘిక నాటకాలు, 7, సాంఘిక నాటికలు ప్రదర్శన అ-ర్హతను పొందినట్లు తెలిపారు. నాటక కళకు ప్రోత్సాహంగా ఎంపిక చేసిన, నాటకాలకు ఘనమైన నగదు ప్రోత్సహకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రారంభ సందర్భంగా 27వ తేదీన ఏఆర్ కృష్ణ జాతీయ రంగస్థలం పురస్కారాన్ని, నాటక కళకు ఘనమైన సేవ చేస్తన్న,గుంటూరుకు చెందిన బాలచంద్రకు ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. నాటక ఉత్సవాలు ముగింపుగా బుర్ర సుబ్రహ్మణ్య శాస్త్రి స్మారక జాతీయ పురస్కారాన్ని పౌరాణిక రంగస్థల నటులు ఉప్పలపాటి సైదులుకు ప్రధానం చేయనున్నట్లు వివరించారు. కళల కాణాచి సంస్థతో, కలిసి ప్రయాణించి, గత సంవత్సరం గతించిన, వేద గంగోత్రి సంస్థ నిర్వాహకులు, వరప్రసాద్ పేరిట, స్మారక రంగస్థల నాటక నిర్వాహక అవార్డును నూతలపాటి సాంబయ్య కు ప్రధానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశంలో సంస్థ ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్, పాల్గొన్నారు.



## అలయ్ బలయ్ కార్యక్రమానికి రండి

### సిఎం రేవంత్‌రెడ్డికి దత్తాత్రేయ ఆహ్వానం

**(జర్నలిస్ట్‌ఫైల్) ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 15:** జూబ్లీహిల్స్ నివాసంలో సిఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే నెల 3న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో జరిగే అలయ్ బలయ్ కార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డిని దత్తాత్రేయ ఆహ్వానించారు. ఈ మేరకు సిఎంకు ఆహ్వాన పత్రికను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయను సిఎం రేవంత్ శాలువా కప్పి సత్కరించారు. కాగా, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని బండారు దత్తాత్రేయ నిర్వహిస్తారు. రాజకీయాలకు అతీతంగా అలయ్ బలయ్ వేడుకలు ప్రతీ యేడాది దసరా సమయంలో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రతి యేటా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ముఖ్యమంత్రులు, అధికారులు, సెలబ్రిటీలు, ప్రముఖులు పాల్గొంటారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజకీయాలకు అతీతంగా నాయకులను ఒకే వేదికమీదకు తీసుకురావాలనే ఉద్దేశంతో 2005లో అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.

## టైంస్కేల్ ఇచ్చేవరకు సమ్మె విరమించేది లేదు

### రాష్ట్ర గిరిజన హాస్టల్, ఆశ్రమం పాఠశాల డైలీవేజ్ వర్కర్ల జెఎసి నేతలు

**హైదరాబాద్ (ముషీరాబాద్), సెప్టెంబరు 15(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణ గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లకు టైమ్ స్కేల్ ఇచ్చేవరకు సమ్మె విరమించేది లేదని తెలంగాణ గిరిజన హాస్టల్, ఆశ్ర మం పాఠశాల డైలీవేజ్ వర్కర్ల జెఎసి నేతలు ఎం. పాపారావు, బి.మధు, నాగేశ్వరరావు, బ్రహ్మాచారి, గోపాల్‌లు స్పష్టం చేశారు. ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లు న్యాయమైన డిమాండ్ల సాధనకై ఈనెల 12 నుంచి సమ్మె ప్రారంభించారని గుర్తు చేశారు. టైస్కేల్‌తో పాటు సమాన పనికి సమాన వేతనం, పాత పద్ధతిలోనే వేతనాల చెల్లింపులు, చనిపోయిన కాంటినెంట్స్ కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం వంటి డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ఎటువంటి స్పందన లేకపోవటంతో సమ్మెకు దిగవలసి వచ్చిందని తెలిపారు. జిల్లాలలో సమ్మె చేస్తున్న డైలీ వేజ్ వర్కర్లను అధికారులు ఫోన్‌లు చేసి, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదరించటం సరికాదని, సమ్మెచేసే వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఉద్యాన పంటలకు ప్రోత్సాహకం

### రైతులకు రాయితీలు ప్రకటించిన డైరెక్టర్ యాస్మిన్

**హైదరాబాద్, సెప్టెంబరు 15(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో ఉద్యాన పంటలను సాగు చేస్తున్న రైతులకు రాయితీలు ఇవ్వాలని ఆ శాఖ నిర్ణయం తీసుకుంది. ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించేందుకుగాను రైతులకు వివిధ రాయితీలు అందించేందుకు ప్రణాళికను రూపొందించింది. సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం ద్వారా అందిస్తున్న రాయితీలు, నిధులను ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఉద్యాన శాఖ డైరక్టర్ యాస్మిన్ బాషా ప్రకటించారు. తెలంగాణలో కొత్తగా ఉద్యాన తోటల విస్తీర్ణాన్ని పెంచేందుకు పలు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 9,902 ఎకరాలకు సంబంధించి మామిడి, అరటి, జామ, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, బత్తాయి వంటి పండ్ల తోటల సాగు నిమిత్తం 18.48 కోట్ల రూపాయలను కేటాయించారు. అదేవిధంగా కూరగాయల సాగు నిమిత్తం 10 వేల ఎకరాల విస్తీర్ణాన్ని పెంచే లక్ష్యానికి గాను 9.60 కోట్ల రూపాయలు, 2,949 ఎకరాల్లో ఉల్లి సాగు కోసం 2.35 కోట్ల రూపాయలు కేటాయింపులు చేశారు.

అలాగే రాష్ట్రంలోని 2,549 ఎకరాల్లో పూల సాగు నిమిత్తం 2.06 కోట్ల రూపాయలు, 3,294 ఎకరాల్లో అల్లం, వెల్లుల్లి సాగుకు సంబంధించి 5.33 కోట్ల రూపాయలను కేటాయించారు. ఈవిధంగా ప్రకటించిన ఉద్యాన పంటల సాగు నిమిత్తం అన్ని విభాగాల్లో 40 శాతం రాయితీని రైతులకు అంద చేయనున్నారు. వీటితోపాటు, అదనంగా పుట్టగొడుగుల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు గాను వాటి యూనిట్లకు 1.08 కోట్ల రూపాయలను కేటాయింపులు చేశారు. పాత తోటల పునరుద్ధరణకు మరో 2 కోట్ల రూపాయలు, నీటి వనరుల సృష్టి కోసం 2.73 కోట్ల రూపాయలు, ప్లాస్టిక్ మల్చింగ్ కోసం 14.24 కోట్ల రూపాయలను కేటాయించారు. వీటికి 40 నుంచి 50 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నారు. ఇక సేంద్రీయ సాగు, నర్సరీల ఏర్పాటు, విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు, పాలీహౌజ్‌లు, కోల్డ్ స్టోరేజీలు వంటి యూనిట్ల ఏర్పాటుకు 30 నుంచి 50 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నారు.

## సుప్రీంకోర్టు తీర్పు నుండి ఇన్‌సర్వీస్ టీచర్లకు రక్షణ కల్పించాలి

### ఎస్‌టిఎఫ్‌ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబరు 15(జర్నలిస్ట్‌ఫైల్):** టెట్‌పై ఈ నెల 1న సుప్రీంకోర్టు ఐదేళ్ళ పైబడి సర్వీసున్న ఇన్ సర్వీస్ టీచర్లందరూ రెండేళ్ళలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్ )ఉత్తీర్ణులు కావాలని లేదంటే ఉద్యోగాన్ని వదులుకోవాలని ఆదేశిస్తూ ఇచ్చిన తీర్పు నుండి సీనియర్ టీచర్లకు రక్షణ కల్పించాలంటే విద్యాహక్కు చట్టంలో సెక్షన్ 23 ను సవరించాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్టీఎఫ్ఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి, టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉపాధ్యాయులు అప్ డేట్ కావటానికి తాము వ్యతిరేకం కాదని, అయితే 2010కి ముందే నియామకమైన టీచర్లకు టెట్ మినహాయింపు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని వారు ఈ సందర్భంగా గుర్తుచేశారు. 15 సంవత్సరాల తర్వాత హఠాత్తుగా రెండేళ్లలో పరీక్ష పాస్ కావాలంటే సీనియర్ టీచర్లు ఆందోళన చెందుతున్నారని,దీంతో ఏర్పడే సంక్షోభాన్ని నివారించడానికి తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేయాలన్నారు. జాతీయ విద్యావిధానం సవరించాలని, సిపిఎస్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, ఆదాయ పన్ను పరిమితిని పెంచాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో నిర్వహిస్తున్న దేశవ్యాప్తం క్యాంపైన్‌లో భాగస్వాములు కావాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. రెండేళ్ల కాలంలో వీలైనన్ని ఎక్కువ పర్యాయాలు టెట్ పరీక్ష నిర్వహించి అవసరమైన ఉపాధ్యాయులందరూ ఉత్తీర్ణులు అయ్యేలా అవకాశం కల్పించాలన్నారు. డిగ్రీ, బిఎడ్ అర్హతలతో ఎస్జీటీలుగా నియామకమైన ఉపాధ్యాయులకు ఓడిఎల్ (ఓపెన్ అండ్ డిస్టెన్స్ లర్నింగ్) పద్ధతిలో జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) ల ద్వారా డిఎడ్ స్వల్పకాలిక శిక్షణను అందించి టెట్ పేపర్ 1 వ్రాసుకోవడానికి అర్హత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి ముందు ఇటీవల మరణించిన సిపిఐ జాతీయ నాయకులు సురవరం సుధాకర్ రెడ్డికి నివాళులర్పించారు.

# సింగరేణి మనుగడను సర్కారు కాపాడాలి

### మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

**(జర్నలిస్ట్‌ఫైల్)ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 15:** తెలంగాణలో ఏకైక ప్రభుత్వరంగ పరిశ్రమగా ఉన్న సింగరేణి మనుగడను ప్రభుత్వం కాపాడాలని బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సింగరేణిపై సమీక్ష చేసి, సింగరేణి కార్మిక వర్గాన్ని తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడారని మండిపడ్డారు. సింగరేణి పట్ల డిప్యూటీ సిఎం భట్టికి మరింత శ్రద్ధ ఉండాలని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రాంతం పట్ల, సింగరేణి సంస్థ పట్ల ప్రేమ లేదు అని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడిన మాటలను ఆయన ఖండించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లా డారు. సింగరేణిని కాపాడాలని కెసిఆర్ అనేక ప్రయత్నాలు చేశారని, కార్మికుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రైవేటీకరణకు శ్రీకారం చుట్టారని తెలిపారు. దేశవ్యాప్తంగా 1400 బొగ్గు బ్లాకులను ప్రయివేటీకరణకు నిర్ణయం తీసుకున్నారని, కార్పొరేట్ సంస్థలను కాపాడటం కోసం బొగ్గు బ్లాకులను ప్రైవేటీకరణ చేశారని చెప్పారు.

తెలంగాణలో ఉన్న బొగ్గు బ్లాకులన్నీ సింగరేణికి దక్కాలని కెసిఆర్ అన్నారని గుర్తు చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చాక 4 బొగ్గు బ్లాకులను ప్రైవేటీకరణ చేశారని, 4 బొగ్గు బ్లాకులను కాపాడటం కోసం కెసిఆర్, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ప్రయత్నం చేసిందని పేర్కొన్నారు. కేంద్రంలో బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి,డిప్యూటీ సిఎం భట్టి బొగ్గు బ్లాకుల వేలం పాటలో కలిసి పాల్గొన్నారని గుర్తు చేవారు. సింగరేణిని కాపాడాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. ఒడిశాలో నైనీ బొగ్గు బ్లాకు ఎట్లా వచ్చిందని, కర్ణాటకలో కాపర్, బంగారం గనులను సింగరేణి దక్కించుకుందని సింగరేణి సంస్థ ప్రకటించిందని అన్నారు. కేంద్రంలో,రాష్ట్రంలో అధికారంలో ఉన్నా కాంగ్రెస్ సింగరేణికి ఏం చేయలేదని విమర్శించారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ తెస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, సింగరేణి సంస్థలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మంత్రులు, ఎమ్మెల్యేల ఆధిపత్యం పెరిగి, సింగరేణి నాశనం అయ్యే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. సింగరేణి సిఎండి కాంగ్రెస్ చెప్పుచేతల్లో పనిచేస్తున్నారని ఆరోపించారు.

# అటవీప్రాంతం గుండా నూతన రోడ్డు మార్గాలు

### మేడారం జాతర ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్, సెప్టెంబరు 15(జర్నలిస్ట్‌ఫైల్):** వచ్చే జనవరిలో జరిగే మహా మేడారం జాతరను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం పనులను వేగవంతం చేసినట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఆదివారం మేడారం జాతరకు సంబంధించిన ఏర్పాట్లను ఆమె దగ్గరుండి పరిశీలిచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రహదారులు చాలా ముఖ్యమైనవని, జిల్లా ఎస్పీతోపాటు మేడారం సర్కిల్‌లో పనిచేసే పోలీస్ అధికారులతో కలిసి కొత్తరోడ్లను పరిశీలించినట్లు తెలి పారు. ప్రస్తుతం ఉన్న మార్గాలను వెడల్పు చేయడంతో పాటు కొత్తరోడ్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. అటవీ ప్రాంతంగుండా నూతన రహదారి మార్గా లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా కొండపర్తి నుంచి గోనెపల్లి, ముత్తాపురం మీదుగా పడికాపురం వరకు రహదారి సౌకర్యం కల్పిస్తున్నామని, కాల్వ పల్లి నుంచి కన్నెపల్లికి వచ్చే దారిని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కాల్వపల్లి నుంచి ఊరటం వరకు వచ్చే దారిలో బీటీ రోడ్డు వేస్తున్నామని, అడవి దారులను డెవలప్ చేసుకుని వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ జామ్ కాకుండా భక్తులందరూ మేడారం ఆలయం వరకు వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఛత్తీస్‌గడ్, ఖమ్మం వైపు నుంచి వచ్చే భక్తులకు చిన్నబోయినపల్లి మీదుగా ఊరటం దాకా రహదారి మార్గాన్ని కల్పిస్తామని,మేడారం మహా జాతర లోపు రూ 16.5 కోట్లతో కొండాయి బ్రిడ్జి కంప్లీట్ చేస్తామని,దీనికి సంబంధించి నిధులను సీఎం ఇప్పటికే మంజూరు చేశారు చేసినట్లు తెలిపారు. జాతర సమయంలో ఎక్కడికక్కడ అటవీ ప్రాంతంలో పార్కింగ్ ప్లేస్‌లను ఏర్పాటు చేస్తామని, మట్టి రోడ్లను, బీటి రోడ్లను ఏర్పాటు చేస్తాం వచ్చిపోయే భక్తులకు ఇబ్బంది లేకుండా డివైడర్లను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. సమ్మక్క సారలమ్మ కీర్తిని మరింత పెంచే విధంగా యజ్ఞంలా పనిచేస్తుట్లు తెలిపారు. కొంతమంది తమ ప్రయోజనాల కోసం దేవుడి దగ్గర చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసి పూజారుల ఆలోచన, విశ్వాసం నమ్మకం, ఆచారం లకు అనుగుణంగా సమ్మక్క సారలమ్మ గుడిని అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఒక ఆదివాసి బిడ్డగా ఆదివాసి జీవితాన్ని తెలిసిన వ్యక్తిగా మొదటి నుంచి ఆదివాసి సాంప్రదాయాలు ఆచారాలను కాపాడుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో కొందరు అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తే అడ్డుకున్నానని, ఆదివాసి సంప్రదా యాలకు భంగం వాటిల్లకుండా పనులు చేయించే బాధ్యత నాదిసమ్మక్క సారలమ్మ కీర్తి ఇనుమడింప చేసే విధంగా మేడారం ఆధునీకరణ పనులు జరుగుతాయన్నారు.

# గద్వాల జిల్లా కెటిఆర్ సభ అట్టర్‌ఫ్లాప్

### మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

**హైదరాబాద్, సెప్టెంబరు 15(జర్నలిస్ట్‌ఫైల్):** తేరు మైదానానికి ఒక చరిత్ర ఉందని, దాన్ని కెటిఆర్ అబద్దాలకు అడ్డగా మార్చి నడిగడ్డ ప్రతిష్టను దిగజార్చి పోయాడని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ మండిపడ్డారు. అలంపూర్ నియోజక వర్గంలో గెలిచిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు అభివృద్ధిపై ఆలోచన లేదు అని వారికి ఫ్యూడలిస్టు, శాడిస్ట్ రాజకీయాలు చేయడమే తప్ప ప్రజా సమస్యలపై అవగాహన లేదని సంపత్ కుమార్ అన్నారు.

శనివారం సభలో కెటిఆర్ మాట్లాడుతూ గురుకుల హాస్టల్‌లో ఎలుకలు దూరుతున్నాయని చేసిన విమర్శను సంపత్ కుమార్ తిప్పికొట్టారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నటువంటి రోజుల్లో తాను ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కలిసి కొట్లాడి అలంపూర్ నియోజకవర్గానికి అత్యధిక గురుకులాలను తీసుకువచ్చానని గుర్తుచేశారు. అలంపూర్ నియోజకవర్గంలో ఒక్కటంటే ఒక్క డబుల్ బెడ్ ఇల్లు కట్టలేదని, ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అలంపూర్ నియోజకవర్గంలో 3500 పైచిలుకు ఇందిరమ్మ ఇళ్లకు నిర్విఘ్నంగా నిర్మాణం జరుగుతుం దన్నారు. ఇది ప్రజాపాలనకు దర్పం పడుతుందని అన్నారు. పదేళ్ల రాజకీయంలో మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసేలా మాట్లాడడం తగదన్నారు.

పెద్ద ధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీ గురించి కూడా మాట్లాడే అర్హత కెటిఆర్‌కు లేదని సంపత్ కుమార్ అన్నారు.

టిఆర్ఎస్ పరిపాలనలోనే ఆ కంపెనీకి స్వయంగా కెటిఆర్ చేతుల మీదుగా 9 పర్మిషన్లు ఇచ్చాడు అని అన్నారు. దళితులు, బిసిల గురించి మాట్లాడే నైతికత కెటిఆర్‌కి లేదన్నారు.

# దేశ సమగ్రతకు పునాది హిందీ

### కులాలు, మతాల పేరిట దేశాన్ని విచ్ఛిన్నం చేయకండి: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్



అవార్డులను ప్రదానం చేస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 15 (జర్నలిస్ట్‌ఫైల్):** అధికార బాషగా హిందీ ఈ దేశ సమగ్రతకు బలమైన పునాదిగా నిలిచిందని పలువురు వక్తలు చెప్పారు. టిపిసిసి మైనార్టి సెల్ ఛైర్మన్ రాజేష్‌కుమార్ అగర్వాల్, తెలంగాణ హిందీ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎన్ఎస్ కుమార్ అధ్యక్షతన ఆదవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అధ్యసంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'హిందీ దివస్' కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధులుగా పిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్‌గౌడ్, గౌరవ అతిధులుగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హార్కర్ వేణుగోపాలరావు, ఎఐసిసి కార్యదర్శి శ్వినాథన్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక కమిషన్ ఛైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్ యుడు వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కొంతమంది తమ స్వార్థ రాజకీయల కోసం కులాలు, మతాలు పేరిట దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిం చారు. రాజకీయాలు అనేవి పదవుల కోసం మాత్రమేనని, ఇంకొందరు తమ పదవులు కాపాడు కోవ డానికి దిగజారుడు రాజకీయాలకు పాల్పడు తున్నారని ఆరోపించారు.

ఇది దేశ భవిష్యత్తుకు మంచిది కాదన్నారు. 1949లో భారత రాజ్యాంగ సభ హిందీని దేశ అధికార భాషగా ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రపం చీకరణ ప్రభావంతో ఇంగ్లీషుకు ప్రాధాన్యత పెరిగినప్పటికి హిందీ తన స్థానాన్ని కోల్పోలేదన్నారు. తెలంగాణ లౌకిక వాదానికి పెట్టింది పెరని, భాష, ప్రాంతం అనే భేదం లేదన్నారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ భాషలు, మతాలు వేరైనా మనమంతా భారతీయులమని, పరస్పరం గౌరవించుకుంటూ కలిసి, మేలిసి జీవించాలని, మర్యాదీలపై దాడులు సరికాదన్నారు.

హిందీ జర్నలిస్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.సర్వర్, ప్రదీప్ సురానీ, లక్ష్మీనారాయణ రాఠి, సిఎ మురళిమనోహర్ పలోడ్, భీమ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. హిందీ దివస్ సందర్భంగా పలువురికి ముఖ్య అతిధులు అవా ర్డులను ప్రదానం చేశారు.

# 'సెప్టెంబరు 17'ను తెలంగాణ విలీన దినోత్సవంగానే నిర్వహించండి

### సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు లేఖ

**(జర్నలిస్ట్‌ఫైల్)ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 15:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సెప్టెంబర్ 17ను గత ఏడాది తెలంగాణ ప్రజాపరిపాలన దినంగా నిర్వహించారని, ఈ ఏడాది కూడా అదే పేరుతో నిర్వహించనున్నట్లు తమకు తెలిసిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు తెలిపారు. విమోచన దినోత్స వాన్ని ప్రజాపాలన దినంగా నిర్వహించడం వల్ల నాటి చారిత్రాత్మక పోరాటాన్ని ఏ మాత్రం ప్రతిబింబించడం లేనందున తెలంగాణ విలీన దినోత్స వంగానే నిర్వహించడం సముచితమని పేర్కొన్నారు. ఇందుకు తగు నిర్ణయం తీసుకోవాలని ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. ఈ మేరకు ఆ వివరాలతో కూడిన ప్రకటనను కూనంనేని విడుదల చేశారు. నాటి మహత్తర తెలంగాణ స్వాతంత్ర్యోద్యమ, రైతాంగ సాయుధ పోరాట చరిత్రను రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాఠ్యాంశాలలో చేర్చాలని ఆయన సిఎంకు సూచించారు. అమరవీరుల స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, అందులో ఆనాటి పోరాటంలో అసువులు బాసిన అమరుల పేర్లను, ఫోటోలను ప్రతి గ్రామం నుంచి అధికారికంగా సేకరించి భావితరాలకు మార్గదర్శకంగా ఉండేలా స్మారక కేంద్రంలో మ్యూజియం ఏర్పాటు చేయాలని ఆ లేఖలో కోరారు. హైదరాబాద్‌లో నాటి పోరాట యోధులు రావి నారాయణ రెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి ఒకే చోట, దొడ్డి కొమరయ్య, షేక్ బందగీ, బొమ్మగాని ధర్మభిక్షం, చాకలి ఐలమ్మ లాంటి ఆనాటి సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ముఖ్య ప్రదేశాలలో ఏర్పాటు చేస్తే తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని కూనంనేని ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. తొలి సార్వత్రిక ఎన్నికల్లో నెహ్రూను మించిన మెజారిటీ పొందిన ప్రజానాయకుడు రావి నారాయణరెడ్డి విగ్రహాన్ని పార్లమెంటులో పెట్టాలని కోరారు. నాటి తెలంగాణ స్వాతంత్ర్య పోరాట నాయకుల పేర్లు చిరస్థాయిగా నిలిచే విధంగా వివిధ ప్రభుత్వ పథకాలకు, ప్రాజెక్టులకు నామకరణం చేయాలని సూచించారు. పలు సభలలో నాటి కమ్యూనిస్టు పార్టీ, నాయకులు చేసిన వీరోచిత పాత్రను శ్లాఘించడం, అలాగే వీరనారి చాకలి అయిలమ్మ పేరును మహిళా యూనివర్సిటీకి, తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టినందుకు కమ్యూనిస్టు పార్టీ తరపున ప్రత్యేకించి అభినందనలు తెలియజేస్తున్నామని సిఎంకు తెలిపారు. చరిత్రపై సంపూర్ణ అవగాహన ఉన్న వారిగా పై ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నానని కూనంనేని వెల్లడించారు.

## గ్రూప్-1 ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో రాకూడదని కెటిఆర్ కుట్ర

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 15(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో గ్రూప్ 1 ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో రాకూడదని కెటిఆర్ కుట్ర పన్నుతున్నారని ఎంపి చామల కిరణ్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. గ్రూప్ 1 పరీక్షలలో 563 అభ్యర్థుల దగ్గర మూడు కోట్ల రూపాయలు లెక్కన తీసుకొని ప్రభుత్వం వాళ్ళను ఎంపిక చేసిందని అంటున్నారు. మీ హయాంలో మీరెట్లా ఉద్యోగాలు ఇవ్వలేదు, మీ హయాంలో గ్రూప్ 1, 2, 3 4, పెట్టే పరిస్థితి లేదన్నారు. మా సిఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగల కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నారని అన్నారు. తల్లిదండ్రులు, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముందుకెళ్లుతున్నామని, న్యాయనిపుణుల సలహాలు తీసుకుని ఎట్టి పరిస్థితుల్లో కూడా అడ్డంకులు రావద్దన్న సదుద్దేశంతో గ్రూప్ 1 పరీక్షలు పెట్టామన్నారు. 563 మంది తల్లిదండ్రులు ఒక్కొక్కరు మూడు కోట్లు పెట్టే స్తోమత ఉంటుందా? మీ హయాంలో ఎవరికి ఉద్యోగాలు ఇవ్వని మీరు మీకు ఓటేయని ప్రజలు బాధపడుతూ ఉండాలనుకుంటున్నారా? అంటూ ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనం తప్ప ప్రజల మీద నీకు ప్రేమ లేదని, అమెరికాలో చదువుకుని ఉద్యోగం చేస్తూ ఇండియాకు వచ్చి మంత్రి పదవి చేపట్టిన నీకు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఎలా మాట్లాడతావు అంటూ ప్రశ్నించారు. రాజకీయ దురుద్దేశంతో ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారంటూ మండిపడ్డారు. తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కెటిఆర్‌కి గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికైన నిరుద్యోగుల తల్లిదండ్రులు మీడియా ముందుకు వచ్చి బుద్ది చెప్పాలన్నారు. శనివారం కెటిఆర్ మాట్లాడిన మాటలు నిజమా కాదా తెలియాలి అంటే తల్లిదండ్రులు స్పందించాలన్నారు.



పాతబస్తీ చార్మినార్ పరిసర ప్రాంతాల్లో మర్కాజి మిలాద్ ఊరేగింపు

## పాతనగరంలో మిలాద్ ఊరేగింపు..

### పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**హైదరాబాద్ (చార్మినార్), సెప్టెంబరు 15(జర్నలిస్ట్‌ఫైల్):** మిలాద్-ఉన్-నబీ సందర్భంగా పాతబస్తీలోని పలు ప్రాంతాలలో ఆదివారం నిర్వహించిన మిలాద్ ర్యాలీ ప్రశాంతంగా కన్నుల పండుగగా కొనసాగింది. దక్షిణ మండలం పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. చార్మినార్,గుల్జార్ హౌస్, మదీనా, దారుషిఫా, ఓల్గా హోటల్, శాలిబండ, హుస్సేనీఆలం, మొగల్‌పుర, భవానీనగర్, చాంద్రాయణగుట్ట,కాలాపత్తర్, కామాటిపుర బహదూర్‌పుర, నయాపూల్, సిటీ కళాశాల చౌరస్తా, మూసాబౌలి,మిశ్రీగంజ్, కాజీపుర, కిల్వత్, వట్టెపల్లి,కిషన్‌బాగ్,ఫత్తర్‌గట్టితో పాటు వివిధ ప్రాంతాలలో మిలాద్ ర్యాలీని నిర్వహించారు. పాతబస్తీ మిశ్రీ గంజ్ దర్గా నుంచి ప్రారంభమైన మిలాద్ ఊరేగింపు పలు ప్రాంతాల మీదుగా కొనసాగిన అనంతరం చార్మినార్‌కు చేరుకుంది. కాగా పాతనగరంలోని పలు ప్రాంతాలు నుంచి వచ్చిన ర్యాలీలు చార్మినార్‌వద్ద ప్రధాన ర్యాలీలో కలిశాయి.

ప్రశాంతమైన వాతావరణంలో ర్యాలీని నిర్వహించామని మిలాద్ మర్కాజీ ఊరేగింపు జాయింట్ కన్వీనర్,ఖాద్రియా ఇంటర్నేషనల్ సొసైటీ అధ్యక్షులు ఖాద్రి తెలిపారు. చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక నుంచి నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ ఊరేగింపులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ అదనపు కమిషనర్ విక్రమన్ సింగ్, దక్షిణ మండలం డిసిపి స్నేహ మెహ్రాతో పాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఊరేగింపులో ఒంటెలు, గుర్రాలు ఉన్నాయి. చార్మినార్, మక్కామసీదు, గుల్జారాహౌస్‌తోపాటు పలుచోట్ల వేదికలు ఏర్పాటు చేసి స్వాగతం పలికారు. మిలాద్ ఊరేగింపు సందర్భంగా పాతబస్తీలోని పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. చార్మినార్, గుల్జారాహౌస్, మదీనా ప్రధాన రహదారులలో నిలబడి ప్రజలు మిలాద్ ఊరేగింపును తిలకించారు. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపు ప్రశాంతంగా జరిగిందని చార్మినార్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

## పెరిగిన చికెన్ ధరలు

**హైదరాబాద్, సెప్టెంబరు 15(జర్నలిస్ట్‌ఫైల్):** నాన్ వెజ్ ప్రియులకు భారీ షాక్ తగిలింది. రాష్ట్రంలో చికెన్ ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. హైదరాబాద్‌తో సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కిలో చికెన్ ధర 240 రూపాయలుగా ఉంది. వారానికి సుమారు 20 రూపాయల చొప్పున ధర పెరుగుతూ వచ్చి ప్రాంతాలను బట్టి ఇప్పుడు ఏకంగా 240 నుండి 260 రూపాయల వరకూ ధర పలుకుతోంది. దీంతో సాధారణ, మధ్య తరగతి కుటుంబాలకు చికెన్ ధరల పెరుగుదల పెద్ద భారమైంది. వారానికి ఒకటి రెండు సార్లు చికెన్ తినే వారు ఇప్పుడు వినియోగాన్ని తగ్గించుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా చేపలు, గుడ్ల వైపు మొగ్గుచూపుతున్నారు. కాగా ఇప్పటి వరకూ శ్రావణ మాసం, వినాయక చవితి కారణంగా అంతగా డిమాండ్ లేకుండా ఉండటంతో చికెన్ ధరలు స్థిరంగా ఉన్నాయి. అయితే దసరా పండుగ సమయం దగ్గరపడు తుందటంతో మళ్లీ చికెన్ కొనుగోళ్లు విపరీతంగా పెరిగాయి. దసరా సంద ర్భంగా ఇంటింటా విందులు, వేడుకలు ఉండటంతో చికెన్‌కు డిమాండ్ ఏర్పడింది.

## పాత పెన్షన్ అమలు చేసే పార్టీలకే మా ఓటు

### పాట్నా పెన్షన్ సంఘర్ష్ సభలో ఎన్‌ఎంఒపిఎస్ సెక్రటరీ జనరల్

**హైదరాబాద్, సెప్టెంబరు 15(జర్నలిస్ట్‌ఫైల్):** పాత పెన్షన్ అమలు చేసేవారికి ఓటు వేయాలని నేషనల్ మూవ్మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ పిలుపునిచ్చారు. ఆదివారం బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో మిల్లర్ హై స్కూల్ గ్రౌండ్ లో ఆధ్వర్యంలో పెన్షన్ సంఘర్ష్ భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు,ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాష్ట్రప్రభుత్వ ఉద్యోగి పెన్షన్ రాష్ట్ర పరిధిలోనిది. ఇటీవల దేశంలో పార్టీలు తమ మ్యానిఫెస్టోలో సిపీఎస్ రద్దు పాత పెన్షన్ అమలు చేస్తామని తెలంగాణ, కర్ణాటక లో సిపీఎస్ ఉద్యోగుల మద్దతుతో అధికారంలోకి వచ్చాయన్నారు. ఇప్పుడు ఈ ఎన్నికల్లో బీహార్ లో కాంగ్రెస్ పార్టీ ,రాష్ట్రీయ జనతా దళ్‌లు, తెలంగాణ ,కర్ణాటక ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ఆయా రాష్ట్రాల్లో పాత పెన్షన్‌ను పునరుద్ధరించకుండా బీహార్‌లో సిపీఎస్ ఉద్యోగుల ఆయా పార్టీలకు మద్దతు ఇస్తున్నారన్నారు. ఇటీవల కేంద్రం యూ.పి.యెస్ ప్రకటించడం ద్వారా, రెండు దశాబ్దాల తర్వాత ఎన్.పి.యెస్ నిష్ప్రయోజనమైందన్నారు. ఉద్యోగికి కంట్రిబ్యూషన్ తో సంబంధం లేకుండా ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ యూ. పి.యెస్ విధానం ద్వారా ఇప్పటికి ఎన్. పి.యెస్ ట్రస్ట్ ద్వారా షేర్ మార్కెట్ లో పెట్టుబడులు పెట్టిన 10.53 లక్షల కోట్లకు మరింతగా కంట్రిబ్యూషన్ ను పెంచి ప్రవేటు పెట్టుబడిదారులకు అప్పజెప్పడమేనన్నారు. 2004 నుండి అమల్లోకి తెచ్చిన పి.ఎఫ్ ఆర్ డి ఏ బిల్లు 2013 సెప్టెంబర్ లో పార్లమెంట్‌లో పాస్ చేయించారని ఇప్పటివరకు వ జమైన మొత్తం నిధి అంతా ఇష్టా రాజ్యంగా షేర్ మార్కెట్ లోకి పెట్టుబడులుగా వెళ్లాయని ఆయన ఆరోపించారు. ఎన్. పి.యెస్ పై నిరసనలు వెల్లువెత్తటంతో, కావాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు మార్చుకోవచ్చని అంటూనే ఇన్నాళ్ళు ఎన్.పి.ఎస్ లో జమకాబడిన మొత్తాలను కేంద్రం ఇవ్వదని ఓపీఎస్ ను పునరుద్ధరించిన రాష్ట్రాలకు స్పష్టం చేయడం ,రాష్ట్ర ఉద్యోగుల పై రాష్ట్రాల అధికార స్వేచ్ఛ హరించడమేన్నారు.




## యార్లగడ్డ డిమాండ్ మేరకు ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీ ఏర్పాటు

గన్నవరం, సెప్టెంబర్ 15(జర్నలిస్ట్‌ఫైల్):

గన్నవరం నియోజకవర్గం లో ఎట్టకేలకు విజయవాడ రూరల్ మండలంలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికార యంత్రాంగం స్పందించింది. గన్నవరం నియోజకవర్గం విజయవాడ రూరల్ మండల పరిధిలోని తొమ్మిది గ్రామాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని పరిరక్షించాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు డిమాండ్ మేరకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా స్పందించి ప్రభుత్వభూముల ఆక్రమణల నిగ్గు తెల్చేందుకు అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. గత నెలలో జరిగిన ఎన్టీఆర్ జిల్లా సమీక్ష మండలి సమావేశంలో ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలోని విజయవాడ రూరల్ మండలంలో గల తొమ్మిది గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయని లేఅవుట్లలోని కామన్ సైట్లను సైతం ఆక్రమించిన ఆక్రమణదారులు క్రయ విక్రయలు చేస్తూ అక్రమంగా డబ్బు గడిస్తున్నారని ఆరోపించారు. ఈ తొమ్మిది గ్రామాల్లోని లేఔట్లలో ఎక్కడా కామన్ సైట్ కనిపించడం లేదని సమావేశం దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ భూముల ఆక్రమణ లపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ఈ సమావేశంలో యార్లగడ్డ వెంకట్రావు అధికారులను కోరారు. కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములు అక్రమార్కుల పాలవుతున్నాయని ఇప్పటికైనా వాటిని పరిరక్షించేందుకు అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. యార్లగడ్డ విజ్ఞప్తి మేరకు స్పందించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా మంచి విషయాన్ని ప్రస్తావించారని కితాబిచ్చారు. ఈ సమస్య పరిష్కారానికి కమిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు విజయవాడ ఆర్డిఓ, ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి, విజయవాడ రూరల్ మండలం తాసిల్దార్, ఎంపీడీవో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో కమిటీని ఏర్పాటు చేస్తూ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇల్లక్య ఉత్తర్వులు జారీ చేశారు. తన విజ్ఞప్తి మేరకు స్పందించి కమిటీని ఏర్పాటు చేసిన జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ లకు యార్లగడ్డ ధన్యవాదాలు తెలిపారు.

## రామిలేరు వాగులో పడిపోయిన నీరజ కోసం ఎస్ డి ఆర్ఎఫ్ గాలింపు చర్యలు



ఆగిరిపల్లి, సెప్టెంబర్ 15(జర్నలిస్ట్‌ఫైల్):

రాజీవీడు మండలం తుక్కులూరు శివారు రామిలేరు వాగులో ప్రమాదవశాత్తు పడిపోయిన విద్యార్థిని బడిపాటి నీరజ, గాలింపు కోసం రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశానుసారం పోలీస్ శాఖ మరియు రాష్ట్ర విపత్తు నిర్వహణ సిబ్బంది (స్ డి ఆర్ఎఫ్) చిన్నారి నీరజ ఆచూకి కోసం గాలింపు చర్యలు చేపట్టారు, జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి తో మాట్లాడి అవసరమైన చర్యలు త్వరిగతిన చేపట్టాలని ఆదేశించారు. మంత్రి కార్యాలయ సిబ్బంది అధికారులతో సమన్వ యం చేసుకుంటూ గాలింపు చర్యలలో బాగమయ్యారు.

## స్త్రీ శక్తితో సాధికారతకు సరికొత్త ఉత్తేజం

- పథకం భేష్ అంటూ ఆనందం, సంతృప్తి వ్యక్తం చేస్తున్న మహిళామణులు
- లబ్ధిదారులతో ముచ్చటించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, సెప్టెంబర్ 15(జర్నలిస్ట్‌ఫైల్):

స్వాతంత్ర్య దినోత్సవం రోజున రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతంగా అమలవుతోందని.. స్త్రీ శక్తితో మహిళా సాధికారతకు సరికొత్త ఉత్తేజం వచ్చిందని, లబ్ధిదారులు ఆనందంతో చెబుతున్న మాటలే ఇందుకు నిదర్శనమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఆదివారం కలెక్టర్ లక్ష్మీశ విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌ను సందర్శించి వివిధ మార్గాల్లో వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బస్సుల్లోని మహిళా ప్రయాణికులతో మాట్లాడారు. మీరు ఎక్కడికి వెళ్తున్నారు.. పథకం ఎలా ఉంది.. ఏమైనా సమస్యలున్నాయా.. మిమ్మల్ని ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా? అంటూ మాట కలిపారు. విద్యార్థులతోనూ ముచ్చటించారు. పథకం చాలా బాగుందని, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేవంటూ ముఖంపై చిరునవ్వుతో బదులిచ్చారు. ఏవైనా ఇబ్బందులుంటే 1100 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేసి చెప్పొచ్చని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ విద్య, ఉద్యోగం, ఉపా ధి, ఇతర అవకాశాలకోసం ఆర్థిక భారం లేకుండా బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తూ సాధికారతతో సరికొత్త మైలురాళ్లను చేరుకుంటున్నారన్నారు. విద్య అనేది మనిషి జీవితానికి వెలుగునిస్తుందని.. బాలికా విద్యను కూడా ప్రోత్సహించేందుకు ఈ పథకం దోహదం చేస్తోందన్నారు. ప్రయాణ ఖర్చుల ఊసే లేకుండా తమ పనులను చక్కదిద్దుకుంటూ ఆర్థిక ప్రగతిలో భాగస్వాము లవుతున్నారని.. ఇంత మంచి పథకం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

# శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శాస్త్రోక్తంగా మండలాభిషేకం





విజయవాడ, సెప్టెంబర్ 15(జర్నలిస్ట్‌ఫైల్):

విజయవాడలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం ఉదయం మండలాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉద యం 8.30 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ట, శాంతి హోమం, అష్టోత్తర శత కలశాభిషేకం, పూర్ణాహుతితో మండ లాభిషేకం ఘనంగా ముగిసింది. సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి శాంతి కళ్యాణం నిర్వహించారు. సాధారణంగా టిటిడి అనుబంధ ఆలయాల్లో ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి అష్ట బంధన మహా సంప్రోక్షణ నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈ ఏడాది జూలైలో మహా సంప్రోక్షణ నిర్వహించిన విషయం తెలిసిందే. మహా సంప్రోక్షణ తర్వాత 45 రోజులకు మం డలాభి షేకం నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో టిటిడి అధికారులు ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## విశాఖలో కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలిసిన బీజేపీ నేత డాక్టర్ ఏలూరి

విశాఖపట్నం, సెప్టెంబర్ 15(జర్నలిస్ట్‌ఫైల్):



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చేపట్టిన సారథ్యం రాష్ట్రవ్యాప్త పర్యటన ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా విశాఖలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఫార్మా పరిశ్రమల అభివృద్ధి గురించి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నడ్డా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ తో కలిసి బీజేపీ నేత, ప్రముఖ ఫార్మా కంపెనీ అధినేత డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి నడ్డాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఫార్మా రంగ అభివృద్ధి,విస్తరణపై చర్చలు జరిపారు. డాక్టర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, "నడ్డా ఆధ్వర్యంలో భారత ఫార్మా రంగం అద్భుతంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ఎన్నడూ లేనివిధంగా గత పదేళ్లలో భారత ఔషధ ఎగుమతులు గణనీయంగా పెరిగాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫార్మా రంగానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని.. విశాఖపట్నం దేశవ్యాప్తంగా ఫార్మా హబ్‌గా ఎదగగల సామర్థ్యం కలిగి ఉంది. దీనికి కేంద్రం నుంచి మరింత మద్దతు లభిస్తే, పరిశ్రమల విస్తరణ వేగవంతమవుతుంది, వేలాది ఉద్యోగాలు సృష్టించబడతాయని పేర్కొన్నారు. అదేవిధంగా మెడికల్ డివైసెస్ అభివృద్ధికి కేంద్రం నుంచి ప్రత్యేక సహకారం ఇవ్వాలని నడ్డాని అభ్యర్థిం చానన్నారు. వైద్యరంగం లో సాంకేతి కతను పెంచడానికి, నాణ్యమైన పరికరాలను దేశీయం గానే తయారు చేసుకోవడానికి ఇది కీలకమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా 36 రకాల క్యాన్సర్ మందులపై జీఎస్టీ రద్దు చేసినం దుకు నడ్డాకు కృతజ్ఞతలు తెలిపా రు. ఈ నిర్ణయం వేలాది రోగులకు ఆర్థిక భారం తగ్గిం చడమే కాక, చికిత్స సులభతరం చేస్తుందని అభిప్రా యపడ్డారు. విశాఖపట్నం భవిష్యత్తులో దేశ ఫార్మా రంగానికి ప్రధాన కేంద్రంగా నిలవాలని.. కేంద్రం నుంచి సహకారం మరింత పెరిగితే ఈ లక్ష్యం త్వరలోనే నెరవేరుతుంది అని ఏలూరి విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఖబడ్దార్ జోగి రమేష్

- అవినీతికి ఆద్యుడు జోగి రమేష్
- మంత్రిగా ఉన్నప్పుడు కొండలు కొల్లగొట్టాడు
- బూడిదను దోచేశాడు.. అగ్రిగోల్డ్ భూములు కాజేశాడు..ఉద్యోగాలు అమ్ముకున్నాడు
- ఇతను ఎమ్మెల్యే వసంతను విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లే
- జి.కొండూరులో తెదేపా నేతలు



జి.కొండూరు, సెప్టెంబర్ 15(జర్నలిస్ట్‌ఫైల్):

ఖబడ్దార్ జోగి రమేష్ అని, నోరు అదుపులో పెట్టుకోకుంటే తీవ్రపరిణామాలు చూడాల్సి వస్తుందని, మాజీ మంత్రి జోగి రమేష్ ను జి కొండూరు మండల తెలుగుదేశం నాయకులు హెచ్చరించారు. మాజీ మంత్రి జోగి రమేష్ వ్యవహార శైలి దయ్యాలు వేదాలు వల్లించి నట్లుగా ఉందని, అతను స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ గారిని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. జి.కొండూరులో తెలుగు దేశం పార్టీ నాయకులు ఉయ్యూరు నరసింహారావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి లంకా నాగేశ్వర రావు, మాజీ అధ్యక్షులు పజ్జూరు రవికుమార్ (వెంకయ్య), మాజీ కార్యదర్శి లంకా రామకృష్ణ, జి.కొండూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు పజ్జూరు విజయ్ తదితరులు మీడియాతో మాట్లాడుతూ అవినీతికి ఆద్యుడు జోగి రమేష్ అని పేర్కొన్నారు. మంత్రిగా ఉన్నప్పుడు జోగి రమేష్ విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో కొండలు కొల్లగొట్టా డని, ఇబ్రహీంపట్నంలో బూడిదను దోచేశాడని, అగ్రిగోల్డ్ భూములు కాజేశాడని, ఉద్యోగాలు అమ్ముకున్నాడని, పేదల రక్తాన్ని జలగలా పీల్చాడని పేర్కొన్నారు. ఇతని వ్యవహారం చుస్తే దొంగే దొంగ అని అరచినట్లు ఉందన్నారు.మాజీ మంత్రి జోగి రమేష్ నోటిని ఓ డ్రైనేజీ కంపుగా అభివర్ణించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు కి విమర్శించే అర్హత జోగి రమేష్ కు లేదన్నారు. అతని బుద్ధి కుక్క తోక వంకర అన్న చం దంగా ఉందన్నారు. మైలవరంలో చీ కొట్టినా, పెడనలో తరిమి కొట్టినా, పెనమలూరులో ఓడించినా జోగికి బుద్ధి మారలేదన్నారు. ఇకనైనా వంకర బుద్ధిని మార్చు కోవాలని జోగికి సూచించారు.

# అవినీతిపరుడివి, అసమర్థుడవి నీవా మా ఎమ్మెల్యేని విమర్శించేది

- ఎమ్మెల్యే వసంతని విమర్శించే స్థాయి నీది కాదు

మైలవరం. సెప్టెంబర్ 15(జర్నలిస్ట్‌ఫైల్):



మైలవరం మండలం, స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కార్యాలయం నందు కూటమి నాయకులు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మాజీమంత్రి జోగి రమేష్ మాట్లాడిన తీరును తీవ్రంగా ఖండించారు. ఐదు సంవత్సరాలు అధికారంలో ఉండి మీ నాయకుడికి ఇష్టమైన ప్రతిపక్ష నాయకుడి ఇళ్ల పై దాడి చేసి మంత్రి పదవి పొందిన నీవు ఒక రాజకీయ వ్యభిచారివి నీవా మా ఎమ్మెల్యేని విమర్శించే దీ.. ఐదేళ్ల అధికారంలో ఉండి బూడిద, మట్టి లో ఎంత అవినీతి అక్రమాలు జరిగాయి ప్రజలందరికీ తెలుసు కాబట్టే ఈరోజు మీకు గతి పట్టింది. గత ఐదు సంవత్సరాలు నీది మైలవరం నియోజవర్గం కాకపోయినా ఒక వర్గాన్ని ఏర్పాటు చేసుకొని ఎమ్మెల్యే వసంత పై నువ్వు ఎన్ని ఆరోపణలు చేసిన,ఎన్ని ఇబ్బందులు పెట్టిన మైలవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తూనే ఉన్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మైలవరం నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించే క్రమంలో రాజకీయాలు చేయట్లేదు ఒక్కసారి నీ మీద దృష్టి పెడితే నీవు జీవితములో రాజకీయాల గురించి మాట్లాడ లేవు.అసమర్ధుడువై ఉండి అవినీతిపరుడువై నుండి దాడులు, దౌర్జన్యాలు, అక్రమాలు, దాచుకోవడం, దోచుకోవడం అను సిద్ధాంతాలతో నడిచిన పార్టీలో నీవు ఉండి అభివృద్ధి,సంక్షేమం అనే సిద్ధాంతంతో కూటమి ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా వసంత కృష్ణ ప్రసాద్ మైలవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి సంక్షేమం తో ముందుకు వెళుతుంటే, రాజకీయ ఉనికి లేని నీవు మా ఎమ్మెల్యేనీ విమర్శించే స్థాయిని కాదని మరొకసారి తెలియజేస్తున్నాం. రాజకీయంగా విమర్శిం చే ముందు నీ స్థాయి నీ అర్హత ఏంటో విమర్శలు చెయ్యాలని, నువ్వు చేసిన ఆరోపణలని నిరూపించ కపోతే నీ జీవితాంతం రాజకీయ సన్యాసం తీసుకుం టావా అని ఛాలెంజ్ విసిరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



# వలసలపై లండన్‌లో భారీ నిరసనలు

## మరోవైపు వలసదారులకు మద్దతుగా ర్యాలీలు

## హింసాత్మకంగా మారిన లండన్ వీధులు



**లండన్, సెప్టెంబరు 15:** యునైటెడ్ కింగ్‌డమ్ రాజధాని లండన్‌లో శనివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఫార్‌రైట్ కార్యకర్త టామీ రాబిన్‌సన్ నిర్వహించిన యునైట్ ది కింగ్‌డమ్ ర్యాలీ హింసాత్మకంగా మారింది. వలస విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన ఈ ప్రదర్శనలో నిరసనకారులు పోలీసులతో ఘర్షణకు దిగారు.

ఈ ఘటనల్లో 26 మంది పోలీసు అధికారులు గాయపడగా, 25 మందిని అరెస్ట్ చేశారు. మెట్రోపాలిటన్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం ఈ ర్యాలీకి ఊహించిన దానికంటే చాలా ఎక్కువ సంఖ్యలో సుమారు 1.10లక్షల నుంచి 1.5 లక్షల మంది ప్రజలు హాజరయ్యారు. ప్రదర్శన చివరి దశలో కొంతమంది నిరసనకారులు అదు పుతప్పి పోలీసులపై బాటిళ్లు విసిరి దాడులకు పాల్పడ్డారు. ప్రత్యర్థి వర్గాల నిరసనకారులను వేరుచేయడానికి ఏర్పాటు చేసిన బారికేడ్లను ఛేదించడానికి ప్రయత్నించారు. ఈ దాడుల్లో నలుగురు అధికారులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరికి పళ్లు విరగగా, మరొకరికి వెన్నెముకకు గాయమైందని, ఇంకొకరికి ముక్కు విరిగి ఉండొచ్చని అధికారులు తెలిపారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అదనపు బలగాలను మోహరించాల్సి వచ్చింది. టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ ఓ వీడియోలో మాట్లాడుతూ భారీగా, అనియంత్రితంగా వస్తున్న వలసలతో బ్రిటన్ నాశనమవుతోందని వ్యాఖ్యానించారు. మా దేశాన్ని మాకు తిరిగి ఇవ్వండి, పడవలను ఆపండి వంటి ప్లకార్డులతో నిరసనకారులు కవాతు నిర్వహించారు. ఇదే సమయంలో స్టాండ్ అప్ టు రేసిజం సంస్థ ఆధ్వర్యంలో సుమారు 5,000మందితో వలసదారులకు మద్దతుగా మరో ప్రదర్శన కూడా జరిగింది. వేల మంది నగర వీధుల్లోకి వచ్చి తమ నిరసనలను తెలియజేశారు. ఒకవైపు వలసదారులపై వ్యతిరేకతను వ్యక్తంచేస్తూ ఆందోళనలు జరగగా మరోవైపు జాత్యహంకారాన్ని ఖండిస్తూ 'స్టాండప్ టు రేసిజమ్' అనే నినాదంతో మరో ర్యాలీ జరిగింది. ఈ రెండు ర్యాలీల నేపథ్యంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు భారీఎత్తున మోహరించారు.

అయినప్పటికీ ర్యాలీలు హింసాత్మకంగా మారడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. లండన్ వీధుల్లో వలసదారుల వ్యతిరేక ర్యాలీలో వేలమంది పాల్గొన్నారు. వలసలవల్ల తమ దేశంలో ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని, సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని వారు ఆందోళనవ్యక్తంచేశారు. ఈ నిరసనకారులు తమ డిమాండ్లను గట్టిగా వినిపించడానికి నినాదాలు చేస్తూ ప్లకార్డులు పట్టుకుని నగరంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ తీశారు. కానీ ఈ ర్యాలీలో కొంతమంది నిరసనకారులు హద్దులు దాటడంతో హింసాత్మకంగా మారింది. పోలీసులపై వాటర్ బాటిళ్లు, రాళ్లు రువ్వారు. దాంతో పోలీసులు 26 మందిని అదుపులోకి తీసుకున్నారు. అదే సమయంలో నగరంలో మరో నిరసన ర్యాలీ కూడా జరిగింది.

స్టాండ్ అప్ టు రేసిజమ్ అనే సంస్థనాయకత్వంలో జాత్యహంకారానికి వ్యతిరే కంగా 5వేల మంది ర్యాలీలో పాల్గొన్నారు. సమాజంలో సమానత్వం, ఐక్యతను ప్రోత్సహించాలని నిరసనకారులు కోరారు. వివిధ జాతులు, సంస్కృతుల ప్రజలు ఒకే దేశంలో సామరస్యంగా జీవించాలని పిలుపునిచ్చారు. శాంతియుతంగా తమ నిరసనను తెలియజేశారు. ప్లకార్డులు, బ్యానర్‌లు పట్టుకుని, నినాదాలు చేస్తూ, జాత్యహంకార వివక్షను ఖండిస్తూ ముందుకు నడిచారు.



# భారత్ పాకిస్థాన్ మ్యాచ్‌కు నిరసనగా టీవీల ధ్వంసం

## భారీ ఆందోళనలు జరిపిన శివసైనికులు

**ముంబయి, సెప్టెంబరు 15:** ఆసియా కప్ 2025లో భాగంగా భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య ఆదివారం జరగనున్న క్రికెట్ మ్యాచ్ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ మ్యాచ్ ను వ్యతిరేకిస్తూ శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే వర్గం) పార్టీ కార్యకర్తలు ముంబైలో ఆందోళన చేపట్టారు. పార్టీ అధికార ప్రతినిధి ఆనంద్ దూబే నేతృత్వంలో నిరసనకారులు టీవీ సెట్లను పగలగొట్టి, కేంద్ర ప్రభుత్వానికి, బీసీసీఐకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆనంద్ దూబే మాట్లాడుతూ, పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశమని, అలాంటి దేశంతో అన్ని రకాల సంబంధాలను తెంచుకోవాలని డిమాండ్ చేశారు. మ్యాచ్ నిర్వహణకు అనుమతి ఇవ్వడం ద్వారా మోదీ ప్రభుత్వం మన సోదరీమణుల సిందూరాన్ని అవమానిస్తోందని తీవ్రంగా ఆరోపించారు. దీనికి గుర్తుగా మహిళా కార్యకర్తలు చేతిలో సిందూరం పట్టుకుని నిరసన తెలిపారు. దుబాయ్ లో జరగనున్న ఈ మ్యాచ్ ను మేము వ్యతిరేకిస్తున్నాం. ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని భారత ప్రభుత్వాన్ని కోరుతున్నామని దూబే అన్నారు. పహల్గామ్ లో తమ ఆప్తులను కోల్పోయిన సోదరీమణులు, తల్లులు ఈ మ్యాచ్ ను ఎలా చూడగలరని ఆయన ప్రశ్నించారు. ప్రధాని మోదీ ఈ మ్యాచ్ ను ఆపాలి వారి మనోభావాలతో ఆడుకోవద్దు, బీసీసీఐకి, జైషాకు తమ తప్పు తెలిసేలా విరాళాలు పంపుతున్నామని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారత క్రికెటర్లు కూడా ఈ మ్యాచ్ ను బహిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఒకవేళ ఆటగాళ్లు ఈ మ్యాచ్ ను బహిష్కరిస్తే, మేము వారికి అండగా నిలుస్తాం. అలా కాకుండా ఆడితే మాత్రం, వారి తీరును కూడా ఖండిస్తామని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఈ నిరసనల మధ్య, ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భారత కాలమానం ప్రకారం రాత్రి 8:00 గంటలకు భారత్‌పాకిస్థాన్ మ్యాచ్ ప్రారంభం కానుంది.

# యుద్ధాల ఆంక్షలతో సమస్యలు పరిష్కరించలేరు

## చైనా తీవ్ర స్పందన



**బీజింగ్, సెప్టెంబరు 15:** తమ దేశంపై 50 నుంచి 100 శాతం టారిఫ్‌లు విధించాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనపై చైనా తీవ్రంగా స్పందించింది. యుద్ధాలు, ఆంక్షల ద్వారా సమస్యలను పరిష్కరించలేమని, అవి పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తాయని గట్టిగా బదులిచ్చింది. వివాదాస్పద అంశాల పరిష్కారానికి శాంతియుత చర్చలకే తాము కట్టుబడి ఉన్నామని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ స్పష్టం చేశారు. స్లోవేనియా పర్యటనలో భాగంగా ఆ దేశ ఉప ప్రధాని తాన్యా ఫజోన్‌తో సమావేశం అనంతరం వాంగ్ యీ విలేకరులతో మాట్లాడారు. చైనా ఎప్పుడూ యుద్ధాలలో పాల్గొనదు, వాటిని ప్రోత్సహించదు. చర్చల ద్వారా రాజకీయ పరిష్కారాలను ప్రోత్సహించడమే మా విధానం అని అన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ సమాజం గందరగోళం, ఘర్షణలతో నిండి ఉందని, ఈ సమయంలో బహుళపాక్షిక విధానాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. చైనా, యూరప్‌లు ప్రత్యర్థులుగా కాకుండా మిత్రులుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు, డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధం ముగిసే వరకు నాటో కూటమి చైనాపై 50 నుంచి 100 శాతం టారిఫ్‌లు విధించాలి. రష్యాపై చైనాకు బలమైన పట్టు ఉంది. ఈ భారీ సుంకాలు ఆ పట్టును విచ్ఛిన్నం చేస్తాయి. తద్వారా ఈ భయంకరమైన యుద్ధానికి ముగింపు పలకవచ్చు అని ట్రంప్ పోస్ట్ చేశారు. గతంలో కూడా ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. అమెరికాకు వ్యతిరేకంగా జిన్‌పింగ్ కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. అయితే, ఆసక్తికరంగా, ఈ ఆరోపణలు చేసిన కొన్ని గంటలకే చైనా నాయకత్వంతో తన వ్యక్తిగత సంబంధాలు చాలా బాగున్నాయని చెప్పడం గమనార్హం.

# జెన్‌జడ్ ఉద్యమంలో మృతులకు 'అమరవీరుల హోదా'

## నేపాల్ తాత్కాలిక ప్రధాని సుశీలా కర్కి

**ఖాట్మండు, సెప్టెంబరు 15:** జెన్‌జడ్ యువత చేపట్టిన భారీ ఆందోళనల కారణంగా కేపీ శర్మ ఓలీ ప్రభుత్వం కుప్పకూలిన కొన్ని రోజులకే ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కి తాజాగా కీలక ప్రకటనలు చేశారు. తమ ప్రభుత్వం కేవలం ఆరు నెలల పాటే అధికారంలో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సుశీల కర్కి మాట్లాడుతూ తానుగానీ, తన బృందం గానీ అధికారాన్ని రుచి చూడటానికి ఇక్కడికి రాలేదు. ప్రజలకు సేవ చేయడానికే బాధ్యతలు చేపట్టాం. ఆరు నెలలకు మించి ఒక్క రోజు కూడా అధికారంలో కొనసాగం. కొత్తగా ఎన్నికయ్యే పార్లమెంటుకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు. దేశ పునర్నిర్మాణానికి ప్రజలందరి సహకారం అవసరమని, వారి మద్దతు లేకుండా తాము విజయం సాధించలేమని అన్నారు. ఇటీవల జరిగిన ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని అధికారికంగా 'అమరవీరులు'గా గుర్తిస్తామని కర్కి హామీ ఇచ్చారు. ఇది ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రభుత్వం ఇస్తున్న గౌరవంగా భావిస్తున్నారు. అదే సమయంలో నిరసనల సందర్భంగా జరిగిన విధ్వంసకర ఘటనలపై విచారణ జరిపిస్తామని ఆమె స్పష్టం చేశారు. అధికారం కోసం కాకుండా దేశాన్ని తిరిగి గాడిన పెట్టడానికే తాము వచ్చామని ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నేపాల్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# వరద సాయం ఉగ్ర సంస్థల పరం

## పాకిస్థాన్‌లో లష్కరే స్థావరాల పునరుద్ధరణ



**ఇస్లామాబాద్, సెప్టెంబరు 15:** ఉగ్రవాదులతో తమకు సంబంధం లేదని ప్రపంచ వేదికపై మేకపోతు గాంభీర్యాలు పలికే పాకిస్థాన్ లోలోపల ఉగ్రస్థావరాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు భారత నిఘా వర్గాలు వెల్లడించాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా భారత్ పాక్‌లోని అనేక ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. అయినా బుద్ధి మారని దాయాది దేశం తినడానికి లేకపోయినా కూడా వరద బాధితుల పేరుతో సేకరించిన నిధులను ఉగ్ర స్థావరాల పునరు ద్ధరణకు ఖర్చు చేస్తున్నట్లు భారత నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వైమానిక దళం ధ్వంసం చేసిన లష్కరే ప్రధాన క్యాంపు కార్యాలయం మర్కాజ్ తోయిబాను పునర్నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. ధ్వంసమైన లష్కరే తోయిబా ప్రధాన కార్యాలయ విభాగాలను తొలగించడానికి దాని చుట్టూ భారీ యంత్రాలను మోహరించి ఉన్న దృశ్యాలు ఉపగ్రహ చిత్రాల్లో కనిపిస్తున్నట్లు భారత నిఘా వర్గాలు వెల్లడించాయి. దీనిని పునర్నిర్మించిన తర్వాత మళ్లీ ఉగ్రవాదులకు శిక్షణ స్థావరంగా ఉపయోగించనున్నట్లు తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ధ్వంసమైన ఎల్‌ఇటికి ఆగస్టులో పాక్ ప్రభుత్వం నుంచి రూ. 1.25 కోట్లు ఇవ్వగా.. పునరుద్ధరణకు అయ్యే మొత్తం ఖర్చు సుమారు రూ. 4.7 కోట్లకుపైగా ఉంటుందని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. వీటికి కావాల్సిన నిధులను సేకరించడానికి పాక్ మేకవన్నె పులిలా మానవతావాద ముసుగులో ప్రచారాలు చేపడుతోంది. వరద ప్రభావిత ప్రాంతాల సహాయం పేరుతో విరాళాలు సేకరించి ఉగ్ర సంస్థలకు మళ్లిస్తోంది.

# మోడీ మణిపూర్ పర్యటన కంటితుడుపు చర్యే

## ఏఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 15:** కల్లోలిత మణిపూర్‌లో ప్రధాని పర్యటన కేవలం ఒక పిట్‌స్టాప్ వంటిది మాత్రమేనని ఏఐసిసి అధ్యక్షుడుఖర్గే వాదించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. మోదీ పర్యటన కేవలం ఒక పిట్ స్టాప్ (చిన్న విరామం) మాత్రమేనని ఇది రాష్ట్ర ప్రజలకు తీవ్ర అవమానం అని ఘాటుగా వ్యాఖ్యానించారు. చురాచంద్‌పూర్, ఇంఫాల్‌లలో పర్యటించడానికి వచ్చిన మోదీపై ఖర్గే సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడ్డారు. నరేంద్ర మోదీ గారు.. మణిపూర్‌లో మీ 3 గంటల పర్యటన కనికరం కాదు. ఇది ఒక ప్రహసనం. కేవలం ప్రదర్శన కోసం మాత్రమే. రిలీఫ్ క్యాంప్‌లలోని ప్రజల రోదనలు వినకుండా పారిపోవడమే మీ ఉద్దేశ్యం అని ఆయన పోస్ట్ చేశారు. అక్కడితో ఆగకుండా హింస మొదలైన ఈ 864 రోజుల్లో 300 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. మొత్తంగా 67,000 మంది నిరాశ్రయులు అయ్యారని చెప్పారు. అంతేకాకుండా 1,500 మందికి పైగా గాయపడ్డారని తెలిపారు. ఈ సమయంలో మీరు 46 విదేశీ పర్యటనలు చేశారని కానీ సొంత ప్రజలను పరామర్శించడానికి ఒక్కసారి కూడా రాలేదని ఖర్గే అన్నారు. మీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మణిపూర్‌లోని అమాయక ప్రజల జీవితాలను బుల్డోజ్ చేసిందంటూ తీవ్రంగా వ్యాఖ్యానించారు. అలాగే ప్రధాని, హోం మంత్రి అమిత్ షా అసమర్థత, కుమ్మక్కు కారణంగానే రాష్ట్రానికి ఈ పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్రపతి పాలన విధించడం ద్వారా ఈ సమస్యను కప్పిపుచ్చుకోవాలని చూశారని ఆరోపించారు. ఈ విషయంలో మీ రాజధర్మం ఎక్కడ కనిపిస్తుందో చెప్పాలంటూ ఖర్గే ప్రశ్నలు సంధించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా ప్రధాని ఇంతకుముందే రాష్ట్రానికి వచ్చి ఉండాల్సిందని అన్నారు. రెండు సంవత్సరాల తర్వాతనైనా ఆయన మణిపూర్‌ను సందర్శించడానికి నిర్ణయించుకోవడం సంతోషం. ప్రధాని మోదీ తన పర్యటనలో నిరాశ్రయులైన ప్రజలతో మాట్లాడారు. అలాగే రూ.8,500 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. మణిపూర్‌లో మైతేయ్, కుకి వర్గాల మధ్య భూ హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై మే 2023 నుంచి ఘర్షణలు జరుగుతున్నాయి.

# ఏకైక ఆమ్ ఆద్మీ ఎమ్మెల్యేపై ప్రజాభద్రతా చట్టం

**శ్రీనగర్, సెప్టెంబరు 15:** ప్రజాప్రతినిధిపై ప్రజా భద్రతా చట్టం కింద చర్యలు తీసుకోవడం చాలా అరుదుగా జరుగుతుంటుంది. కానీ జమ్మూ కాశ్మీర్‌లోని ఏకైక ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యే మెహ్రాజ్ మాలిక్‌పై పోలీసులు ఈ పీఎస్‌ఏ చట్టాన్ని ప్రయోగించి అరెస్ట్ చేయడం ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. గత వారం పోలీసులు అదుపులోకి తీసుకున్న మెహ్రాజ్ మాలిక్‌పై ఇప్పటికే 18 కేసులు నమోదై ఉన్నాయని, పోలీస్ డైరీలో ఆయనపై రోజువారీ నివేదికలు ఉన్నాయని దోడా జిల్లా మెజిస్ట్రేట్ జారీ చేసిన పీఎస్‌ఏ డోసియర్‌లో పేర్కొన్నారు. 33 పేజీల ఈ డొసియర్‌లో మాలిక్‌ను హిస్టరీ షీటర్‌గా పేర్కొంటూ ఆయన సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని, ప్రభుత్వ కార్యాలయాలను తగలబెట్టమని ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అధికారులు, రాజకీయ ప్రత్యర్థులపై ఆయన తరచుగా అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని డోసియర్‌లో పేర్కొన్నారు. ముఖ్యంగా ఎన్నికల డ్యూటీ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడం, అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించడం, వైద్యుల పట్ల అనుచిత భాష ఉపయోగించడం వంటి ఆరోపణలు కూడా ఆయనపై ఉన్నాయి. 1978లో ఈ చ ట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఒక సిట్టింగ్ ఎమ్మెల్యేపై పీఎస్‌ఏ కింద కేసు నమోదు కావడం ఇదే మొదటి సారి. ఈ చట్టం ప్రకారం ఒక వ్యక్తిని విచారణ లేకుండానే రెండు సంవత్సరాల వరకు నిర్బంధించవచ్చు. ఇటీవల దోడా జిల్లా మెజిస్ట్రేట్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన కొద్ది రోజులకే పోలీసులు మెహ్రాజ్ మాలిక్‌పై ఈ చట్టాన్ని ప్రయోగించారు. మాలిక్ అరెస్టుకు వ్యతిరేకంగా దోడాలో భారీ నిరసనలు చెలరేగాయి. పరిస్థితిని అదుపు చేయడానికి అధికారులు కర్ఫ్యూ విధించి ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. ఈ ఘర్షణల్లో పోలీసులు, నిరసనకారులు గాయపడ్డారు. ఈ అరెస్టుపై రాజకీయ వర్గాల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. బీజేపీ ఈ అరెస్టును సమర్థిస్తుండగా మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వంటి ఇతరపార్టీల నాయకులు మాత్రం దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యగా అభివర్ణిస్తున్నారు.

# మా కన్నీళ్లు ఆరకముందే పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్‌లా..

## పహల్గావ్ బాధితుల ఉద్వేగం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 15:** తమ కన్నీళ్లు ఇంకా ఆరిపోలేదని పహల్గామ్ బాధిత కుటుంబాలు వాపోయాయి. భారత్‌పాకిస్థాన్ మధ్య క్రికెట్ మ్యాచ్‌ను బహిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్ పహల్గామ్‌లోని బైసరన్ మైదానంలో పాక్ ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో పర్యాటకులతో సహా 26 మంది మరణించారు. ఈ సంఘటన నేపథ్యంలో పాకిస్థాన్‌తో భారత్ అన్ని విధాలా తెగదెంపులు చేసుకున్నది. మేలో ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ సైనిక చర్య చేపట్టింది. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. కాగా, పహల్గామ్ ఉగ్రదాడి జరిగిన తర్వాత సుమారు ఐదు నెలలకు ఆదివారం నుంచి దుబాయ్‌లో భారత్, పాకిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య ఆసియా కప్ టోర్నీ జరుగనున్నది. అయితే ఈ నిర్ణయం తీసుకున్న బీసీసీఐతో పాటు కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి. పహల్గామ్ బాధిత కుటుంబాలు కూడా దీనిపై స్పందించాయి. పాక్‌తో మ్యాచ్‌ను భారత్ ఆటగాళ్లు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. 'మా కన్నీళ్లు ఇంకా ఆరిపోలేదు. పాకిస్థాన్‌తో మ్యాచ్ ఏమిటి?' అని భర్త, కుమారుడ్ని కోల్పోయిన కిరణ్‌బెన్ ప్రశ్నించారు. మరోవైపు ఆమె చిన్న కుమారుడు సావన్ పర్మార్ కూడా తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పహల్గామ్ దాడిలో చాలా మంది ప్రాణాలు కోల్పోయారని, ఆపరేషన్ సిందూర్‌లో మన సైనికులుకూడా అమరులయ్యారని గుర్తు చేశారు. భారత్, పాక్ మధ్య మ్యాచ్ జరుగుతోందని తెలిసి తాము చాలా కలత చెందినట్లు చెప్పారు. 'పాకిస్థాన్‌తోఅన్ని సంబంధాలు తెంచుకున్నామని ప్రధాని మోదీ అన్నారు. మరి మనం ఇంకా ఈ ఆట ఎందుకు ఆడుతున్నాం? మేం ఇంకా దుఃఖిస్తున్నాం. ఈ ఆట ఆడాల్సిన అవసరం ఏమిటి?' అని ఆయన ప్రశ్నించారు.

# బీహార్‌లో 243 స్థానాల్లోను పోటీచేస్తాం

## మహాకూటమి కీలకనేత తేజస్వియాదవ్ సంచలనం



**ముజఫరాపూర్(బీహార్), సెప్టెంబరు 15:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) నేత తేజస్వి యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేసి రాజకీయ వేడిని రాజేశారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాల్లోనూ తమ పార్టీయే పోటీ చేస్తుందని ప్రకటించి మహాఘట్‌బంధన్ కూటమిలో ప్రకంపనలు సృష్టించారు. సీట్ల పంపకాలపై మిత్రపక్షాలతో చర్చలు జరగాల్సి ఉండగా, తేజస్వి చేసిన ఈ ఏకపక్ష ప్రకటన కూటమి భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునేలా చేసింది. ముజఫర్‌పూర్‌లోని కాంతిలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న తేజస్వి, ఈసారి ప్రజలు తన ముఖం చూసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్డీఏ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ ఆయన, కేవలం నినాదాలతోనే ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. బీహార్ నుంచి ఓట్లు, గుజరాత్‌లో ఫ్యాక్టరీలు ఈ ఎత్తుగడలు ఇకపై చెల్లవని వ్యాఖ్యానించారు. తమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం పెన్షన్, ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తోందని, తాము ముందుంటే ప్రభుత్వం తమను అనుసరిస్తోందని అన్నారు. ఆర్‌జేడీ అధికారంలోకి వస్తే ఉపాధి, అభివృద్ధికి పెద్దపీట వేస్తామని తేజస్వి హామీ ఇచ్చారు. తమ పార్టీ ప్రకటించిన మై బెహన్ యోజన ను కాపీ కొట్టి ప్రభుత్వం మహిళలకు రూ.10,000 ఇస్తోందని, కానీ తాము గెలిస్తే ఐదేళ్లలో ప్రతి మహిళకు లక్షన్నర రూపాయలు అందిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేసిన తేజస్వి, రూ.80 వేల కోట్లకు లెక్కలు చెప్పడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో వంతెనలు కూలిపోతున్నాయని, ఆసుపత్రుల్లో రోగులకు భద్రత కరువైందని, అయినా ప్రభుత్వం అవినీతిపరులను వదిలేసి ఎలుకలకు రక్షణ కల్పిస్తోందని ఎద్దేవా చేశారు. 2020 ఎన్నికల్లో ఆర్‌జేడీ 144 స్థానాల్లో పోటీ చేసి 75 గెలవగా, కాంగ్రెస్ 70 స్థానాల్లో పోటీకి దిగి కేవలం 19 సీట్లకే పరిమితమైంది. ఈసారి జేఎంఎం, ఎల్జేపీ వంటి పార్టీలు కూడా కూటమిలో చేరాయి. ఈ నేపథ్యంలో సీట్ల సర్దుబాటు కీలకంగా మారిన సమయంలో, అన్ని స్థానాల్లోనూ పోటీ చేస్తామన్న తేజస్వి ప్రకటన మిత్రపక్షాలను తీవ్ర అసంతృప్తికి గురిచేసింది.

### భద్రతా వలయం ఛేదించుకుని తేజస్వి కాళ్లపై పడ్డయువకుడు!

బీహార్‌లో ప్రతిపక్ష నాయకుడు, ఆర్జేడీ అగ్రనేత తేజస్వి యాదవ్‌పర్యటనలో భద్రతాలోపం తలెత్తింది. ముజఫర్‌పూర్ జిల్లా పర్యటనలో భాగంగా ఒక కార్యక్రమంలో పాల్గొన్న తేజస్వి యాదవ్ హెలికాప్టర్‌లో తిరిగి వెళ్లేందుకు సిద్ధపడుతుండగా ఓ యువకుడు సెక్యూరిటీ వలయాన్ని ఛేదించుకుని పరుగుపరుగున ఆయన దగ్గరికి వచ్చి పాదాలపై పడ్డాడు. దీనికిముందు ముజఫర్‌పూర్‌లోని కాంతి స్కూల్‌లో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని తేజస్వి యాదవ్ ఆవిష్కరించారు. అనంతరం పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొని బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. సరిగ్గా అప్పుడే నల్లటి చొక్కా ధరించిన ఒక యువకుడు సెక్యూరిటీ వలయాన్ని ఛేదించుకుని తేజస్వి చెంతకువచ్చి ఆయన పాదాలపై పడ్డాడు. దాంతో ఒక్కసారిగా తేజస్వి దిగ్భ్రాంతికి గురయ్యారు. భద్రతా సిబ్బంది ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. యువకుడి పేరు షరీఫుల్ ఇస్లామ్‌గా గుర్తించారు. ఈ ఘట నకు సంబంధించిన వీడియో సోషల్ మీడి యాలో వైరల్ అవుతోంది. తేజస్వియాదవ్‌పై ఉన్న అభిమానానికి నిదర్శనమని కొందరు.. భద్రతా లోపమని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు.

## సంక్షిప్తంగా..

### అసోంలో భూకంపం.. రిక్టర్ స్కేల్‌పై 5.8గా నమోదు



**గౌహతి, సెప్టెంబరు 15:** అసోంలో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 5.8 తీవ్రతగా నమోదైంది. ఉదల్‌గిరి జిల్లాలోని ధేకియజులి ప్రాంతానికి 16 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 5కిలోమీటర్ల లోతులో ఇది సంభవించిందన్నారు. భూకంప తీవ్రతకు పలు ఇళ్లు స్వల్పంగా ఊగినట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు ప్రాణ, ఆస్తినష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. ఈశాన్య రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మయన్మార్, చైనాలోనూ భూ ప్రకంపనలు వచ్చినట్లు తెలిసింది. అసోంలోని ఇదే ప్రాంతంలో వారం క్రితం 3.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. ప్రధాని మోడీ ప్రస్తుతం అసోం పర్యటనలోనే ఉన్న విషయం తెలిసిందే.

### చైనా నౌకలను అడ్డుకొన్న తైవాన్



**తైపెయి సిటీ, సెప్టెంబరు 15:** తైవాన్ కోస్టుగార్డ్ అడ్మినిస్ట్రేషన్ (సిజిఎ) శనివారం చైనాకు చెందిన నౌకలను అడ్డుకొంది. వీటిల్లో బీజింగ్‌కు చెందిన కోస్టుగార్డ్ నౌక ఒకటి కాగా మరొకటి భారీ చేపల పడవగా చెబుతున్నారు. రెండు నౌకలు డాంగ్‌షా ద్వీపం వద్ద కార్యకలాపాలు సాగిస్తుండగా ఈ ఘటన చోటుచేసు కొంది. దీంతో తైవాన్-చైనా మధ్య దక్షిణ చైనా సముద్ర జలాల్లో ఉద్రిక్తతలు పెరిగిపోయాయి. ఫోకస్ తైవాన్ పత్రిక కథనం ప్రకారం గురువారం ఉదయం 6.15 గంటల సమయంలో రెండు చైనా నౌకల ను డాంగ్‌షా-నాంషా వద్ద గుర్తించారు. ఇవి ఇంకా నిషేధిత ప్రదేశానికి కొంచెం దూరంలో ఉండటంతో 2,000 టన్నుల కట్టర్ తైనాన్ అనే షిప్‌ను రంగంలోకి దించారు. అది శుక్రవారం చైనా కోస్టుగార్డ్ నౌకను వెన్నంటే ఉండటంతో అది అక్కడి నుంచి వెళ్లిపోయింది. అయితే ఆ రోజు రాత్రి చైనా చేపలవేట నౌక నిషేధిత ప్రాంతానికి చేరుకొంది. దీంతో రెండు తైవాన్ నౌకలు అక్కడికి చేరుకొని దానిని అడ్డగించాయి. దీంతో అది వెనక్కి వెళ్లిపోయింది.

### మాడ్రిడ్‌లో చర్చల వేళ అమెరికాపై చైనా దర్యాప్తులు షురూ



**బీజింగ్, సెప్టెంబరు 15:** అమెరికా రెండు అంశాల్లో తప్పుడు విధానాలు అవలంబిస్తోందని ఆరోపిస్తూ చైనా ఒకేసారి రెండు దర్యాప్తులు మొదలు పెట్టింది. స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో రెండు దేశాల మధ్య చర్చలు మొదలుకానున్న వేళఇది జరగడం గమనార్హం. మాడ్రిడ్ సమావేశంలో జాతీయ భద్రత, టిక్ టాక్ సోషల్ మీడియా యాజ మాన్య హక్కుల వంటివి చర్చకు రానున్నాయి. అమెరికా సెమీకండక్టర్లను లక్ష్యంగా చేసుకొని చైనా ఈ దర్యాప్తులు చేపట్టింది. కొన్ని ఐసి చిప్స్‌లో అమెరికాపై యాంటీ డంపింగ్ ఇన్వెస్టిగేషన్‌ను మొదలు పెట్టింది. వీటిని అమెరికాలోని టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఆన్ చిప్స్ సంస్థలు తయారుచేస్తుంటాయి. చైనాలో తయారైన సెమీకండెక్టర్లపై అమెరికా వివక్ష చూపుతోందంటూ మరో దర్యాప్తు చేపట్టింది. ఆదివారం మాడ్రిడ్‌లో చైనా వైస్‌ప్రీమియర్ లిఫెంగ్, అమెరికా ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ భేటీ అయ్యారు. శుక్రవారం అమెరికా ప్రభుత్వం 23 సంస్థలను ఆంక్షల పరిధిలోని జాబితాలో చేర్చడంతో చైనా ప్రతీకారంగా ఈ నిర్ణయం తీసుకుంది. వీటిల్లో చైనా చిప్స్ తయారీ సంస్థ ఎస్ఎంఐసి కూడా ఉంది.

### టేకాఫ్ కాకుండానే రన్‌వేపై నిలిచిపోయిన ఇండిగో



**లక్నో, సెప్టెంబరు 15:** ఉత్తరప్రదేశ్‌లోని లక్నో విమానాశ్రయంలో ఆదివారం ఊహించని ఘటన చోటు చేసుకుంది. లక్నో నుంచి ఢిల్లీ వెళ్తున్న ఇండిగో విమానంలో టేకాఫ్ సమయంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో విమానం పైకి ఎగురలేక రన్‌వేపైనే ఆగిపోయింది. దీంతో పైలట్ చాకచక్యంగా వ్యవహరించి టేకాఫ్‌ను నిలిపివేశారు. ఆసమయంలో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్ సహా 151మంది ప్రయాణికులు విమానంలో ఉన్నట్టు అధికారులు తెలిపారు. టేకాఫ్ నిలిపివేసిన అనంతరం ప్రయాణికులను కిందకు దించి వేరే విమానంలో ఢిల్లీకి పంపారు.

### గగనతలాన్ని కాపాడిన మిగ్ 21లకు రిటైర్మెంట్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 15:** భారత వాయుసేనకు దాదాపు అర్ధశతాబ్దానికి పైగా సేవలు అందించి గగనతలాన్ని కాపాడిన మిగ్-21లకు ఇప్పుడు రిటైర్మెంట్ ప్రకటించారు. అయితే వీటిని కొనుగోలు చేసేందుకు చాలా సంస్థలు క్యూ కట్టాయి. కనీసం ఒక్క దానినైనా సొంతం చేసుకోవాలని పోటీ పడుతున్నాయి. వాయుసేన మిగ్-21 ఫైటర్‌జెట్ రిటైర్మెంట్ తర్వాత విద్యాసంస్థలు వార్ మెమోరి యల్స్ మిలిటరీ మ్యూజియాలు వీటి ఎయిర్ ఫ్రేమ్‌ను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం వద్ద క్యూకట్టాయి. సెప్టెంబర్ 26న రెండు స్క్వాడ్రన్ల ఈ యుద్ధ విమానాలకు తుది వీడ్కోలు పలకనున్నారు.

## ఎమ్మెల్యే గళ్ళా మాధవికి కృతజ్ఞతలు తెలిపిన దామచర్ల శ్రీనివాసరావు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) సభ్యుడిగా నియమితులయిన ఆడిటర్, టీడీపీ సీనియర్ నాయకులు దామచర్ల శ్రీనివాసరావు మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తన ఎంపికకు కృషి చేసినందుకు గళ్ళా మాధవి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గళ్ళా మాధవి మాట్లాడుతూ.... "ప్రజా ప్రయోజనాలకు, రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత, నాణ్యత, వినియోగదారుల హక్కుల పరిరక్షణలో రెరా కీలక పాత్ర పోషిస్తుందని, తన అనుభవం, ఆర్థిక నైపుణ్యం ఈ రంగానికి మరింత బలం చేకూరుస్తుందని, దామంచర్ల శ్రీనివాసరావు సేవలు మరింత ఉపయోగపడతాయన్నారు.

## ఘనంగా జాతీయ ఇంజనీర్ల దినోత్సవం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి లిటిల్ విలేజ్ లో తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి( టిఎంసీ) లైసెన్సుడ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ ఇంజనీర్ల దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా నగరపాలక సంస్థ కమిషనర్ అలిమ్ భాషా హాజరయ్యారు. తొలుత ఇంజనీర్ల పితామహులు స్వర్గీయ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కమిషనర్ అలిమ్ భాషా, అసోసియేషన్ నాయకులు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు అసోసియేషన్ కన్వీనర్ నిరంజన్ గుప్తా అధ్యక్షత వహించారు. సభను ఉద్దేశించి కమిషనర్ అలిమ్ భాషా మాట్లాడారు. మౌలిక సదుపాయాలు కల్పన జరిగిన చోట మనుషుల జీవన ప్రమాణాలు పెరుగుతాయని, అది ఇంజనీర్ల వలనే జరుగుతుందని, అందుకనే నేడు మోక్షగుండం విశ్వేశ్వరయ్యని తలచుకుంటున్నామన్నారు. నగరపాలక సంస్థ రాబోయే 10 సంవత్సరాల్లో రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ కృషితో మోడల్ కార్పొరేషన్ గా తయారవుతుందన్నారు. ఎన్నో ఆధునికమైన నిర్మాణాలు జరుగుతాయని, ఇంజనీర్లు వాటికి సన్నద్ధమవుతున్నామా లేదా అని పరిశీలించుకోవాలన్నారు. నగర్ పాలక సంస్థ విస్తరణలో ఇంజనీర్ల సహకారం కూడా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏంటీఏంసీ డిప్యూటీ సిటీ ప్లానర్ కే అశోక్ కుమార్, ఏసీపీ లు అజయ్ కుమార్, రవికుమార్, టీపీఓ రమేష్ బాబు, టీపీఎస్ సుస్మిత, సర్వేయర్ రఘుపతి, అసోసియేషన్ ప్రతినిధులు అశోక్ కుమార్, సీహెచ్వీ నారాయణ, పెండెం శ్రీహర్ష, సుమతి, హనుమాన్, వలి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖగోళ శాస్త్రంపై ప్రత్యేక అవగాహనా సదస్సు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించే ఔట్ రీచ్ ప్రోగ్రాం లో భాగంగా సోమవారం ఖగోళ శాస్త్రంపై ప్రత్యేక ఆవగాహనా సదస్సు జరిగింది. యూనివర్సిటీలోని ఫిజిక్స్ డిపార్ట్మెంట్ ఈ సదస్సును ఏర్పాటు చేసింది.' పై స్పార్క్ 3.0– స్టార్స్, స్కోస్ అండ్ స్పెస్ టైమ్ ' పేరిట జరిగిన ఈ సదస్సుకు పూనే లోని ఇంటర్ యూనివర్సిటీ ఆస్ట్రానమీ అండ్ అస్ట్రా ఫిజిక్స్ సెంటర్ సైంటిస్ట్ డాక్టర్ శివరాజ్ కందస్వామి ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల విద్యార్థులకు ఖగోళ శాస్త్రంపై అవగాహన కలిగించారు. విశ్వంలోని గ్రహాలు, నక్షత్రాల ఉనికి, లక్షణాల గురించి వివరించారు. విద్యార్థులకు ఖగోళ శాస్త్రం మరియు ఖగోళ భౌతిక శాస్త్రంలోని కీలక రంగాల గురించి పరిచయం చేశారు. లేజర్ ఇంటర్ఫెరోమీటర్ గ్రావిటేషనల్ అబ్జర్వేటరీ రూపకల్పన గురించి కూడా వివరించారు. గురుత్వాకర్షణ తరంగాలను లిగో ద్వారా గుర్తించే విధానాన్ని విశదీకరించారు. అనంతరం భౌతిక శాస్త్ర ప్రొఫెసర్లు డాక్టర్ గంగిరెడ్డి.. డాక్టర్ అస్మితాదాస్, డాక్టర్ కృష్ణప్రసాద్ మైటీలు టెలి స్కోప్, బైనరీ స్టార్ సిస్టమ్ గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ప్రణబ్ మండల్, డాక్టర్ జ్యోతి బిస్వాస్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. గీతాంజలి స్కూల్ (కుంచనపల్లి), విజే త స్కూల్ (గుంటూరు) కేసి స్కూల్ (నల్లపాడు)ల నుంచి 120 మంది విద్యార్థులు సదస్సుకు హాజరయ్యారు.

# అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం : ఎమ్మెల్యే నసీర్

- నీట మునిగిన ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే నసీర్
- పీకల వాగు నీటి ప్రవాహం పరిశీలన
- వంతెనలపై ఆక్రమణలు గుర్తించి వెంటనే మున్సిపల్ సిబ్బందితో ఫోన్లో మాట్లాడిన ఎమ్మెల్యే
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** భారీ వర్షాలకు ఇళ్లలోకి నీళ్లు చేరి బిక్కుబిక్కుమంటున్న బాధితులకు ఎమ్మెల్యే నసీర్ ధైర్యంగా నిలిచారు సోమవారం నగరంలోని ముఫ్తి బజార్, ఆనందపేట, సుద్దపల్లి డొంక ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఉదయాన్నే పర్యటించారు. ఇప్పటికీ నీరు బయటకు పోకుండా ఇబ్బందులు పడుతున్న వారిని పరామర్శించి అండగా నిలుస్తామని భరోసాచ్చారు. కొందరి ఇళ్లలో నిత్యావసర సరుకులు దెబ్బ తినడాన్ని గుర్తించిన ఎమ్మెల్యే.. సొంత నిధులు అందించి సరుకులు తెచ్చుకోవాలని సూచించారు. పీకల వాగులో వర్షపు నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే.. సిల్ట్ అడ్డుగా నిలుస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా నగర కమిషనర్, మేయర్ తో ఫోన్లో మాట్లాడి సమస్యను వివరించారు. అనంతరం సుద్ధపల్లి డొంక 14వ డివిజన్ లో వంతెనలపై అక్రమణలను సిటీ ప్లానర్ కు వీడియో కాల్ ద్వారా చూపించి సమస్యను వివరించారు. వెంటనే పీకల వాగుపై అక్రమణలు తొలగించి నీటి సరఫరా సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తమ ప్రాంతంలో శానిటేషన్ పనులు సక్రమంగా జరగడం లేదని స్థానికులు ఎమ్మెల్యే నసీర్ కు ఫిర్యాదు చేశారు. రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణంలో ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. వర్షాలు కురిసి సమస్యలు ఎదురైనప్పుడు హడావుడి చేస్తే ఉపయోగం ఉండదని, సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని చెప్పారు. వర్షపు ముంపు ప్రభావం నుంచి ప్రజలు బయటపడే వరకు నిత్యం అందుబాటులో ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్స్ శంకరి శ్రీను, మోహమ్మద్ హాఫీజ్, చల్ల ఆంజనేయ ప్రసాద్, వాకా వీరారెడ్డి, డివిజన్ అధ్యక్షులు అబ్దుల్ సలీం, తాడిబోయిన చిన్న బుజ్జి, వహీద్, కొణిదె దుర్గాప్రసాద్, పసుపులేటి నరేష్, పఠాన్ మహమ్మద్ ఖాన్, అన్వర్, మోహమ్మద్ రఫీ, అబ్బులు, వేముల శ్రీనివాస్, చిలకా వెంకటస్వామి, గాలి సతీష్ బాబు, ఉస్మాన్, సగ్రే శ్రీనివాసరావు,బాజీ, కలాం, మంత్రి నాగరాజు, సుభాని, జానీ, బత్తుల లక్ష్మణ్, మస్తాన్, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఎం వర్సిటీలో ఘనంగా ఇంజినీర్స్ డే వేడుకలు




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సోమవారం ఇంజినీర్స్ డే వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో బీటెక్, ఎంటెక్, పీహెచ్ డీ ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు ప్రొఫెసర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం ఉదయం అబ్దుల్ కలామ్ ఆడిటోరియంలో స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ సైన్స్ ఆధ్వర్యంలో వేడుకల ప్రారంభ సభను నిర్వహించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సిహెచ్ సతీష్ కుమార్, ముఖ్య అతిథిగా హాజరైన బెంగుళూర్ సారథి జియోటెక్ అండ్ ఇంజ నీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్ ఫౌండర్ డాక్టర్ సీ ఆర్ పార్థసారథి జ్యోతి ప్రజ్వలన చేసి ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో సుప్రసిద్ధ ఇంజినీర్ గా పేరు గడించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఏటా ఇంజినీర్స్ డే ను జరుపుకుంటున్నామని, ఆయన ఆశయాలకు ప్రాణం పోస్తూ టెక్నాలజీని అభివృద్ధి పరచడం మన ముందున్న లక్ష్మనున్నారు. రోజురోజుకీ ఇంజినీరింగ్ టెక్నాలజీలో నూతన ఆవిష్కరణలు వెలుగులోకి వస్తోన్న నేపథ్యంలో సివిల్ ఇంజినీర్లు దాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. బహుళ అంతస్తులు, భారీ వంతెనలు వంటి కోట్లాది విలువ గల ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో పునాదుల విషయంలో ఇజనీర్లు ఆత్యంత శ్రద్ధ, జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. నేల స్వభావాన్ని దృష్టిలో పెట్టుకుని వువాదుల సామర్థ్యం పెంచుకోవాలని సూచించారు. థర్మల్ ఇంటిగ్రేటెడ్ ప్రొఫైల్ ద్వారా ఫౌండేషన్ సామర్థ్యన్ని గుర్తించే వీలుందని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎస్ఆర్ఎం వైస్ ఛాన్సలర్ డాక్టర్ సిహెచ్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, ఇంజినీరింగ్ రంగంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, ప్రస్తుతం సాఫ్ట్వేర్ రంగం అత్యంత ఆదరణ పొందిందని, త్వరలో క్వాంటమ్ ఇంజినీరింగ్ సెక్టార్ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు ఆధునాతన టెక్నాలజీతో కూడిన విద్యా విధానాన్ని ఆవగాహన చేసుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఇండియన్ నేషనల్ ఆకాడమీ ఆఫ్ ఇంజనీర్స్ ప్రెసిడెంట్ జేడీ పాటిల్ దృశ్య మాధ్యమ విధానంలో అందరికీ ఇంజినీ ర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఆనంతరం కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ రమేష్ వడ్డి, కో కన్వీ నర్ డాక్టర్ రవితేజలు ముఖ్య అతిథి డాక్టర్ సీఆర్ పార్థసారథిని సత్కరించి జ్ఞాపికను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ బుక్ లెట్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగస్రవంతి, డాక్టర్ కే ఏ సునీత తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు: 3.52 లక్షల రుసుము



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా తెనాలి డీ2 సెక్షన్ లో జగడగుంట, మల్లెపాడు, పెదరావూరు, సుల్తానాబాద్, కే జోన్, ఎంజోన్, ఓ జోన్ లలో విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం మరియు ఆపరేషన్ విభాగం విస్తృత తనిఖీలు నిర్వహించాయి. ఈ తనిఖీలలో 58 మంది అధికారులు, 126 మంది సిబ్బంది 58 బృందాలుగా ఏర్పడి 5185 విద్యుత్ సర్వీసులు పరిశీలించారు. తనిఖీల ఫలితంగా, మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ వాడిన ఒకరికి 0.20 లక్షలు, అనుమతించిన కేటగిరీ కాక ఇతర కేటగిరీలో విద్యుత్ వాడిన ముగ్గురికి 0.17 లక్షలు, అనుమతించిన లోడ్ కంటే ఎక్కువ విద్యుత్ వాడిన 42 మందికి 3.14 లక్షలు రుసుము విధించబడింది. మొత్తం 3.52 లక్షలు రికవర్ అయ్యాయి.

వినియోగదారులు తమ విద్యుత్ మీటర్ల సీల్స్ తప్పనిసరిగా చూసుకోవాలి. సీల్స్ పాడిపోవడం, తుప్పు పట్టి ఊడిపోవడం వంటి పరిస్థితుల్లో వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి రాత పూర్వకంగా తెలియచేయాలి. సాగర తీర ప్రాంతాల్లో మీటర్ల సీల్స్ ఎక్కువగా పాడిపోవడం సాధారణం, కాబట్టి వాటిని అప్పుడప్పుడు పరిశీలించడం అవసరం. సీల్స్ లేకపోవడం, ఉద్దేశపూర్వకంగా తొలగించడం, గాట్లు పెట్టడం వంటి చర్యలను విద్యుత్ చౌర్యం అని పరిగణించి కేసులు నమోదు చేస్తారు.

విద్యుత్ చట్టం ప్రకారం పనిచేయని మీటరు ద్వారా విద్యుత్ వాడినా, లేదా ఉన్నతమైన మీటరు పెట్టి సీల్స్ లేకపోవడం వల్ల విద్యుత్ చౌర్యం కింద చర్యలు తీసుకుంటారు. మొదటి సారి తప్పిదానికి కాపౌండింగ్ పద్ధతిలో రుసుము చెల్లించవచ్చు?, రెండవ సారి అరెస్ట్ చేసి కఠినంగా వ్యవహరిస్తారు. రుసుము చెల్లించలేని సందర్భాల్లో ఆస్తులు జప్తు చేయబడతాయి. ఫిర్యాదులను పూర్తి వివరాలతో 9440812263, 9440812361 నంబర్లకు నేరుగా లేదా వాట్సప్ ద్వారా తెలియజేయవచ్చు. తనిఖీలలో పాల్గొన్న అధికారులు: డీఈఈ అశోక్ కుమార్, . మల్లిఖార్జున ప్రసాద్,. శ్రీనివాసరావు, ఏఈ. వెంకట్రావు, ఏఈఈ. కోటేశ్వరరావు, సతీష్ కుమార్, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

# సురవరం సుధాకరరెడ్డి స్ఫూర్తిని కొనసాగించాలి : లావు శ్రీకృష్ణదేవరాయలు




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** భారత కమ్యూనిస్ట్ పార్టీ జాతీయ కార్యదర్శిగా, పార్లమెంట్ సభ్యునిగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ అమరులైన కీ.శే. సురవరం సుధాకర రెడ్డి స్ఫూర్తితో పని చేస్తే ప్రజాస్వామ్యం వికసిస్తుందని తెలుగుదేశం పార్టీ లోక్ సభాపక్షనేత, లోక్ సభ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 14 వ తేదీ ఆదివారం రాత్రి గుంటూరులోని వేములపల్లి శ్రీకృష్ణ హాలులో జరిగిన సురవరం సుధాకర రెడ్డి సంస్మరణ సభకు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రసంగిస్తూ 65 సంవత్సరాల రాజకీయ జీవితంలో నిరంతరం ప్రజా సమస్యలపై అధ్యయనం చేస్తూ వాటి పరిష్కారం కోసం కృషి చేసేవారన్నారు. ఉపాధి హామీ పథకం, విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, 2013 భూ సేకరణ చట్టం లాంటి ప్రజలకు మేలు కలిగించే చట్టాల రూపకల్పనలో క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. కమ్యూనిస్ట్ లు ప్రజల పక్షాన నిరంతరం పోరాడే స్వభావాన్ని చిన్నతనం నుండి గమనించానని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ మాట్లాడుతూ సురవరం సుధాకరరెడ్డి నిరంతర అధ్యయన శీలి అని పదవుల్లో ఉన్న లేకపోయినా ఒకే విధంగా నిరాడంబర జీవితాన్ని గడిపారన్నారు. 18 ఏళ్ళకి ఓటు హక్కు కావాలనే ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. అవనిగడ్డ శాసనసభ్యులు, తెలుగు భాషోద్యమ నేత మండలి బుద్ధ ప్రసాద్ ప్రసంగిస్తూ భారతదేశ రాజకీయాలను ఉన్నత స్థితికి తీసుకువెళ్లే ప్రయత్నం చేసిన మహనీయులు సురవరం సుధాకర రెడ్డి అని కొనియాడారు. తెలుగు వైతాళికునిగా ప్రసిద్ధిగాంచిన సురవరం ప్రతాపరెడ్డి చారిత్రక వారసునిగా సురవరం సుధాకర రెడ్డి తెలుగుజాతి గౌరవాన్ని ఇనుమడింప చేశారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బహు భాషా కోవిధుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి అయినటువంటి సురవరం సాహిత్యం నుండి సైన్స్ వరకు నిరంతరం అధ్యయనం చేసేవారని తెలిపారు. జీవితాంతం కమ్యూనిస్ట్ ఉద్యమానికి అంకిత భావంతో కృషిచేసి కోట్లాది ప్రజల అభిమానాన్ని చూరగొన్నారన్నారు. లౌకిక, ప్రజాతంత్ర శక్తులను ఐక్యం చేయడం ద్వారా మతోన్మాద రాజకీయాల నుండి దేశాన్ని కాపాడుకోవాలని నిరంతర కృషి జరిపేవారన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ సురవరం సుధాకర రెడ్డి 15వ ఏటనే విద్యార్థి ఉద్యమాలలో భాగస్వామ్యులయ్యారని, ఐఏఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శిగా ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శిగా పనిచేస్తూ అంచలంచెలుగా ఎదిగి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, నల్గొండ లోక్ సభ సభ్యునిగా కృషి చేశారన్నారు. 1962 లో తిరుపతిలో ఎస్ వి యూనివర్సిటీ స్థాపన కొరకు 2 నెలల పాటు ఆందోళన చేపట్టడం, 2000 వ సంవత్సరంలో జరిగిన విద్యుత్ ఉద్యమానికి నాయకత్వం వహించి జైలుకెళ్లడం, లోక్ సభ స్టాండింగ్ కమిటీ చైర్మన్ గా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం వారి సేవానీరతికి నిదర్శనం అన్నారు. రాజకీయ అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతూ ఎన్నికల వ్యయాన్ని తగ్గిస్తేనే నిజాయితీ పరులు రాజకీయాల్లో రాణించగలరని, వామపక్షాలు దేశ రాజకీయాల్లో ప్రత్యామ్నాయ శక్తులుగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని, ఈ దిశగా అడుగులు వెయ్యడమే సురవరం సుధాకర రెడ్డికి మనం ఇచ్చే అసలైన నివాళి అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ప్రకటించిన విధంగా ఆంధ్రప్రదేశ్ లో కూడా సురవరం సుధాకర్ రెడ్డి జ్ఞాపకార్థం ప్రజలకు ఉపయోగపడే మంచి పనిని చేయటానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొరివి వినయ్ కుమార్ ప్రసంగిస్తూ దేశంలో కాంగ్రెస్ బలహీన పడితే బిజెపి లాంటి పార్టీలు ముందుగానే బలపడుతాయని సురవరం సుధాకర రెడ్డి హెచ్చరిస్తూ వామపక్ష పార్టీల ఐక్యతకు కృషి చేశారన్నారు. దళిత, గిరిజన ,వెనకబడిన వర్గాల అభ్యున్నతి కోసం, కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం దూర దృష్టితో పనిచేసిన మహానేత సురవరం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి మాల్యాద్రి, సిపిఎం జిల్లా కార్యదర్శి వై. నేతాజీ, సామాజిక విశ్లేషకులు టీ ధనుంజయ రెడ్డి ,కొండవీటి కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి, విశ్రాంత అడిషనల్ ఎస్పీ చలపతిరావు తదితరులు ప్రసంగించారు.

## నగరపాలకలో ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ చాంబర్లో డయల్ యువర్ కమిషనర్, అనంతరం కౌన్సిల్ హాల్లో పిజిఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించదగినవి, కొంత సమయం తర్వాత చేయవలసినవి వేర్వేరుగా జాబితా చేయాలని సూచించారు. త్రాగునీటి కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పైప్‌లైన్ లీకులు గమనించిన వెంటనే తగు చర్యలు చేపట్టాలని సూచించారు. డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన 20 ఫిర్యాదులపై సంబంధిత విభాగాధిపతులే క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని ఆయన ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కార పురోగతిపై ఎప్పటికప్పుడు కమిషనర్ చాంబర్‌కు నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. తరువాత అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు కౌన్సిల్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా తక్షణ పరిష్కారం కావాలని సూచించారు. ప్రతి విభాగంలో పిజిఆర్ఎస్, గ్రీవెన్స్ అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్ ద్వారా మొత్తం 28 ఫిర్యాదులు అందగా, అందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 15, ఇంజినీరింగ్ విభాగానికి 6, రెవెన్యూ విభాగానికి 3, ప్రజారోగ్య విభాగానికి 3, ఉపా సెల్ విభాగానికి 1 ఫిర్యాదు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు డి. శ్రీనివాసరావు, సిహెచ్. శ్రీనివాస్, బి. శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, మేనేజర్ బాలాజీ బాష తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత ఆరుద్ర అంకవరప్రసాద్ వర్ధంతి



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** టీడీపీ నాయకులు ఆరుద్ర అంకవర ప్రసాద్ కు ఆ పార్టీ నాయకులు ఘన నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఆరుద్ర యూత్ ఆధ్వర్యంలో మంగళగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఎంఎస్ఎస్ భవన్ లో సోమవారం స్వర్గీయ ఆరుద్ర అంక వరప్రసాద్ 11వ వర్ధంతి సందర్భంగా పార్టీ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర పద్మశాలియ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, మంగళగిరి మండల టిడిపి అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివ శేషగిరిరావు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, ఆంధ్రప్రదేశ్ మైనార్టీస్ కార్పొరేషన్ డైరెక్టర్ మహమ్మద్ ఇబ్రహీం, మంగళగిరి కోపరేటివ్ సొసైటీ బ్యాంక్ అధ్యక్షులు గాదె పిచ్చిరెడ్డి, పట్టణ టీడీపీ ఉపాధ్యక్షులు వాసా పద్మ, మంగళగిరి పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు హనుమాన్. గుత్తికొండ ధనుజయరావు, గోవాడ దుర్గారావు, తోట సాంబయ్య, జంజనం సుబ్బారావు, రుద్రు శ్రీనివాసరావు, తోట శ్రీనివాసరావు, బత్తుల నాగరాజు, మద్రి ఏసుబాబు, గోవాడ దుర్గారావు, గోవాడ రవి, మన్యం రమేష్, గాజుల శ్రీనివాసరావు, చింకా కోటేశ్వరరావు చింక కోటేశ్వరరావు, నల్లగొర్ల శివరామకృష్ణ, తోట కరుణ్ , దిడ్ల సత్యానందం,అప్పల శాంతి , తురక వీరశేఖర్ బాబు, చెరుకు పూర్ణ, కొల్లి వెంకటరావు తదితరులు ఆరుద్ర అంక వరప్రసాద్ కు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## అయోధ్యరాముని పాదుకలు ధనుర్బాణాలను దర్శించి తరించిన భక్తులు.



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** మహా మహిమాన్వితమైన దాసకుటి ఆశ్రమంలో మహాలక్ష్మి అమ్మవారికి, మహిళలు విశేష కుంకుమ పూజలు నిర్వహించే శుభ సమయంలో,అయోధ్య నుండి, కోదండ రాముని, ధనుర్బాణాలు, పాదుకలు రావడం ఆధ్యాత్మిక ఆనందమని,అన్నదానం చిదంబరశాస్త్రి ఆశ్రమ వైశిష్ట్యాన్ని వివరించారు. మండలంలోని అంగలకుదురు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ వాసుదాస స్వామి పరంపరపీఠం, దాసకుటి ఆశ్రమ ప్రాంగణంలో 74వ, మహాలక్ష్మీ కుంకుమార్చన పూజలు, పూర్ణాహుతి సేవతొ సోమవారం ముగిసాయి. ఆశ్రమ ప్రాంగణంలలో ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలొ అన్నదాన చిదంబరశాస్త్రిమాట్లాడుతు భక్తులకు ,దాసకుటి ఆశ్రమ మహిమను వివరించారు. అయోధ్య రాముడితో దాసకుటి ఆశ్రమానికి ఓ అనుబంధ ముందని అన్నారు. నాడు అయోధ్యలొ బాలరాముని విగ్రప్రతిష్టకు, సిద్దం చేసిన యంత్రం, దాసకుటిలో పూజలందుకుని అయోధ్య చేరిందని అన్నారు. మరో విశేషం అయోధ్యలొ అన్నదాన సేవ చేస్తున్న,రామభక్తుడుచల్లా శ్రీనివాస్, కల్యాణ రాముని ఆలయాన్ని, అయోధ్యలొ నిర్మిస్తున్నారని, ఆప్రాంగణంలో ఏర్పాటు చేసే,108 అడుగుల, కోదండ రాముడి విగ్రహం కోసం,తయారు చేసిన, ధనుర్బాణాలు, పాదుకలు, చల్లా శ్రీనివాస్ దాసకుటి ఆశ్రమంలొ, భక్తుల సందర్శనకు ఏర్పాటు చేయడం అనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో దాసకుటి ఆశ్రమ షష్ఠమ పీఠాధిపతి శ్రీ సీతారామస్వామి, మహిళా భక్తులు, వేద పండితులు, అర్చక స్వాములు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## అర్బన్ బ్యాంక్ పాలకమండలి ఏకగ్రీవం కూటమి పార్టీలకు గౌరవం

○ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** సహృద్భావ వాతావరణంలో పరస్పరం గౌరవించుకుంటూ బ్యాంక్ ప్రాచుర్యాన్ని మరింతగా పెంచే విధంగా నూతన పాలకమండలి కూటమి పార్టీల గౌరవాన్నిపెంచేలా పనిచేయాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అర్బన్ బ్యాంక్ నూతన పాలకమండలికి అభినందనలు తెలిపారు.

నెం22,ది తెనాలి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలు సోమవారం నిర్వహించిన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంతొ ఘనంగా ముగిసాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిధిగా పాల్గొన్న ఈకార్యక్రమం ఆద్యాంతం కోలాహల వాతావరణం నడుమ వైభవంగా కొనసాగింది. బ్యాంక్ పాలకమండలి చైర్మన్ పదవికి మంగమూరి హరిప్రసాద్ ను,ఏకగ్రీవంగా ప్రకటించగా, హరిప్రసాద్, మారీస్ పేట లోని తమనివాసం నుండి, హితులు, సన్నిహితులు, అభిమానులతొ, బైక్ ర్యాలీగా, టిబి రోడ్ లోని, అర్బన్ బ్యాంక్ కార్యాలయానికి తరలివచ్చారు. దారి పొడవునా బాణసంచా మోతలు, అభిమానులు, తెలుగుదేశం శ్రేణుల సంబరాలతొ ర్యాలి కొనసాగింది. ఈక్రమంలొ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ బ్యాంక్ ప్రాంగణానికి చేరుకుని, నూతన పాలక మండలికి అభినందనలు తెలిపారు. ఎన్నికల అధికారి కుర్రా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలొ పాలక మండలి సభ్యులకు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సమక్షంలొ నియామక పత్రాలు అందజేశారు. తెలుగుదేశం నుండి 7గురు, జనసేన నుండి 4గురు, బిజెపి నుండి ఒకరు, మొత్తం 12మంది డైరెక్టర్ల లొ, మంగమూరి హరిప్రసాద్ పాలకమండలి చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసద్ మాట్లాడుతు కూటమి నాయకత్వం గౌరవం పెంచే విధంగా, బ్యాంక్ పాలకమండలి ఏకగ్రీవం కావడం అభినందనీయమన్నారు. శతాధిక వత్సరాల చరిత్రగల అర్బన్ బ్యాంక్ ప్రాభవాన్ని మరింత పెంచేలా పాలకమండలి పనిచేయాలన్నారు. అనంతరం అర్బన్ బ్యాంక్ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన మంగమూరి హరిప్రసాద్అధ్యక్షతన, పాలక మండలి తొలి సమావేశాన్ని నిర్వహించారు. ఈక్రమంలొ తెలుగుదేశం పార్టీకి చెందిన డైరెక్టర్ అక్కిశెట్టి వెంకట్రావు ను,వైస్ చైర్మన్ గా, జనసేన పార్టీనుండి డైరెక్టర్ కోట పున్నారావును కోశాధికారిగా ప్రకటించారు. ఈసందర్భంగా పాలక మండలి చైర్మన్ మంగమూరి హరిప్రసాద్ మాట్లాడుతు అర్బన్ బ్యాంక్ సేవలను ఖాతాదారులకు మరింత చేరువ చేసేందుకు, బ్యాంక్ ను, గ్రౌండ్ ఫ్లోర్ లోకి మార్చనున్నట్లు తెలిపారు. ఈక్రమంలొ పలువురు, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు నూతన పాలకమండలి కార్యవర్గాని దుశ్శాలువలతొ, పూలదండలతొ సత్కరించి, తమ అభిమానం చాటుకున్నారు. ఈకార్యక్రమంలొ తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ తుది ఎంపిక జాబితా విడుదల



○ ఎక్స్ లో విడుదల చేసిన మంత్రి లోకేష్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** మెగా డీఎస్సీ తుది ఎంపిక జాబితాను విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తన ఎక్స్ ఖాతా ద్వారా విడుదల చేశారు. ఎన్నికల హామీని నెరవేర్చామని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన వెంటనే మెగా డీఎస్సీ ఫైల్ పై తన మొదటి సంతకం చేసినట్లు గుర్తు చేశారు. కేవలం 150 రోజుల్లోనే పాఠశాల విద్యాశాఖ విజయవంతంగా మెగా డీఎస్సీ–2025 ప్రక్రియను పూర్తిచేసిందని తెలిపారు. తుది ఎంపిక జాబితా ఉదయం 9.30 నుంచి అధికారిక వెబ్‌సైట్ www.apdsc.apcfss.in లో అందుబాటులో ఉంచారు.

ఫైనల్ లిస్ట్‌లో ఎంపికైన అభ్యర్థులందరికీ లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మైలురాయి బాధ్యత, సేవతో కూడిన ఉపాధ్యాయ వృత్తి ఆరంభానికి సంకేతమని, చిన్నారుల మేధస్సును తీర్చిదిద్దుతూ, విద్యా వ్యవస్థను బలోపేతం చేసూ AP మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను ప్రతి తరగతి గదికి చేర్చే దిశగా కొత్త ఉపాధ్యాయులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈ అవకాశాన్ని పొందలేకపోయిన అభ్యర్థులు నిరుత్సాహపడొద్దని, ఇకపై ప్రతి సంవత్సరం డీఎస్సీ నిర్వహణ జరుగుతుందని, పట్టుదలతో సిద్ధం అవుతూ ఉండాలని లోకేష్ సూచించారు.

## రాష్ట్రానికి యూరియా కేటాయించిన కేంద్రం




○ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రానికి 41,170 మెట్రిక్ టన్నుల యూరియా వివిధ పోర్టుల ద్వారా చేరుకోనుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సోమవారం కేంద్రం పలు రాష్ట్రాలకు యూరియాను కేటాయించిన సందర్భంగా రాష్ట్రానికి అధిక ప్రాముఖ్యతను ఇస్తూ 41,170 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించిందని మంత్రి అన్నారు. అందులో భాగంగా కృష్ణపట్నం పోర్ట్ ద్వారా 11,605, కాకినాడ పోర్ట్ ద్వారా 18,765 , మ్యాంగళూరు పోర్ట్ ద్వారా 2700, జైగడ్ పోర్ట్ ద్వారా 8100 మెట్రిక్ టన్నుల యూరియా ఈ నెల 16 నుండి 18 వ తేదీలోపు రవాణా జరుగుతుందని వెల్లడించారు. ఈ కేటాయింపుతో రైతులకు వెసులుబాటు లభిస్తుందని , రైతులకు ఎరువుల కొరత లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని, రాష్ట్రంలో ఇప్పటికే సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ రాష్ట్రానికి అధిక మొత్తంలో యూరియాను కేటాయించేలా చర్యలు చేపడుతున్న సీఎం చంద్రబాబునాయుడు కి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మంత్రి అచ్చెన్న అన్నారు.

వైసీపీ కావాలనే యూరియా సరఫరాపై అబద్ధాలు ప్రచారం చేస్తోందని మంత్రి తీవ్రంగా విమర్శించారు. రైతులను భయపెట్టి రాజకీయ లాభాలు పొందాలన్న ప్రయత్నం విజయవంతం కాదని ఆయన హితవు పలికారు. రైతు సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం అన్ని విధాల కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. వైసీపీ నేతలు రైతుల సమస్యలపై కన్నెత్తి చూడరని, నేడు తప్పుడు ప్రచారాలతో రైతాంగాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులు నమ్మకం కోల్పోయిన పార్టీగా వైసీపీ మిగిలిపోయిందని, వారి నాటకాలకు రైతాంగం మోసపోరని స్పష్టం చేశారు.

# యూరియా వినియోగం తగ్గించే రైతులకు ప్రొత్సాహకాలు

- ○ బస్తాకు రూ.800 ప్రొత్సాహకం రైతులకు ఇద్దాం
- ○ రాష్ట్రానికి కేంద్రమిచ్చే ప్రొత్సహాకాలను రైతులకే ఇద్దాం
- ○ సెంటు పట్టా తీసుకోవడానికి ముందుకురాని వారికి ప్రత్యామ్నాయం చూపండి
- ○ నియోజకవర్గానికో యానిమల్ హాస్టల్
- ○ కలెక్టర్ల సదస్సులో ప్రాథమిక, పరిశ్రమలు, సేవల రంగాలపై సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** కలెక్టర్లకాన్ఫరెన్స్ తొలిరోజు సమావేశంలో ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. రైతులు, యూరియా వినియోగం, ఆక్వా రైతులు, సెంటు పట్టా లబ్దిదారులకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన నిర్ణయాలను సీఎం చంద్రబాబు తీసుకున్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాకులో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్సులో ప్రాథమిక, పరిశ్రమలు, సేవల రంగాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. జీఎస్డీపీ పెంపునకు ఆయా రంగాల్లో అభివృద్ధి సాధించాలని సూచించారు. సమావేశంలో ప్రస్తావనకు వచ్చిన వివిధ అంశాలపై చర్చించారు. వ్యవసాయంపై చర్చ సందర్భంగా యూరియా సరఫరా గురించి ప్రస్తావనకు వచ్చింది. రాష్ట్రంలో యూరియా కొరత లేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మరింత పక్కా ప్రణాళికతో వెళ్లాలని సీఎం అధికారులకు, కలెక్టర్లకు సూచించారు. ఈ క్రమంలో యూరియా వినియోగం వల్ల ప్రజారోగ్యం దెబ్బతింటుందనే అంశం సదస్సులో చర్చకు వచ్చింది. యూరియా వినియోగం పెరిగితే.. క్యాన్సర్ వ్యాధి వచ్చే ప్రమాదం చాలా ఎక్కువగా ఉందని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా వినియోగం ఎక్కువైతే... ప్రమాదం ఏ స్థాయిలో ఉంటుందోననడానికి పంజాబ్ రాష్ట్రం ఓ కేస్ స్టడీ అని సీఎం చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రం క్యాన్సర్ కేసుల్లో టాప్–5లో ఉందని... యూరియా వినియోగం మరింతగా పెరిగితే.. టాప్–1కు వెళ్లిపోతుందని చంద్రబాబు అన్నారు. ఈ క్రమంలో యూరియా వాడకం తగ్గించే అంశంపై రైతుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చంద్రబాబు సూచించారు. ఇదే సందర్భంలో యూరియా వినియోగం తగ్గించిన రైతులకు ప్రొత్సహకాలిచ్చే విధానం తీసుకురావాలని చంద్రబాబు సూచించారు. యూరియా వినియోగం తగ్గిస్తే... పీఎం ప్రణామ్ కింద బస్తాకు రూ. 800ను ప్రొత్సాహకంగా కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి ఇస్తుంది కానీ... రైతులకు ఇవ్వడం లేదని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం ఆ డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడం కంటే... రైతులకు ఇవ్వడం ముఖ్యమమన్నారు. రాష్ట్రానికి వచ్చే సబ్సిడీని రైతులకే ఇవ్వాలని చంద్రబాబు సూచించారు. దీనికి సంబంధించిన విధి విధానాలను త్వరలో రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**బలభద్రపురంపై అధ్యయనం చేయండి**

బలభద్రపురంలో క్యాన్సర్ కేసుల నమోదు అవుతున్న అంశాన్ని మంత్రి నాదెండ్ల ప్రస్తావించారు. ఆ గ్రామంలో ఎరువులు, యూరియా వినియోగం కూడా ఎక్కువగా ఉందనే రీతిలో అధికారులు చెబుతున్నారని మంత్రి పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందించారు. బలభద్రపురంలో క్యాన్సర్ కేసుల నమోదు కావడంపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఎరువులు, పురుగుమందుల వినియోగం వల్లే ఈ పరిస్థితి వచ్చిందా..? అనే అంశాన్ని కూడా పరిశీలించాలని సీఎం సూచించారు. రసాయన ఎరువుల కారణంగా మన మిరపను చైనా తిరస్కరించిందని, ప్రజలు తినే వెరైటీలనే పండించేలా రైతుల్లో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి చెప్పారు. డిమాండ్, సప్లైకి అనుగుణంగా పంటలు పండించేలా రైతులను చైతన్య పరచటంలో కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఉద్యాన ఉత్పత్తులు, ఎగుమతుల విషయంలో క్లస్టర్ అప్రోచ్ ఉండాలని చెప్పారు. కోనసీమ కంటే అనంతపురం తలసరి ఆదాయం, జీఎస్డీపీ ఎక్కువ ఉందని గుర్తు చేశారు. వివిధ వాణిజ్య, ఉద్యాన పంటల కారణంగా ఆయా జిల్లాల్లో పరిస్థితి మారుతుందని వివరించారు. ఆయిల్ పామ్ తోటల సాగు ఉమ్మడి గోదావరి జిల్లాలకు గేమ్ ఛేంజర్ గా మారిందని చెప్పారు. ఇక ఏజెన్సీలో కాఫీ కంటే మిరియాలు ఎక్కువ ఆదాయం తెచ్చిపెడుతున్నాయని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా వస్తున్న సమస్యలతో కొన్ని పంటలపై ప్రభావం పడుతోందని అన్నారు. హెచ్డీ బర్లీ పొగాకు 20 మిలియన్ కేజీలు కొనుగోలు చేశామని చెప్పారు. మామిడికి కిలో రూ. 4 చొప్పున రూ. 200 కోట్ల వరకూ రైతులకు చెల్లించామన్నారు. ఉల్లి పంట కొనుగోలు విషయంలో ప్రతిపక్షం డ్రామాలు ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం క్వింటాను రూ. 1200తో కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ఏం చేస్తే రైతులకు లాభం వస్తుందో అధ్యయనం చేసి ఆయా మార్గాలు రైతులు అనుసరించేలా చైతన్యపర్చాలని సీఎం చెప్పారు. రైతులకు నష్టం రాకుండా రవాణా ఛార్జీలు భరించి ప్రాసెసింగ్ కు పంపించేందుకు అవకాశం ఉందని.. ఈ తరహాలోనే కలెక్టర్లు ఆలోచనలు చేయాలని చంద్రబాబు సూచించారు.

**ఆక్వా పరిశ్రమను ఆదుకుంటాం... పాడి పరిశ్రమను అభివృద్ధి చేస్తాం**

ఇక రాష్ట్రంలో ఆక్వా రంగాన్ని ఆదుకునేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. ఇప్పటికే కేంద్రానికి లేఖలు రాశామని చెప్పారు. ఏపీలో 5 లక్షల ఎకరాల్లో ఆక్వా కల్చర్ ఉందని... ఇప్పటికే రూ. 1.50కే యూనిట్ విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. రాయితీ విద్యుత్ అందించేందుకు జోన్–నాన్ జోన్ కింద విభజించారని... రిజిస్ట్రేషన్ చేయించుకోని వారికి ఇంకా రాయితీ విద్యుత్ అందడం లేదని.. నెల రోజుల్లో రిజిస్ట్రేషన్లు పూర్తి చేయించాలని చంద్రబాబు ఆదేశించారు. ఇక ఆక్వా ఉత్పత్తులకు ట్రేసబులిటీ, సర్టిఫికేషన్ తప్పకుండా ఉండాలని స్పష్టం చేశారు. సర్టిఫికేషన్ లేకుండా ఆక్వా సాగు చేస్తే... వాటికి డిమాండ్ ఉండదని చెప్పారు. అలాగే పౌల్ట్రీ వేస్ట్ ఇష్టానుసారంగా పడేయకుండా చూసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. నియోజకవర్గానికో యానిమల్ హాస్టల్ నిర్మాణం చేపట్టాలని చంద్రబాబు ఆదేశించారు. అర్బన్ నియోజకవర్గాలను మినహాయించి 157 నియోజకవర్గాల్లో యానిమల్ హాస్టళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. గోశాలల నిర్మాణం వల్ల పశు సంపద రాష్ట్రానికి రిటన్ గిఫ్ట్ ఇస్తోందని చెప్పారు. జీఎస్డీపీ కాంట్రిబ్యూషనులో పశుసంవర్ధక శాఖదేనని ముఖ్యమంత్రి చెప్పారు. పాడి పరిశ్రమ అనేది చక్కటి ఆదాయ మార్గంగా ఉంటుందని... దాణా ఉత్పత్తిని డ్వాక్రా గ్రూపులకు అనుసంధానం చేస్తే వారికి మంచి ఆదాయం వచ్చేలా చేయగలమని ఆ దిశగా ఆలోచన చేయాలని చంద్రబాబు ఆదేశించారు.


**పేదలకు ఇల్లు... ఇంటి స్థలం ఇదే ప్రయార్టీ**

వచ్చే నాలుగేళ్లల్లో ప్రతి అర్హుడికీ ఇల్లు లేదా ఇంటి స్థలం ఇచ్చేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దీన్ని హై ప్రయార్టీగా తీసుకోవాలని ఆదేశించారు. పేదలకు ఇల్లు లేదా ఇంటి స్థలం అందించే అంశంపై అందుబాటులో ఉన్న డేటాను వినియోగించుకుని... అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు లేదా ఇంటి స్థలం అందించాలన్నారు. అర్బన్ ఏరియాలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు ఇచ్చేలా ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ మేరకు భూమిని గుర్తించాలని సూచించారు. ఇక అర్బన్ ప్రాంతాల్లో భూ లభ్యత లేకుంటే గ్రూప్ హౌసింగ్ విధానాన్ని అవలంభించాలని చెప్పారు. ఇక కొన్ని చోట్ల సెంటు పట్టా తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని అధికారులు, మంత్రులు చెప్పారు. దీనిపై స్పందించిన సీఎం... సెంటు పట్టా తీసుకోవడానికి ఆసక్తి చూపని లబ్దిదారులకు ప్రత్యామ్నాయం చూపాలని స్పష్టం చేశారు. సెంట్ పట్టా భూమి నిరుపయోగంగా ఉంటే... ఆ భూమిని ఎంఎస్ఎంఈలు వంటి వాటికి కేటాయించాలని సూచించారు. పోర్టులు, ఎయిర్ పోర్టుల వద్ద పర్యాటకం పెరిగేలా ఎకోసిస్టం రూపొందించాలని చంద్రబాబు ఆదేశించారు.

ఆర్థిక లావాదేవీల కేంద్రంగా టౌన్ షిప్‌లను అభివృద్ధి చేయాలని సూచించారు. పర్యాటక ప్రాజెక్టుల ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని ముఖ్యమంత్రి చెప్పారు.

# ఆక్వాను ఆదుకోవాలని కేంద్రానికి లేఖలు రాసిన ముఖ్యమంత్రి

- ○ అమెరికా సుంకాలతో ఏపీలో ఆక్వాకు తీవ్ర నష్టాలు వచ్చాయని కేంద్ర మంత్రులకు వివరించిన సీఎం
- ○ దేశీయ వినియోగంతో పాటు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని ముఖ్యమంత్రి వినతి
- ○ ఉత్తర భారతానికి ఆక్వా ఉత్పత్తుల రవాణాకు డెడికేటెడ్ రైళ్లు నడపాలని కోరిన సీఎం
- ○ ఆర్థిక, వాణిజ్య, మత్స్యశాఖల మంత్రులకు వేర్వేరుగా లేఖలు రాసిన సీఎం చంద్రబాబు




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** అమెరికా సుంకాలతో ఇబ్బందిపడుతున్న ఆక్వా రైతాంగాన్ని ఆదుకోవాలని కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఆక్వా రైతులు నష్టపోకుండా కేంద్ర స్థాయిలో కొన్ని నిర్ణయాలు తీసుకోవాలని కోరుతూ చంద్రబాబు వివిధ కేంద్ర మంత్రులకు లేఖలు రాశారు. దేశీయంగానూ ఆక్వా ఉత్పత్తుల వినియోగం పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్, వాణిజ్య–పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌గోయల్, మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ కు సీఎం విడివిడిగా లేఖలు రాశారు. జీఎస్టీ, ఆర్థిక వెసులుబాట్లు వంటి అంశాలను పరిశీలించాలని కేంద్ర ఆర్థిక మంత్రికి, ఇతర దేశాలతో ఆక్వా విషయంలో ఒప్పందాలు కుదుర్చుకునేలా చూడాలని కేంద్ర వాణిజ్య–పరిశ్రమల శాఖ మంత్రికి, దేశీయ మార్కెట్ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర మత్స్య శాఖ మంత్రికి లేఖలు రాశారు. రాష్ట్రంలో ఆక్వా రైతులు, ఆ రంగంపై ఆధారపడిన కుటుంబాలు తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయని సీఎం తన లేఖల్లో పేర్కొన్నారు. అలాగే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను చంద్రబాబు కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. జాతీయ స్థాయిలో జరిగే రొయ్యల ఎగుమతుల్లో ఏపీ నుంచి 80 శాతం వాటా ఉందని.. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో 34 శాతం వాటా ఏపీ కలిగి ఉందని సీఎం పేర్కొన్నారు. సుమారు రూ. 21,246 కోట్ల విలువైన సముద్ర, మత్స్య ఉత్పత్తులు ఏపీ నుంచి ఎగుమతి అవుతున్నాయని సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఆక్వా రంగం మీద ఆధారపడి 2.5 లక్షల ఆక్వా రైతు కుటుంబాలు, 30 లక్షల మంది ఆక్వా అనుబంధ రంగాలపై ఆధారపడిన వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర మంత్రులకు రాసిన లేఖల్లో సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమెరికా విధించిన సుంకాలతో రొయ్యలు ఎగుమతులపై ఎక్కువగా ప్రభావం పడిందని ఆయన స్పష్టం చేశారు. దాదాపు రూ. 25 వేల కోట్ల మేర నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నట్టు సీఎం తన లేఖల్లో పేర్కొన్నారు. 50 శాతం మేర ఎగుమతుల ఆర్డర్లు రద్దు అయ్యాయయని లేఖలో వివరించారు. దాదాపు 2 వేల కంటైనర్లలో జరుగుతున్న ఎగుమతులపై రూ. 600 కోట్ల మేర సుంకాల భారం పడిందని తెలిపారు. ఆక్వా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని.. ఆక్వా ఫీడ్ ఉత్పత్తిదారులతో జరిపిన చర్చల ఫలితంగా కేజీ ఆక్వా ఫీడ్ ఎమ్మార్పీపై రూ. 9 మేర తగ్గించ గలిగామన్నారు. సబ్సిడీతో ట్రాన్సఫార్మర్లు సరఫరా చేసేందుకు కూడా ఆలోచన కూడా చేస్తున్నామని సీఎం తన లేఖల్లో వివరించారు.

**ఆక్వా రుణ వడ్డీలపై మారటోరియం విధించండి**

రాష్ట్రం ప్రభుత్వంతో పాటు కేంద్ర సాయం కూడా ఆక్వా రైతులను నిలబెట్టేందుకు అవసరమవుతుందని కేంద్ర మంత్రులకు రాసిన లేఖలో ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఎగుమతి దారులకు..ఆక్వా కంపెనీలకు బ్యాంకుల నుంచి ఆర్థిక సహాయం, వడ్డీ చెల్లింపులపై 240 రోజుల పాటు మారటోరియం విధించాలని కోరారు. వడ్డీ రాయితీ కల్పించడంతోపాటు... ఫ్రోజెన్ రొయ్యలపై ఉన్న 5% జీఎస్టీని తాత్కాలికంగా మినహాయించడం వంటి చర్యలు తీసుకోవాలని సీఎం లేఖల్లో కోరారు. ఈ చర్యలతో పాటు అమెరికా కాకుండా ఇతర దేశాలకు ఆక్వా మార్కెట్ ను విస్తరించే అంశంపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. యూరోపియన్ యూనియన్, సౌత్ కొరియా, సౌదీ, రష్యా దేశాల్లో ఆక్వా ఎగుమతులు పెరిగేలా ఆయా దేశాలతో ఫ్రీ ట్రేడ్ ఒప్పందాలు కుదుర్చుకునే అంశాలను పరిశీలించాలని లేఖల్లో ముఖ్యమంత్రి కోరారు. ఎగుమతి దారులకు మధ్యంతర ఆర్థిక సహాయం, ఎగుమతులపై విధించే సుంకాలు, పన్నుల ఉపశమనం పథకంపై మరింత స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యూరోపియన్ యూనియన్ దేశాలకు సీ–ఫుడ్ సరఫరా చేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్టు ఎగుమతిదారులు తనకు విజ్ఞప్తి చేశారని సీఎం చంద్రబాబు వివరించారు.

**ఆక్వా ఉత్పత్తుల రవాణాకు డెడికేటెడ్ రైళ్లు వేయండి**

ఈ చర్యలతో పాటు దేశీయంగా ఆక్వా మార్కెట్ పెంచుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం రూ. 100 కోట్లతో కార్పస్ ఫండ్ కేటాయించాలని కోరారు. కోల్డ్ స్టోరేజీలు, హైజినిక్ ఫిష్, సీ–ఫుడ్ మార్కెట్ల ఏర్పాటు చేయాలని కోరారు.

రైతుల నుంచి ఆక్వా ఉత్పత్తులను నేరుగా మార్కెట్లకు తరలించేలా ఆంధ్రప్రదేశ్ రొయ్యల ఉత్పత్తిదారుల సమన్వయ కమిటీని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అలాగే దేశంలోనూ సీ–ఫుడ్ వినియోగం పెంచేలా చర్యలు చేపట్టాలని సీఎం కోరారు. ఆక్వా ఉత్పత్తుల్లో మంచి ప్రొటీన్ ఉంటుందని.. ఇది మంచి బలవర్ధకరమైన ఆహారమనే విషయాన్ని అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీని కోసం ఎన్ఎఫ్డీబీ వివిధ రాష్ట్ర ప్రభుత్వాలతో అవగాహన కుదుర్చుకోవాలని సూచించారు. జాతీయ సగటు ప్రకారం ఏడాదికి తలసరి వినియోగం 20–30 కిలోల చేపలను ఆహారంగా తీసుకోవాలని ప్రస్తుతం 12–13 కిలోలను మాత్రమే వినియోగిస్తున్నారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో సీ–ఫుడ్ ను ప్రోత్సహిస్తే ప్రజలకు ఆరోగ్య సమస్యలను తగ్గించడంతోపాటు... ఆక్వా రైతులకు అండగా నిలిచినట్టవుతుందని తెలిపారు. దక్షిణ భారత దేశం నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు ఆక్వా రవాణ కోసం డెడికెటెడ్ రైళ్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా మత్స్యకారులకు రూ. 1 లక్ష వరకు వన్–టైమ్ టాప్–అప్ రుణాలు ఇవ్వాలని కోరారు. కొత్త మార్కెట్లలో పోటీతత్వాన్ని పెంచడానికి ఎఫ్ఐడీఎఫ్ ద్వారా ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, కోల్డ్ చైన్ సౌకర్యాలను అభివృద్ధి చేయాలని సీఎం కోరారు. ఐకార్–సీఐబీఏ, ఐకార్–ఎన్‌బీఎఫ్‌జీఆర్ వంటి సంస్థల ప్రాంతీయ కార్యాలయాలను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని సీఎం తన లేఖల్లో కేంద్ర మంత్రులను కోరారు.

# మెగా డీఎస్సీలో 'బీసీ' సత్తా




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** బీసీ నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న సత్ఫలితాలిస్తున్నాయి. వివిధ పోటీ పరీక్షల నిమిత్తం బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా డీఎస్సీ, సివిల్స్ కోచింగ్ ను వెనుకబడిన తరగతుల నిరుద్యోగ యువతకు కూటమి ప్రభుత్వం శిక్షణ అందజేసింది. ఈ శిక్షణతో తాజాగా నిర్వహించిన డీఎస్సీ సహా పలు ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షల్లో బీసీ నిరుద్యోగ అభ్యర్థులు సత్తా చాటారు. కూటమి ప్రభుత్వం అందజేసిన శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ, 238 మంది టీచర్ పోస్టులు సాధించగా, బ్యాంకు, పోలీసు సహా ఇతర ప్రభుత్వ పోస్టులను కూడా బీసీ అభ్యర్థులు సాధించారు. 2024 జూన్ లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బీసీలకు వెన్నుదన్నుగా నిలిచింది. ముఖ్యంగా బీసీ యువతను ఉన్నత స్థానాల్లో నిలపాలన్న లక్ష్యంతో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ స్టడీ సర్కిల్ ద్వారా మెగా డీఎస్సీ, సివిల్స్ సర్వీసెస్ కు ఉచిత కోచింగ్ అందజేసింది. 16,347 టీచర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహణ చేపట్టింది. అత్యధిక ఉపాధ్యాయ పోస్టులను బీసీ నిరుద్యోగ యువత సాధించాలన్న లక్ష్యంతో బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా అన్ని జిల్లా కేంద్రాల్లోనూ ఉచిత కోచింగ్ సెంటర్లు ప్రారంభించింది. జిల్లా కేంద్రానికి సుదూరంలో ఉండే మహిళలు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేసుకునే వారి సౌలభ్యం కోసం ఆన్ లైన్ ద్వారా కూడా ఉచిత డీఎస్సీ శిక్షణ అందజేసింది. ఇలా ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా 6,470 మందికి బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా మెగా డీఎస్సీ సన్నద్ధతకు ఉచిత శిక్షణ అందజేశారు. సివిల్ సర్వీసెస్ కు కూడా 83 మంది బీసీ అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం ఉచిత శిక్షణ అందజేసింది. రాష్ట్ర స్థాయిలో విజయవాడలోని గొల్లపూడి బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఉచిత శిక్షణ అందజేసింది.

**241 మంది టీచర్లగా బీసీ బిడ్డలు...**

బీసీ యువత అత్యధిక ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్న సంకల్పంతో నిర్వహించిన ఉచిత డీఎస్సీ, సివిల్ సర్వీసెస్ శిక్షణ ఎంతో దోహదం చేసింది. బీసీ స్టడీ సర్కిళ్ల ఉచిత శిక్షణ కేంద్రాల ద్వారా 1,674 మందికి, ఆన్ లైన్ లో ద్వారా మరో 4,774 మందికి.. మొత్తం 6,470 మందికి ఉచిత శిక్షణ డీఎస్సీ శిక్షణ అందజేశారు. వారిలో 241 మంది బీసీ అభ్యర్థులు టీచర్లగా ఎంపికయ్యారు. కర్నూల్ నుంచి 36, అనకాపల్లి నుంచి 40, నెల్లూరు నుంచి 17, కృష్ణా నుంచి 10 మంది బీసీ అభ్యర్థులు టీచర్లగా ఎంపికయ్యారు. ఈస్ట్ గోదావరి నుంచి ఆరుగురు, చిత్తూరు నుంచి ఎనిమిది, పల్నాడు నుంచి ముగ్గురు, కడప నుంచి 12 మంది ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. పార్వతీపురం మన్యం,బాపట్ల, నంద్యాల నుంచి ఒక్కొక్కరు, అనంతపురం, ఏలూరు, శ్రీకాకుళం నుంచి ఏడుగురు చొప్పున, అన్నమయ్య, కోనసీమ నుంచి ముగ్గురు చొప్పున టీచర్ పోస్టులకు ఎంపికయ్యారు. గుంటూరు నుంచి 12 మంది, కాకినాడ నుంచి నలుగురు, ఎన్టీఆర్ జిల్లా నుంచి ఆరుగురు, ప్రకాశం నుంచి ఎనిమిది మంది గురువులుగా ఎంపికయ్యారు. సత్యసాయి జిల్లా నుంచి ఇద్దరు, తిరుపతి నుంచి 13 మంది, విశాఖపట్నం నుంచి అయిదుగురు, విజయనగరం నుంచి 14 మంది, వెస్ట్ గోదావరి 12 మంది బీసీ అభ్యర్థులుగా టీచర్లగా బాధ్యతలు చేపట్టనున్నారు.

**సత్ఫలితాలిచ్చిన సివిల్ సర్వీసెస్ కోచింగ్**

మెగా డీఎస్సీతో పాటు సివిల్ సర్వీసెస్ కోచింగ్ కూటమి ప్రభుత్వం అందజేసింది. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఈ కోచింగ్ వల్ల కూడా బీసీ నిరుద్యోగ యువత ఎంతో లబ్ధిపొందింది. కేవలం అయిదు నెలల పాటు సాగిన ఈ కోచింగ్ వల్ల గ్రూప్ 2 మెయిన్స్ కు 12 మంది, ఆర్.ఆర్.బి లెవల్ 1కు పది మంది, ఎఫ్.ఆర్.వో ప్రిలిమ్స్ కు ఇద్దరు, మెయిన్ కు ఒకరు అర్హత సాధించారు. ఆరుగురు అభ్యర్థులు పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. ఆర్.ఆర్.బి లోకో పైలట్ గా మరో అభ్యర్థి ఎంపికయ్యాడు.



బెల్, గేట్ లో ఒక్కొక్కరు అర్హత సాధించారు. ఎస్.ఐ ప్రిలిమ్స్ ఎగ్జామ్ లో మరో అభ్యర్థి విజయం సాధించాడు. ఇలా సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ ను బీసీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకున్నారు.

**ప్రభుత్వ ఉద్యోగులుగా బీసీ యువత**

అత్యధిక ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీ యువత స్థిరపడాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం. ఇందుకోసం ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ, సివిల్ సర్వీసెస్ కోసం బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ నిర్వహించాం. ప్రభుత్వ సంకల్పాన్ని బీసీ యువత నిజం చేస్తూ, 241 మంది ఉపాధ్యాయులుగా నియమిమతులయ్యారు. సివిల్ సర్వీసెస్ కోచింగ్ వల్ల కూడా కొందరు బీసీ అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఇదే స్ఫూర్తితో బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా బీసీ నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వనున్నాం. బీసీ నిరుద్యోగ యువతకు డీఎస్సీ, సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వం ఏపీ బీసీ సంక్షేమ శాఖకు స్కోచ్ అవార్డు అందజేసింది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467